అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 26-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 268 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



అలా అనొద్దు

మత, లింగ వివక్ష వ్యాఖ్యలు చేయొద్దు

న్యాయమూర్తులకు సుప్రీం సూచన



న్యూఢిల్లీ : భారత భూభాగంలోని ఏ ప్రాంతాన్నీ పాకిస్తాన్ అనలేమని, అలా అనడం రాజ్యాంగం ప్రకారం ప్రాథమికంగా తప్పని, ప్రాదేశిక సమగ్రతకు భంగకరమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మతోన్మాదం లేదా లింగ వివక్షను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని న్యాయమూర్తులకు సూచించింది. ఇటీవల కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీశానంద ఒక కేసు విచారణ సందర్భంగా బెంగళూరులో ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతాన్ని పాకిస్తాన్‌గా ప్రస్తావించడాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. పైగా ఆ కేసును వాదిస్తున్న మహిళా న్యాయవాదిని ...6లో

ఉపాధికి భద్రత

విద్యార్థుల నైపుణ్యశిక్షణ ప్రభుత్వం బాధ్యత

- త్వరలో మరో 35 వేల ఉద్యోగాలు
- వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్
- కనీస ప్రమాణాల్లేని ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు :సీఎం హెచ్చరిక



స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ స్కిల్స్ ప్రోగ్రాం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చటంతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని చెప్పారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాలు నేర్పించే గమ్యస్థానంగా హైదరాబాద్‌ను విశ్వ వేదికపై నిలబెట్టేం దుకు అందరి సహకారం కావాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో గత పదేండ్లలో నిరుద్యోగం పెరిగిందనీ, టీఎస్పీఎస్సీ వెబ్‌సైట్లోనే 30 లక్షల మంది నమోదు చేసుకున్నారని, రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు వీధిన పడే పరిస్థితి ఉందని అన్నారు. ఈ సమస్య తీవ్రతను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, తదితర ఉద్యోగాలన్నీ కలిపి మరో 35 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే రెండుమూడు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ జేఎన్టీయూ ఆడిటోరియంలో రాష్ట్రంలోని 38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న యువతను తయారు చేసి ఉపాధికి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులతో చర్చించామనీ, వారు ఇచ్చిన ప్రతిపాదనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో డిగ్రీలో చేరిన పది వేల మంది డిగ్రీ విద్యార్థులు తమ పట్టా పొందే నాటికి నైపుణ్యాన్ని నేర్చుకునేలా ఈ ప్రోగ్రాం రూపకల్పన చేసినట్టు చెప్పారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉద్యోగాలకు ఢోకా ఉండదని తెలిపారు. అవసరమైన నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎక్విప్ సంస్థను, ఈ కోర్సు సిలబస్‌ను రూపొందించిన బీఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ...13లో

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

విధివిధానాలు రూపొందించండి

పీఎంఏవై నుంచి గరిష్టంగా ఇండ్లు సాధించాలి

రాజీవ్ స్వగృహ ఇండ్లకు వేలం

సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



వివరాలు 13లో..



మూసీ సుందరీకరణతో వేల కోట్ల కుంభకోణం

పాకిస్తాన్ కంపెనీకి అప్పగించాలని సర్కార్ యత్నం

పేదలకు ఆశ్రయం కల్పించిన తరువాతే ఇండ్లు కూల్చాలి

'హైడ్రా'మాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసెడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఫతేనగర్‌లో ఎస్టీపీ పరిశీలన

నవతెలంగాణ - కూకట్‌పల్లి/బాలానగర్

మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మూసీ సుందరీకరణను సీఎం రేవంత్ రెడ్డి ఓ పాకిస్తాన్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి ఫతేనగర్ ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పరిశీలించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రేటర్ ...6లో

మంత్రుల అరాచకాలు ఎండగడదాం

వారి అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా పర్యటనలు : కేటీఆర్

వివరాలు 6లో..

అటవీ జంతువుల నుంచి జీవనోపాధిని రక్షించాలి

ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల పేరుతో తొలగింపులు ఆపాలి

పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తేయాలి : ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అటవీ జంతువులు, విచ్చలవిడి జంతువులు పంటలు నాశనం చేయడం నుంచి జీవనోపాధిని రక్షించాలని, ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల తొలగింపును వన్యప్రాణుల సంరక్షణ పేరుతో ఆపాలని, పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలని ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ నినదించింది. మానవ వన్యప్రాణులు, విచ్చలవిడి జంతువుల బెడదపై అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో బుధవారం నాడిక్కడ పార్లమెంట్ స్ట్రీట్ వద్ద ధర్నా జరిగింది. ఈ ఆందోళనలో కేరళ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్, తెలంగాణ, యూపీ, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది రైతులు పాల్గొన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ధర్నాను ప్రారంభించగా, ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే, ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి. శివదాసన్, ఏఐకేఎస్ తమిళనాడు ఉపాధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు ఆర్ సచ్చితానందం ప్రధాన వక్తలుగా మాట్లాడారు. ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా, ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి పి. కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం కార్యదర్శి, ఏఐకేఎస్ సంయుక్త కార్యదర్శి వల్సన్ పనోలి, వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు ఈ ధర్నాలో ప్రసంగించారు.

డిమాండ్లు

1. భారతీయ అటవీ చట్టం-1927, వన్యప్రాణుల రక్షణ చట్టం-1972, అటవీ సంరక్షణ చట్టం-1980ను వన్యప్రాణుల దాడి నుంచి మానవ ప్రాణం, ఆస్తులు, జీవనోపాధికి రక్షణ కల్పించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం సవరించాలి. జీవనోపాధిని రక్షించడానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి.
2. క్రిములు, స్టెరిలైజేషన్, వైల్డ్ జంతువుల బెదిరింపులను ...6లో

పెన్షనర్లకు వైద్య సౌకర్యాలు కుదించొద్దు

టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి డిమాండ్


హైదరాబాద్‌లో కేంద్రీయ సదన్ వద్ద ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడనాడాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) డిమాండ్ చేసింది. వైద్య సౌకర్యాలను కుదించొద్దని కోరింది. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్సీసీపీఏ) పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కోఠి మహిళా విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న కేంద్రీయ సదన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదో పే రివిజన్ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య సౌకర్యాల్లో కోత విధించడం సరైంది కాదన్నారు. ఈ విధానాలను కేంద్రం మానుకోవాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం అమలు చేసే ఆరోగ్య పథకాలను మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు. టీఏపీఆర్‌పీఏ సీనియర్ నాయకులు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిపై ప్రయివేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీజీహెచ్ఎస్‌కు ఉద్యోగులు ప్రతి నెలా తమ జీతంలో చందా చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. రిటైరైన తర్వాత కూడా 120 నెలల సబ్‌స్క్రిప్షన్ చెల్లించారని వివరించారు. కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేసి వైద్య సౌకర్యాలను కుదించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ అధికారుల సంఘం (సీసీజీజీఓఓ) జాతీయ చైర్మెన్ వి కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఆర్ఎఫ్ ...5లో

అడ్డగోలు పెట్రో దోపిడీ



70 డాలర్లకు తగ్గిన ముడి చమురు

అయినా భారత్‌లో హెచ్చు ధరలు కొనసాగింపు

- ప్రజలపై రూ.2 లక్షల కోట్ల భారం
- మరోవైపు ఎక్సైజ్ సుంకం పెంపు



న్యూఢిల్లీ : అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంటున్నప్పటికీ.. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం నింగిలోనే ఉన్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 92 డాలర్లుగా ఉండగా.. తాజాగా 70 డాలర్ల దిగువకు పడిపోయింది. సెప్టెంబర్ 9న ఏకంగా 69 డాలర్లుగా పలికింది. ఆరు నెలల్లో దాదాపుగా 20 శాతం ధరలు దిగివచ్చాయి. 2021 డిసెంబర్ నాటి కనిష్ట స్థాయిలో చమురు ధరలు పలుకుతున్నాయి. అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను హెచ్చు స్థాయిలోనే కొనసాగిస్తూ.. ప్రజల జేబులకు చిల్లులు పెడుతోంది. ముడి చమురుపై కేవలం 10 డాలర్లు తగ్గితే ఏడాదికి రూ.1.08 లక్షల కోట్లు ఆదా అవుతోంది. ఇటీవల దాదాపు 20 డాలర్లు పైన తగ్గడంతో మోడీ సర్కార్ ఖజానాకు ఏడాదికి రూ.2 లక్షల కోట్లు పైనే సమకూరనుంది. అంటే ఆ మొత్తాన్ని ప్రజలపై అదనంగా భారం మోపుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోన్న నేపథ్యంలో ఇటీవలి సార్వత్రిక ఎన్నికలకు రెండేండ్ల ముందు నుంచే ధరలను సవరించడం ఆపేసింది. పెంచిన ధరలను కొనసాగిస్తోంది. చివరి సారిగా 2022 ఏప్రిల్‌లో లీటర్ పెట్రోల్, డీజిల్ మీద నామమాత్రంగా రూ.2 ధర తగ్గించింది. ప్రస్తుతం ...13లో

రెండో దశ ప్రశాంతం

కాశ్మీర్‌లో 56 శాతానికిపైగా పోలింగ్



శ్రీ మాతా వైష్ణో దేవీ స్థానానికి అత్యధికంగా 75.29 శాతం

ఖాన్‌సాహిబ్‌కు నియోజకవర్గంలో 67.70 శాతం

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

పోటీ చేసిన ప్రముఖుల్లో మాజీ సీఎం ఒమర్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

అక్టోబర్ 1న మూడో దశ..అదే నెల 8న ఫలితాలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దశ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. సాయంత్రం ఆరు గంటలకు ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం పోలింగ్ 56 శాతంగా నమోదైందని ఎన్నికల సంఘం(ఈసీ) డేటా చూపించింది. ఈసీ డేటా ప్రకారం.. జమ్మూ ప్రాంతంలో శ్రీ మాతా వైష్ణో దేవీ స్థానానికి అత్యధికంగా 75.29 శాతం ఓటింగ్ నమోదైంది. తర్వాతి స్థానాల్లో పూంచ్-హవేలీ (72.71 శాతం), గుల్బ్‌గార్హ్(ఎస్టీ) (72.19 శాతం), సురన్‌కొటే (72.18 శాతం)ఉన్నాయి. ఇక కాశ్మీర్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 15 నియోజక వర్గాల్లో ఖాన్‌సాహిబ్ స్థానానికి అధికంగా 67.70 శాతం పోలింగ్ నమోదైంది. తర్వాతి స్థానాల్లో కంగన్ (ఎస్టీ) (67.60 శాతం), చ్రార్-ఇ-షరీఫ్ (66 శాతం) లు ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు అందిన సమాచారం ప్రకారం హబ్బకడల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 15.80 శాతం ఓటింగ్ రికార్డ యియింది. ఎన్నికలు సజావుగా ...13లో

హైడ్రాలో 169 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి

డిప్యుటేషన్ పద్ధతిలో నియామకాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 'హైడ్రా' సంస్థకు 169 పోసుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులన్నింటినీ డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేస్తారు. ఆయా పోస్టులను ...6లో

చెక్కుచెదరని బంధం

పాలస్తీనా రాయబారిని ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో సత్కరించిన క్యూబా



హవానా: క్యూబా, పాలస్తీనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం గావించడంలో విశేష కృషి చేసిన పాలస్తీనా రాయబారి అక్రమ్ మహ్మద్ సమాన్‌ను ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో క్యూబా విదేశాంగ శాఖ ఉప మంత్రి జోసెఫినా విడాల్ ఫెరీరో సత్కరించారు. సోదర దేశ రాయబారి పదవీ కాలం త్వరలో ముగియనున్న సందర్భంగా క్యూబా అధ్యక్షుని తరపున ఆయనకు ఈ మెడల్‌ను ఫెరీరో ప్రదానం చేశారు. పాలస్తీనా సమస్యకు పరిష్కారం ...6లో

పని గంటలు పెంచితే ప్రమాదమే

పనితీరు మందగిస్తుంది

ఉద్యోగుల ఆరోగ్యం పైనా ప్రభావం

పని-జీవితం మధ్య సమతూకం అవసరం

పరిశోధకుల వెల్లడి



దేశ పురోభివృద్ధి కోసం యువత వారంలో 70 గంటల పాటు పనిచేయాలని గత సంవత్సరం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సలహా ఇచ్చారు. అమెరికాలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలన్ మస్క్ ఓ అడుగు ముందుకు వేసి విజయాన్ని అందుకోవాలంటే వారానికి వంద పని గంటలు ఉండాలని సూచించారు. అయితే దీర్ఘకాల పని గంటలు సత్ఫలితాలను ఇవ్వకపోగా ప్రతికూల పరిణామాలకు దారితీస్తాయి. ఉద్యోగుల సామర్థ్యం దీర్ఘకాలం కొనసాగాలంటే ఆరోగ్యకరమైన పని-జీవితం సమతూకంగా ఉండాలని పరిశోధనలు చెబుతున్నాయి.



న్యూఢిల్లీ : పని ప్రదేశంలో ఎక్కువ గంటలు గడపడం ఉద్యోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది కూడా. 26 సంవత్సరాల అన్నా సెబస్టియన్ పెరయిల్ అనే అకౌంటెంట్ మరణం ఉద్యోగుల పని ఒత్తిడికి, మానసిక ఆందోళనకు అద్దం పడుతోంది. ఆమె నాలుగు నెలల క్రితమే ఓ సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆ సంస్థ ఇండియా విభాగం చైర్మన్‌కు పెరయిల్ తల్లి ఓ లేఖ రాస్తూ తన కుమార్తెకు పనిభారం అధికమైందని, తనకు విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిద్ర, ఆహారం కూడా మానేసిందని ఆరోపించారు.

మనుగడ కోసం...

పనిని, జీవితాన్ని సమతూకం చేసుకునే ఉద్యోగులు విధి నిర్వహణలో పెద్దగా ఇబ్బందులు పడరు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ సమర్థతతో ముందుకు సాగుతారు. పని, జీవితం...వీటిని బ్యాలెన్స్ చేసుకుంటే జీవన నాణ్యత మెరుగుపడుతుంది. అటు ఉద్యోగంలోనూ మంచి పనితీరు కనపడుతుంది. వాస్తవానికి మన దేశంలో ...13లో

పని ఒత్తిడితో కుర్చీలోనే కుప్పకూలిన మహిళా ఉద్యోగి

లక్నోలో ప్రయివేట్ బ్యాంకులో విషాదం 6లో..

ఫలితాలపై పనిగంటల ప్రభావం

2022లో అంతర్జాతీయ కార్మిక సంఘం ఇచ్చిన నివేదిక ప్రకారం దక్షిణాసియాలో గరిష్టంగా వారానికి సగటు పని గంటలు 49. 48.8 పని గంటలతో తూర్పు ఆసియా రెండో స్థానంలో ఉంది. దేశం ముందడుగు వేయాలంటే ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలంటూ నారాయణ మూర్తి పిలుపునివ్వడం దేశభక్తిని వక్రీకరించడం. అంకితభావాన్ని నెంబర్ గేమ్‌గా కుదించడమే అవుతుంది. కార్మికులు తక్కువ గంటలు పనిచేసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని బిజినెస్ స్కాలర్ జెఫ్రీ ఫెఫర్ అభిప్రాయపడ్డారు. వారానికి సగటున 48 గంటల కంటే ఎక్కువ పనిచేస్తే ఉత్పాదకత తగ్గిపోతుందని ఎమ్మా లక్స్‌టన్ అనే పరిశోధకురాలు తేల్చారు. పని గంటలు పెరిగితే పనితీరు మందగిస్తుందని గతంలో అంతర్జాతీయ కార్మిక సంఘం కూడా తెలిపింది. చేసే పనిలో స్వతంత్ర ప్రతిపత్తి ఉంటే ఆరోగ్యంతో పాటు ఉద్యోగి పనితీరు కూడా మెరుగుపడుతుందని పరిశోధకులు అంటున్నారు.





డబుల్ బెడ్ రూం ఇండ్లు ఖాళీ

బలవంతంగా వెళ్లగొట్టిన అధికారులు

- ప్రతిఘటించిన పేదలు, పెట్రోల్ పోసుకొని నిరసన
- ఆక్రమించుకున్న 'డబుల్' ఇండ్లు ఖాళీ చేయాలి : ఆర్డీఓ డీఎస్ వెంకన్న

నవతెలంగాణ-పాలకుర్తి

నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్దిదారులకు కేటాయించకపోవడంతో నిరాశచెందిన పేదలు వాటిని ఆక్రమించుకొని నివాసముంటున్నారు. వారు ఖాళీ చేయాలని అధికారులు పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో బుధవారం బలవంతంగా ఖాళీ చేయించారు. పేదలు ప్రతిఘటించి పెట్రోల్ పోసుకొని నిరసన తెలిపారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం తొర్రూరు(జే)లో జరిగింది. తొర్రూరు గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 20 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించింది. అర్హులను గుర్తించి ఇండ్లు కేటాయించకపోవడంతో పడావుపడ్డాయి. దాంతో ఆగ్రహించిన గ్రామానికి చెందిన 20 మంది పేదలు.. ఎనిమిది నెలలుగా ఆ ఇండ్లను ఆక్రమించి నివాసం ఉంటున్నారు. కాగా, అక్రమంగా ఆక్రమించుకున్న ఇండ్లను ఖాళీ చేయాలని అధికారులు వారిని పలుమార్లు హెచ్చరించారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఇండ్లు ఖాళీ చేయబోమని లబ్దిదారులు పట్టుబట్టడంతో ఉద్రిక్తత వాతావరణంలో అధికారులు వారి సామాన్లను బయట పడేసి ఇండ్లకు తాళాలు వేసి సీల్ వేశారు. దాంతో తాము ఎక్కడ ఉండాలంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తూ పసలాది అంజమ్మ పసులాది పద్మ పెట్రోలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గడ్డం భూలక్ష్మి, జోడు ఇందిర, గడ్డం ప్రజాపతి పెట్రోలు ఒంటిపై పోసుకొని నిరసన తెలుపుతూ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్దిదారులను గుర్తించి గ్రామపంచాయతీ తీర్మానం చేసి తహసీల్దార్ కార్యాలయానికి అందజేసిందని తెలిపారు. అయినా ఇండ్లు కేటాయించకపోవడంతో తాము నివాసం ఉంటున్నామని, ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా అధికారులు ఖాళీ చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండటానికి ఇల్లు లేకపోవడం, వరుసగా కురుస్తున్న వర్షాలకు పాత ఇండ్లు నేలమట్టం కావడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్నామని బోరున విలపిస్తూ తెలిపారు. అధికారులు బలవంతంగా ఖాళీ చేయించడంతో ఆరుబయటే ఉండాల్సి ఉంటుందని, వర్షాలకు ఎక్కడ ఉండాలని ప్రశ్నించారు. కాగా, పెట్రోలు తాగిన మహిళలు, ఒంటిపై పెట్రోలు పోసుకున్న మహిళలను స్థానికులు వైద్యం కోసం పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఎనిమిది నెలలుగా నివాసముంటున్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవరుప్పుల ఎస్ఐలు యాకూబ్ హుస్సేన్, సృజన్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో పాటు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఖాళీ చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకొని చొరబడ్డారని, ఆక్రమించుకున్న ఇండ్లను వెంటనే ఖాళీ చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్ తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఖాళీ చేయిస్తున్నామని తెలిపారు. మండలంలోని పాలకుర్తిలో 50, దర్దేపల్లిలో 40, తొర్రూరు జే వడ్డెర కాలనీలో 30 ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆన్‌లైన్ చేశామన్నారు. మిగతా గ్రామాల్లో లబ్దిదారులను గుర్తించలేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఖాళీ చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇండ్లు పూర్తయిన గ్రామాల్లో త్వరలోనే గ్రామ సభలను ఏర్పాటు చేసి అర్హులైన పేదలను ఎంపిక చేసి అందజేస్తామని తెలిపారు.

– ఆర్డీఓ డీఎస్ వెంకన్న

రేపు ఢిల్లీకి మంత్రి సీతక్క

- 'పెసా' చట్టంపై జాతీయ సదస్సుకు హాజరు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'పెసా' చట్టంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం ఢిల్లీకి వెళ్తున్నారు. అక్కడి డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఈ సదస్సు జరగనుంది. పలువురు కేంద్ర, రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు దీనిలో పాల్గొంటారు. ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, పెసా చట్ట అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై ఆమె ప్రసంగిస్తారు.

సీజీఓ టవర్స్‌లో మొక్క నాటిన పీఐబీ ఏడీ శృతిపాటిల్




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'అమ్మ పేరిట ఒక మొక్క' నాటమంటూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా హైదరాబాద్ కవాడిగూడ లోని సీజీఓ టవర్స్ ప్రాంగణంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి మొక్కల్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అమ్మ పేరిట నాటే మొక్క తాలూకు ఫలాలు భవిష్యత్ తరాలకు అందించినట్టవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. మొక్కలు నాటేలా అందర్నీ ప్రోత్సహించాలనే ప్రధాని సంకల్పం చాలా గొప్పదని కొనియాడారు.

వ్యవసాయ మార్కెట్ల సెక్యూరిటీగార్డులకు రూ.19వేల వేతనం ఇవ్వాలి

- మంత్రి తుమ్మలకు సీఐటీయూ వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ మార్కెట్ల సెక్యూరిటీ గార్డులకు జీవోనెం 814 ప్రకారం మినిమమ్ టైంస్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ. 19వేలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) కోరింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సీఐటీయూ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా కమిటీల ద్వారా వేతనాలను చెల్లించాలని కోరారు. ఇపీఎఫ్, ఇఎస్ఐలను కమిటీలే చెల్లించాలనీ, మరణ విపత్తు సహాయం అందించాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము, ఉపాధ్యక్షులు ఐలి సదయ్య, ఎండి ముస్తాక్, కార్యదర్శులు షేక్ మహబూద్, కే.ఏడుకొండలు, బి మహేందర్ రెడ్డి, వై. రామానుజయ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి సరస్ మేళా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను, చేనేత, హస్తకళ, వ్యవసాయరంగ నైపుణ్యతలను ఒక తాటిపైకి తెచ్చి వారికి మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం సరస్ మేళాను నిర్వహించనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ఈపీఆర్),గ్రామీణాభివద్ధి శాఖ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి అక్టోబర్ 7 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో నిర్వహిస్తున్నది. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించేందుకు సరస్ జరగనుంది. వివిధ రాష్ట్రాల నుంచి 250కి పైగా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఒకే వేదిక పైకి తేనుంది. ఆదిలాబాద్ డోక్రా లోహపు బొమ్మలు, పోచంపల్లి ఇక్కత్ చీరలు, గద్వాల్ పట్టు చీరలు, ఆదిలాబాద్ అగర్ బత్తులు, జగిత్యాల హెర్బల్ ఉత్పత్తులు, జనగాం మసాలా దినుసులు, కొమురంభీం ఆసిఫాబాద్ గిరిజన హస్త కళాకృతులు, రాజన్న సిరిసిల్ల చేనేతలు, నిర్మల్ పెయింటింగ్స్, మేడ్చల్ పిండి వంటలు, మెదక్ సిరిధాన్యాలు (మిల్లెట్స్), ఆంధ్రప్రదేశ్ కొండపల్లి బొమ్మలు, బీహార్ లక్క గాజులు, వెస్ట్ బెంగాల్ జ్యూట్ ప్రొడక్ట్స్, ఉత్తర భారత వెదురు ఉత్పత్తులు, తంజావూరు పెయింటింగ్స్, ఒడిస్సా చేతివృత్తులు, మధ్యప్రదేశ్ కుండలు, రాజస్థాన్ రాతి చెక్క బొమ్మలు మొదలగు ఉత్పత్తులను సరస్‌లో ప్రదర్శించనున్నారు. వివిధ ప్రాంతాల తినుబండారాలను అందుబాటులో ఉండనున్నాయి. సరస్ ఫెయిర్ 2024ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క దనసరి ప్రారంభిస్తారు.

పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఉదండాపూర్ రిజర్వాయర్ పరిశీలన

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక, నీటిపారుదల శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రూ.12 కోట్ల 97 లక్షలతో నిర్మించనున్న 4.2 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్‌కు రూ.45 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డిపై రూ.27,500 కోట్లు ఖర్చు చేసి ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని చెప్పారు. నీటి వాటానూ సాధించలేక పోయారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని, ఇదే చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. ఈ శాసనసభ కాలంలోనే పాలమూరు-రంగారెడ్డిని పూర్తి చేస్తామని చెప్పారు. ఉదండాపూర్‌తో పాటు ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామని, వీటన్నిటిపై సమీక్షించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన చేపట్టినట్టు వెల్లడించారు.

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. గతంలో ఆర్ అండ్ ఆర్‌లో భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.మూడు కోట్ల 74 లక్షలు, ఆర్అండ్ఆర్‌కు సంబంధించి రూ.2.6 కోట్లు, ఉదండాపూర్‌లోని నిర్మాణాలకు సంబంధించి రూ.13 కోట్లు పెండింగ్ నిధులను విడుదల చేయాలని మంత్రిని కోరారు. అవార్డులకు సంబంధించి అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



12 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం

జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉదండాపూర్, కరివేన రిజర్వాయర్లు పూర్తయితే కరివేన ద్వారా 2.5 లక్షల ఎకరాలకు, ఉదండాపూర్ ద్వారా 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని అన్నారు. త్వరగా ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్-ఇన్-చీఫ్ అనిల్ కుమార్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, శ్రీహరి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ జానకి, ఎస్ఈ శ్రీనివాసరావు, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎస్.మోహన్ రావు పాల్గొన్నారు.

స్క్రాప్ పాలసీపై తుది నివేదిక ఇవ్వండి

- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయండి
- 'రవాణా' ఆదాయం పెంచాలి
- ఫిట్‌నెస్‌లు, ఓవర్‌లోడ్ తనిఖీలు ముమ్మరం చేయండి : రవాణాశాఖ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖ స్క్రాప్ పాలసీ, ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లపై ఇతర రాష్ట్రాల్లో మరింత అధ్యయనం చేసి సమగ్ర తుది నివేదిక ఇవ్వాలని ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. పై రెండు అంశాలపై రవాణాశాఖ అధికారులు మంత్రికి నివేదిక ఇచ్చారు. దీన్ని పరిశీలించిన ఆయన మరికొన్ని మార్పుల్ని సూచిస్తూ, తుది నివేదికను రూపొందించాలని చెప్పారు. ఆదాయం పెంపు కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన సమీక్షించారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, ఇసుక, ఫ్లయ్ యాష్‌ల ఓవర్ లోడింగ్‌పై నిరంతర నిఘా ఉంచాలని చెప్పారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని సమావేశమందిరంలో రవాణాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ ఇలంబర్తి, జాయింట్ కమిషనర్లు రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు. ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూళ్లు, కాలేజీల్లో రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాల కోసం రూ.5 లక్షలు బడ్జెట్ కేటాయించామని తెలిపారు. ఏటా దేశంలో రోడ్డు ప్రమాదాలో లక్షా 60 వేల మంది మరణిస్తున్నారనీ, రాష్ట్రంలో రోజుకు 20 మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యల్ని తక్షణం అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించేవారి లైసెన్సులు రద్దు చేయాలని చెప్పారు. ఆర్టీఏ కార్యాలయాల సొంత భవనాల నిర్మాణాలను ఆయన సమీక్షించారు. ఇంకా స్థల కేటాయింపులు జరగని చోట్ల జిల్లా కలెక్టర్లకు లేఖలు రాయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఉపయోగపడేలా రవాణా శాఖ అధికారులకు ట్యాబ్స్ ఇవ్వాలనీ, ఆదాయ మార్గాల పెంపు కోసం అన్వేషించాలని అన్నారు.



ఆ అధ్యయన పత్రం వెనక్కి..

కోవాగ్జిన్ భద్రతపై వ్యాసాన్ని ప్రచురించిన జర్నల్

నిర్ధారణలను విశ్వసించలేమంటూ ఉపసంహరణ

ప్రముఖుల అభ్యంతరం

న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి నుండి ప్రజలను రక్షించేందుకు ఉపయోగించిన కోవాగ్జిన్ సురక్షితమైనదా కాదా అనే విషయంపై రూపొందించిన ఓ అధ్యయన పత్రం 'డ్రగ్ సేఫ్టీ' అనే జర్నల్‌లో ప్రచురితమైంది. అయితే ఈ పత్రాన్ని మంగళవారం ఆ జర్నల్ ఉపసంహరించుకుంది. ఆ వ్యాసంలో పొందుపరచిన నిర్ధారణలు విశ్వసించదగినవిగా లేవని, అందుకే దానిని వెనక్కి తీసుకుంటున్నామని వివరణ ఇచ్చింది. కోవాగ్జిన్ తీసుకున్న వారిలో మూడో వంతు మందికి పైగా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారని ఈ అధ్యయనం తెలిపింది. బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు పరిశోధకులు ఈ పత్రాన్ని రూపొందించారు.

ఆ వ్యాసంలో పరిశోధకులు కొన్ని నిర్ధారణలు చేశారని, అయితే అవి ఎంతమాత్రం విశ్వసించదగినవిగా లేవని సంపాదకుడు, ప్రచురణకర్త అభిప్రాయపడ్డారని జర్నల్ తెలిపింది. కోవాగ్జిన్‌పై వ్యాసంలో పొందుపరచిన అభిప్రాయాలు తప్పుడు అంచనాలకు వచ్చేలా ఉన్నాయని, అందుకే ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని తొలగించామని వివరించింది. ప్రస్తుతం జర్నల్‌లో ఆ పత్రం కన్పించడం లేదు. కాగా జర్నల్ నిర్ణయంపై పరిశోధకులు విభేదించారు.

అంతర్జాతీయంగా ఆమోదం పొందిన పబ్లిక్ ఎథిక్స్ కమిటీ (కోప్) మార్గదర్శకాల మేరకు జర్నల్ ఆ వ్యాసాన్ని తొలగించింది. పరిశోధనా పత్రంలో అనేక లోపాలు ఉన్నాయంటూ భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) మే 24న జర్నల్ సంపాదకుడికి ఓ లేఖ రాసింది. కాగా పత్రాన్ని ఉపసంహరించుకోవద్దంటూ 600 మంది పౌరులు జర్నల్ సంపాదకుడికి ఓ లేఖ రాశారు. దానిని మీడియాకు విడుదల చేసిన రోజునే జర్నల్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లేఖపై పలువురు వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, ప్రజారోగ్య పరిశోధకులు, హోమియోపతి ప్రాక్టీషనర్లు, ఐటీ కన్సల్టెంట్లు, ఆయుర్వేద నిపుణులు, శాస్త్రవేత్తలు సంతకాలు చేశారు.

ఉపాధిపై ఫోకస్

అగ్నివీర్ విషయంలో కేంద్రంపై ఆగ్రహం

- బీజేపీని దూరం పెడుతున్న ఓటర్లు
- సిట్టింగ్ స్థానాల్లో జేజేపీకి ఆదరణ కరువు
- ఉనికి కోసం ఆప్ పాకులాట
- జులానా నియోజకవర్గంపై అందరి దృష్టి
- కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగట్‌కు ప్రజల నుంచి మద్దతు
- రాజకీయ విశ్లేషకులు, పరిశీలకుల అంచనాలు



చండీగఢ్ : హర్యానాలో నిరుద్యోగం పెద్ద సమస్యగా పరిణమించింది. బీజేపీ పాలనలో ఇది తీవ్రమైంది. ప్రస్తుతం నిరుద్యోగం త్వరలో జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ప్రచారాస్త్రంగా మారనున్నది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నిరుద్యోగం మీదనే మాట్లాడుతూ.. అధికార బీజేపీని ఇరుకున్న పెడుతున్నది. ఒలంపిక్స్ ఫైనల్‌లో తృటిలో పతకాన్ని చేజార్చుకున్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ జులానా నుంచి పోటీలో ఉన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్, బీజేపీ నాయకుడు బ్రిజ్ భూషన్‌పై పోరాటంలో వినేశ్‌ది కీలక పాత్ర. ఈ పోరాటం పరోక్షంగా బీజేపీ అధిష్టానం, మోడీపై అంటూ రాజకీయ విశ్లేషకులు సైతం అభివర్ణించారు. దీంతో జులానాపై అందరి దృష్టి పడింది.

జులానాలోనూ నిరుద్యోగ సమస్య ఉన్నది. దీనిపై వినేశ్ ప్రధానంగా దృష్టిని సారిస్తున్నారు. "నేను పోటీ చేస్తున్నందున జులానాకు గుర్తింపు వస్తున్నదని ప్రజలు చెప్తున్నారు. వినేశ్ కోసం కాకుండా.. ఉపాధి, రెజ్లింగ్‌కు జులానా పేరు పొందాలని నేను అనుకుంటున్నాను" అని తన స్వంత గ్రామం నిడానాలోని ఓటర్లు, తన మద్దతుదార్లను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి, ఒలంపియన్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ అన్నారు. జులానాలో ఆమెకు అక్కడి ఓటర్ల నుంచి చక్కటి మద్దతు లభిస్తున్నది. ఎక్కడికి వెళ్లినా ఆమె కోసం ప్రజలు పెద్ద ఎత్తును స్వాగతం తెలుపుతున్నారు. ఆమె ప్రధానంగా ఉద్యోగ, ఉపాధిపై దృష్టి పెడుతున్నారు. అలాగే, బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నివీర్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రజలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తున్నారు. వినేశ్ స్వగ్రామంలో రెజ్లింగ్‌కు చక్కటి ప్రాధాన్యత ఉన్నది. ఈ గ్రామం ఇండోర్ జిమ్నాసియం, రెజ్లింగ్ అఖాడా (అరేనా)ను కలిగి ఉన్నది. దీనిని స్థానికుల స్వచ్ఛంద సహకారంతో నిర్మించారు.

నిడానాలో జాట్ రైతులు ప్రధాన భూస్వాములుగా ఉన్నారు. వారిలో చాలా మంది భద్రతా దళాల్లోనూ చేరి సేవలు అందిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలు (రైతుల పోరాటాల తర్వాత రద్దయ్యాయి), భద్రతా దళాల్లో తాత్కాలిక నియామక ప్రక్రియ అయిన అగ్నివీర్.. జాట్‌లతో పాటు ఇక్కడి ప్రజలలో చాలా మందిని తీవ్రంగా దెబ్బ తీశాయని విశ్లేషకులు చెప్తున్నారు. జాట్‌లు, ఇతర హర్యానా ప్రజలు గర్వపడాల్సిన పరిస్థితులు లేవనీ, కొందరు యువకులు రోజువారీ కూలీ కోసం ఛత్తీస్‌గఢ్‌కు కూడా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిడానా గ్రామవాసి రామ్ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశాడు. "ప్యారిస్‌లో ఏం జరిగిందో (ఫైనల్‌లో వినేశ్ ఫొగాట్ అధిక బరువు కారణంగా అనర్హురాలిగా ప్రకటించబడింది) అన్న విషయం నాకు సరిగ్గా తెలియదు. ఆశను కోల్పోకుండా, ప్రస్తుతం వ్యవస్థలో మార్పు కోసం పోరాడుతున్నందుకు ఆమె పట్ల మేము గర్వంగా ఉన్నాం" అని అన్నాడు. గ్రామంలో ఫొగాట్‌ను అక్కడి ప్రజలు కుల, మతాలకతీతంగా సన్మానించారు.

జింద్ జిల్లాలోని జులానా అసెంబ్లీ నియోజకవర్గంలో జాట్‌ల ప్రాబల్యం ఎక్కువ. అలాగే, ఎస్సీలు 22.5 శాతంగా ఉన్నారు. భద్రతా దళాల్లో చేరి సేవలందించేవారిలో దళిత యువత కూడా ఉన్నది.

అయితే, అగ్నివీర్ పథకం తర్వాత ఆర్మీ సెలక్షన్‌పై వారిలో నిరాశను కలిగించిందని ఇక్కడి యువత చెప్తున్నది. దీంతో బీజేపీపై వారు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ వినేశ్ ఫొగాట్ పోటీ చేస్తుండటంతో యువత ఓటు కాంగ్రెస్ వైపు మళ్లే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఇక్కడ బీజేపీ నుంచి యోగేశ్ బైరాగి పోటీలో ఉన్నారు. అలాగే, ఆప్ నుంచి డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ కవితా దళాల్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆప్ ప్రభావం కొంత మాత్రమేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. "ఆమె పహిల్వాన్ ('రెజ్లర్'కు గౌరవ పదం) కాదు. ఆమె డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్. ఇక్కడ ఆప్‌నకు ఉనికి లేదు. హర్యానా పార్టీలైన ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, జననాయక జనతా పార్టీ (జేజేపీ)లు పోటీ నుంచి దూరంగా ఉన్నాయి. దంగల్ (పోటీ) కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉంటుంది. వచ్చేసారరి ఆప్‌నకు కేజ్రీవాల్ వంటి నాయకుడు ఉంటే, మేము వారి వైపు చూస్తాం" అని జులానా పట్టణంలోని అగ్రికల్చర్ డీలర్ దల్బీర్ మాలిక్ అన్నాడు.

> బీజేపీ మాజీ మిత్రపక్షం జేజేపీ నుంచి అమర్‌జిత్ ధండా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే, జేజేపీ సైతం ఇప్పుడు ఇక్కడి జనాలను ఆకట్టుకోవటానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తున్నది. ఆ పార్టీ నిర్వహించే సమావేశాలకూ ప్రజల నుంచి స్పందన కనబడటం లేదు. "మోడీ అనే అంశం కారణంగా గత ఎన్నికల్లో బీజేపీ వైపు ప్రజలు చూశారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. రైతుల పోరాటం కాంగ్రెస్‌కు సహాయపడుతుంది" అని ధిగానా గ్రామ టీచర్ ఒకరు అన్నారు. అగ్నివీర్ పథకం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానాలో అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 8న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

గోకినేపల్లికి శౌర్యయాత్ర

ఆకట్టుకున్న తెలంగాణ సాయుధ పోరాట వీధినాటక ప్రదర్శన

నవతెలంగాణ-ముదిగొండ

ప్రజానాట్యమండలి శౌర్యయాత్ర బృందం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామానికి బుధవారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుల స్మారక భవనం వద్ద మచ్చా వీరయ్య, రావెళ్ళ సత్యం, వాసిరెడ్డి లింగయ్య, యరమనేని వెంకట వెంకటనరసయ్య దంపతుల చిత్రపటాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, కళాకారులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీధినాటికను కండ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ వీధినాటిక ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, జిల్లా కార్యదర్శి సదానందం, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు పయ్యావుల రామనాథం, ప్రభావతి, మందరపు వెంకన్న, రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్య, కట్టకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు చెల్లించలేని దళిత విద్యార్థికి సుప్రీం భరోసా

న్యూఢిల్లీ : గడువులోగా ఫీజు చెల్లించలేకపోవడం వల్ల ఐఐటి సీటు కోల్పోయిన నిరుపేద దళిత విద్యార్థికి సాయం చేస్తామని సుప్రీం కోర్టు భరోసా ఇచ్చింది. సీటును నిలబెట్టుకోవడానికి అవసరమైన మొత్తం రూ.17,500ను జూన్ 24లోగా డిపాజిట్ చేయాల్సి వుండగా, విద్యార్థి అతుల్ కుమార్ అందులో విఫలమయ్యాడు. సాధ్యమైనంతవరకు ఈ విషయంలో సాయం చేస్తామని హామీ ఇస్తూ, ఫీజు చెల్లించడానికి గడువు ముగిసే వరకు గత మూడు మాసాలుగా మీరేం చేస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. అతుల్ కుమార్ తరపు న్యాయవాది మాట్లాడుతూ చిట్టచివరి ప్రయత్నంలో కుమార్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష పాసై ఐఐటి ధన్‌బాద్‌లో సీటు తెచ్చుకున్నాడని, ఈ సమయంలో న్యాయస్థానం గనక సాయం చేయకపోతే కష్టమవుతుందని చెప్పారు. స్వల్పంగా వాదోపవాదాలు సాగిన తర్వాత ఐఐటి అడ్మిషన్లు చూసే ఐఐటి మద్రాసు జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీకి బెంచ్ నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది తన క్లయింట్ కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలియచేశారు. సీటు కేటాయించిన తర్వాత నాలుగు రోజుల్లో అంత పెద్ద మొత్తం కట్టలేని పరిస్థితి వారిదని, దినసరి కూలీ కుటుంబం వారిదని తెలిపారు. ఆ విద్యార్థికి సాయం చేయలేమని జాతీయ ఎస్‌టి కమిషన్ కూడా చేతులెత్తేసింది. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

భూగర్భ జలవనరుల శాఖ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు

28న ధ్రువపత్రాల పరిశీలన : టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ భూగర్భ జలవనరుల శాఖలో ప్రకటించిన వివిధ గెజిటెడ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)లో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులకు రెండో విడతలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. అందులో పొందుపరిచిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు **www.tspsc.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. భూగర్భ జలవనరుల శాఖలో 32 గెజిటెడ్, 25 నాన్‌గెజిటెడ్ కలిపి 57 పోస్టుల భర్తీకి 2022, నవంబర్ 29న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

బీసీ కులగణనకు కార్యాచరణ రూపొందించండి

బీసీ కమిషన్‌కు సీఎం ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణనకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి, విధానాలపై సీఎంతో పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్, సభ్యులతో చర్చించారు. బీసీ కులగణన ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. బీసీ కులగణన వెంటనే ప్రారంభించి, వేగంగా ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అక్టోబర్ 21 నుంచి 'ఎస్‌ఏ-1' పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల 21 నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదేనెల 28 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఇందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనూ ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణ వివరా లను ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ రెండున జవాబుపత్రాల మూల్యాం కనం చేసి ఫలితాలను ప్రకటించాలని తెలిపారు. అదేనెల ఐదున విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేనెల 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలనీ, విద్యార్థుల మార్కులు, వారి ప్రతిభపై చర్చించాలని కోరారు. అక్టోబర్ రెండు నుంచి 14 వరకు 13 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు దసరా సెలవులుంటాయి. వచ్చేనెల 15న బడుల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

శ్రీలంక పార్లమెంట్ రద్దు

- నవంబరు 21న కొత్త పార్లమెంట్ సమావేశం

కొలంబో : మధ్యంతర ఎన్నికలు జరిపేందుకు వీలుగా శ్రీలంక పార్లమెంట్‌ను నూతన అధ్యక్షుడు అనుర దిసనాయకె రద్దు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ఇది అమలులోకి వచ్చింది. పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించి నవంబరు 21 కల్లా కొత్త పార్లమెంట్ సమావేశమవుతుందని ఆయన ప్రకటించారు. నవంబరు 14న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ కన్నా దాదాపు ఏడాది ముందుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ బుధవారం నాడు వెలువడింది. ప్రజలు కోరుకున్న విధంగా లేనపుడు ఆ పార్లమెంట్‌ను కొనసాగించడంలో అర్థం లేదని అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. 2020 ఆగస్టులో గత పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. రాజ్యాంగంలోని 70వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి అధ్యక్షుడు ఈ చర్య తీసుకున్నారు.

గాంధీభవన్‌లో 'ప్రజావాణి'

పార్టీ కార్యకర్తలు, శ్రేణులతో మంత్రి దామోదర ముఖాముఖి | మొదటి రోజు 285 దరఖాస్తులు

అక్కడికక్కడే 30 దరఖాస్తులను పరిష్కరించిన మంత్రి

సాయం కోసం హెచ్ఐవీ సోకిన ఓ బాలిక, మరో మహిళ అర్జీ

మెడికల్ పెండింగ్ బిల్లుల కోసం వినతులు

రేషన్‌కార్డులు, భూసమస్యలు, రేషన్, నిర్వాసితులు, ఇండ్ల కోసం...



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణుల కోసం టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో ప్రజావాణికి శ్రీకారం చుట్టారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలతోపాటు వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు గాంధీభవన్‌కు భారీగా తరలి వచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మొదటి రోజు ప్రజావాణి కార్యక్రమాన్ని టీపీసీసీ అధ్యక్షులతో కలిసి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించారు. ఉదయం 11.30 ప్రారంభమైన ముఖాముఖి కార్యక్రమం మధ్యాహ్నం మూడున్నర వరకు నిర్విరామంగా జరిగింది. మొదటి రోజు వివిధ సమస్యలపై 285 విజ్ఞప్తులు వచ్చాయి. అందులో 30 వరకు మంత్రి అప్పటికప్పుడే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత ఉన్నతాధికారులకు, ఆయా కలెక్టర్లకు పంపించారు. అందులో ఇద్దరు డయాలిసిస్ రోగులు తమ బాధలు చెప్పగానే మంత్రి దామోదర వారిని నిమ్స్‌కు అటాచ్ చేశారు. హెచ్ఐవీ సోకిన ఒక బాలిక, మరో మహిళలకు పెన్షన్‌తోపాటు వైద్య సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు వివిధ రోగాలతో బాధపడుతూ చికిత్స తీసుకున్న తర్వాత మెడికల్ బిల్లులు రావడం లేదంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. వారికి భరోసా కల్పించి త్వరలో పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామంటూ హామీ ఇచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, వైద్య సేవలు అవసరం ఉన్న వారు, డబుల్ బెడ్ రూమ్, రేషన్ కార్డులు ఇలా అనేక సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మహిళలు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకున్నారు. జీవో నెంబర్ 317 బాధితులు, భూ వివాదాలు, కొండ పోచమ్మ నిర్వాసితులు, బీఆర్ఎస్ సర్కారు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేత, ఉపాధ్యాయ, ఉద్యోగ బదిలీలపై వినతులు వచ్చాయి. తన శాఖకు సంబంధించిన అంశాలపై వెంటనే పరిష్కరించాలని దామోదర అధికారులకు సూచించారు. మొత్తం దరఖాస్తులను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు టీపీసీసీ సిబ్బంది కంప్యూటర్‌లో శాఖల వారీగా దరఖాస్తులను నమోదు చేశారు. ఆయా శాఖల వారీగా దరఖాస్తులను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లేఖలను జత చేసి మంత్రులకు పంపిస్తారు.

మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందన్నారు. అందుకే వాళ్ళ కోసం గాంధీభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం పెట్టామన్నారు. వారంలో బుధ, శుక్రవారాల్లో మంత్రులు గాంధీభవన్‌కు వచ్చి ప్రజల సమస్యలు వింటారు. ప్రజలు, కార్యకర్తలు ఇచ్చిన అర్జీలను మంత్రులు తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో పరిష్కరించేందుకు కృషి చేస్తారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గాంధీ భవన్‌లో ప్రజావాణి కార్యక్రమం అద్భుతమైన ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి అధ్యక్షతన వహించారు. సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, అధికార ప్రతినిధులు భవాని రెడ్డి, బండారు శ్రీకాంత్, అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

> **రేపు ప్రవాసీ ప్రజావాణి ప్రారంభోత్సవం**
>
> హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ఈనెల 27న శుక్రవారం ఉదయం 10 గంటలకు గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మెన్, అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు

అనుగుణంగా మోడీ పాలన

జయంతి వేడుకల్లో బీజేపీ ఎంపీ లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనసంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోడీ నిరంతరం పనిచేస్తున్నారని బీజేపీ ఎంపీ కె లక్ష్మణ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి లక్ష్మణ్‌తోపాటు ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శులు జయశ్రీ, గొట్టాల ఉమారాణి, రాష్ట్ర అధికార ప్రతినిధి జి వెంకట్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యమంటూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన సిద్ధాంతానికి అనుగుణంగా మోడీ పనిచేస్తున్నారని చెప్పారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు, దేశ సంపద అందాలన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ కలలను సాకారం చేస్తున్నారని వివరించారు. కుల, మత, వర్గ భేదం లేకుండా అందరికీ నేరుగా ఫలాలు అందేలా, దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలను డిజిటల్ విధానంలో అందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అవినీతి కుంభకోణాలతో కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిందని ఆరోపించారు. కర్ణాటక సీఎం నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాల్సింది పోయి చేసిన అవినీతిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో కూడా మంత్రులు, ప్రభుత్వంలోని కొంతమంది అవినీతికి పెద్ద ఎత్తున పాల్పడుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం, వ్యతిరేకత వస్తున్నదని అన్నారు.

వైద్యారోగ్యశాఖలో

4 వేల పోస్టులు

15 రోజుల వ్యవధిలో నోటిఫికేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో అన్ని రకాల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నది. దీంతో గడిచిన 15 రోజుల వ్యవధిలోనే 4 వేల పోస్టులకు వైద్యారోగ్య సేవల నియామక మండలి నోటిఫికేషన్లు విడుదల చేసింది. మరో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రానున్న 10 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు సమాచారం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో దాదాపు 1,600 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదాన్ని వైద్యారోగ్యశాఖ కోరింది. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే వాటికి కూడా నోటిఫికేషన్ ఇస్తామని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి ఆస్పత్రిలో ఉన్న ఖాళీల్లో 80 శాతం ఖాళీలను భర్తీ చేయాలని సర్కారు నిర్ణయించింది. ఇప్పటికే నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు గానూ 6,956 మందికి, 285 మంది ల్యాబ్ టెక్నీషియన్లను, 48 మంది ఫిజియోథెరపిస్టులను, 18 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించిన సంగతి తెలిసిందే. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 2,050 నర్సింగ్ ఆఫీసర్లు, 633 ఫార్మాసిస్టులు, 1,666 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఫీమేల్), 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్, 435 సివిల్ సర్జన్, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులున్నాయి.

ఆసియా భవితవ్యానికి భారత్, చైనా సంబంధాలు కీలకం: జై శంకర్ వ్యాఖ్య

న్యూయార్క్ : ఆసియా భవితవ్యానికి భారత్-చైనా సంబంధాలు చాలా కీలకమైనవని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు కేవలం ఆసియానే కాకుండా యావత్ ప్రపంచ దేశాలను ప్రభావితం చేయగలవని అన్నారు. అయితే ఇరు దేశాలు సమాంతరంగా ఎదగడమనేది ఈనాటి అంతర్జాతీయ రాజకీయాల్లో చాలా కొత్త సమస్యను తెచ్చి పెడుతున్నాయని వ్యాఖ్యానించారు. వంద కోట్లకు పైగా జనాభా కలిగిన దేశాలు ఈ రెండు మాత్రమేనని ఆ రకంగా ఇవి విశిష్టతను కలిగివున్నాయని అన్నారు. అలాగే రెండు దేశాలు అంతర్జాతీయంగా ఎదుగుతున్నాయన్నారు. ఉమ్మడి సరిహద్దును కలిగివున్న ఇరుగు పొరుగు దేశాలని అన్నారు. "ఇండియా, ఆసియా, వరల్డ్" అనే శీర్షికతో ఆసియా సొసైటీ, ఆసియా సొసైటీ పాలసీ ఇనిస్టిట్యూట్‌లు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 79వ సమావేశాల్లో జై శంకర్ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో పలు దేశాల విదేశాంగ మంత్రులతో ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతున్నారు.

సిద్ధరామయ్యపై దర్యాప్తు జరపండి

- లోకాయుక్తకు ప్రత్యేక కోర్టు ఆదేశాలు

బెంగళూరు : మైసూరు పట్టణాభివృద్ధి సంస్థ (ఎంయుడిఎ) స్థలం కేటాయింపు కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై పోలీసులతో దర్యాప్తు జరపాల్సిందిగా ప్రత్యేక కోర్టు బుధవారం లోకాయుక్తను ఆదేశించింది. సిద్ధరామయ్య భార్య పార్వతికి ఎంయుడిఎ 14 స్థలాలను కేటాయించడంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో సిద్ధరామయ్యపై దర్యాప్తు చేపట్టేందుకు గవర్నర్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేయడాన్ని హైకోర్టు సమర్థించింది.

సంపాదకీయం

ప్రయత్నం మంచిదే!



ఇటీవల కన్నుమూసిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మన దేశాన్ని అందమైన ఒక పూల బొకేతో పోల్చారు. రంగురంగుల పూలన్నీ ఒక చోట చేరి, ఆ బొకేకి అందాన్ని చేకూర్చినట్టు...భారతంలో భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు, రకరకాల భాషలు, పలురకాల సాంప్రదాయాలు... వెరసి మరేదేశంలో లేని విధంగా మన దగ్గర భిన్నత్వంలో ఏకత్వమనేది శతాబ్దాలుగా పరిఢవిల్లుతోందని ఆయన నొక్కి వక్కాణించారు. అదే కోవలో మహత్తర, వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం జరిగిన తెలంగాణ గడ్డ... గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచింది. భాషలు, మతాలు వేరైనా, మనమంతా భాయి... భాయి అంటూ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు గురజాడ చెప్పినట్టు అన్నదమ్ముల వలె కలగలిసి తిరుగుతున్నారు.

అయితే కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ... ఈ సోదరతత్వాన్ని విడదీసి, పరమత సహనానికి బీటలు వార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎనిమిది మంది ఎంపీలను గెలిచిన కమలం పార్టీ... ఇక్కడ ఏ మూలన ఏం జరిగినా, దాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు అది కుయుక్తులు పన్నుతోంది. వ్యక్తిగత విభేదాలకు మతం రంగు పూస్తూ.. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు అది కుట్రలు పన్నుతోంది. వాటికి సామాన్య ప్రజలు బలవుతుండటం ఆందోళనకరం. దాని ఉచ్చులో కొందరు పావులుగా మారుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో జరిగిన ఘటన ఈ కోవలోకే వస్తుంది. గతంలో అదే జిల్లాలోని భైంసాలో ఆ పార్టీ మత ఉద్రికత్తలను రెచ్చగొట్టిన తీరు మనకు గుర్తే. ఇప్పుడు మరో కొత్త ప్రాంతమైన జైనూరులో కూడా అదే తరహాలో చిచ్చుపెట్టేందుకు, తద్వారా రాజకీయలబ్ధి పొందేందుకు కాషాయ పార్టీ చూస్తోంది. ఆయా ఘటనలను విచారించి, నిజా నిజాలను నిగ్గు తేల్చాల్సింది, బాధితులకు న్యాయం చేయాల్సింది, బాధ్యులను శిక్షించాల్సింది పోలీసులు, కోర్టులు. కానీ ధరలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, సీజనల్ వ్యాధుల్లాంటి ప్రజల దైనందిన సమస్యల గురించి ఒక్కరోజు కూడా పట్టించుకోని బీజేపీ... జైనూరు లాంటి ఘటనల్లో మాత్రం జోక్యం చేసుకోవటం అత్యంత విడ్డూరం. ఆయా విషయాల్లో ఒక రాజకీయ పార్టీగా అన్నింటికి మతం రంగు పులమటం, తద్వారా చిలువలు పలువలు చేయటం దానికే చెల్లింది.

ఇక్కడ మనం ఒక విషయాన్ని సీరియస్‌గా గమనించాలి. గత కొన్నేండ్లుగా రాష్ట్రంతోపాటు దేశంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టు కోసం బీజేపీ అనేక రకాల ప్రయోగాలు చేస్తోంది. వనవాసీ కళ్యాణ పరిషత్ తదితర సంస్థల పేర్లతో వారిలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది, అలా ప్రయత్నించి కొన్నిచోట్ల సఫలీకతమైంది, ఫలితాలు సాధించింది. జైనూరుతో పాటు ఆ జిల్లాలోని అనేక గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో సరైన ఉపాధి అవకాశాల్లేకపోవటం సమస్యలకు ప్రధాన కారణం. దీంతో ఆదివాసీలు, ఇతర గిరిజనుల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటోంది. ఈ పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకుంది. ఆదివాసీలను రెండు వర్గాలుగా విడదీసి, వారిలో వారికి చిచ్చుపెట్టి, వారితో మైదాన ప్రాంత గిరిజనులకు గొడవలు సృష్టించి, నానా యాగీ చేస్తోంది.

మరోవైపు జానీ మాస్టర్ వ్యవహారంపై కూడా రచ్చ చేసేందుకు బీజేపీ కాసుక్కూర్చుంది. ఈ అంశంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనార్హం. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నేటి కేంద్ర మంత్రి బండి సంజయ్...'మసీదులన్నీ కూలుస్తాం...' అంటూ ప్రమాదకరమైన కామెంట్లు చేయటం ఆ పార్టీ విద్వేష బీజాలకు పరాకాష్ట. 'శవాలు, శివలింగాలు...' అంటూ ఆయన వ్యాఖ్యానించటాన్నిబట్టి తన పార్టీ 'ఉద్దేశమేంటో' చెప్పకనే చెప్పారు.

బహుశా ఇలాంటి ప్రమాదాలను రాష్ట్ర మంత్రి సీతక్క ముందే పసిగట్టారు కాబోలు. మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. దుష్టశక్తులు పేట్రేగేందుకు అవకాశమివ్వొద్దంటూ జనాలను అప్రమత్తం చేశారు. అంతేకాదు నిజాం హయం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఇలాంటి సమస్యలను పైపైన చూడకూడదనీ, వాటి మూలాల్లోకి వెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మైనారిటీల పట్ల యువతలో వ్యతిరేక భావనను పెంపొందిస్తున్న దుష్ట శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలంటూ ఆమె ఆదేశించారు. ఇదే సమయంలో జైనూరు ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు త్వరలోనే ప్రభుత్వం తరపున ఒక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహిస్తామంటూ ఆమె భరోసా నివ్వటం హర్షణీయం. అదే సమయంలో 'మైనారిటీ శక్తులు' కూడా హద్దు దాటితే 'చట్టం తన పని తాను చేసుకు పోతుంది...' అని చెప్పటం ద్వారా మతతత్వ శక్తులకు ఎలాంటి అవకాశం, ఆస్కారం ఇవ్వకుండా చూడటం కూడా సరైందే. ఈ విషయంలో ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రిగా సీతక్క చొరవను, కృషిని అభినందించి తీరాలి. అయితే ఆమె ప్రయత్నమొక్కటే ఇక్కడ సరిపోదు. ఇలాంటి సున్నిత అంశాలను పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత నేటి రేవంత్ సర్కార్‌పై ఉంది. ప్రజల మధ్య చిచ్చుపెట్టే అరాచక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్న సంకేతాన్ని అది ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పంపాలి. అప్పుడే ఏచూరి చెప్పిన మన పూల బొకే మరింత అందంగా కనబడుతుంది.

> మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. దుష్టశక్తులు పేట్రేగేందుకు అవకాశమివ్వొద్దంటూ జనాలను అప్రమత్తం చేశారు. అంతేకాదు నిజాం హయం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఇలాంటి సమస్యలను పైపైన చూడకూడదనీ, వాటి మూలాల్లోకి వెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

'అధ్యయనం-పోరాటం' ఆయుధంగా...


ఎస్.వీరయ్య


ఐసియులోకి పోయిన సీతారాం ఏచూరి ఇక రారనీ, అక్కడి నుంచి అంతిమయాత్రకేనని ఎవరూ ఊహించలేదు. ఆయన మరణం పట్ల ఉన్నతస్థాయి స్పందన చూసాం. దేశం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కామ్రేడ్ ఏచూరిని కోల్పోయింది. దేవుడిని, మతాన్ని స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. మత విశ్వాసానికి, మతోన్మాదానికి మధ్య ఉన్న విభజన రేఖను స్పష్టంగా గుర్తిస్తూ ఉన్మాదపు ఎత్తుగడలను సమర్ధవంతంగా తిప్పికొట్టిన నేత. రాజకీయాల్లో విలువలకు వలువలూడిన కాలం ఇది. ఆ విలువలకే విలువలద్దిన నేత సీతారాం ఏచూరి. పదవికి దూరంగా పది రోజులు కూడా ఉండలేక గోడ దూకే కాలం. అన్ని అవకాశాలుండి కూడా తాను అడుగుపెట్టిన రాజకీయాలనే అంటిపెట్టుకుని అర్ధ శతాబ్దం నిలిచిన నేత. తుది శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత. అందుకే ఇది అనేక మంది రాజకీయ నాయకులకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఆయన ఒక విజ్ఞాన శిఖరం. బాల్యం నుంచి తుది ఘడియల వరకు ఆ శిఖరం ఎదుగుతూనే వచ్చింది. పదహారేండ్ల వయస్సులోనే అంతర్జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో నెగ్గి అందుకు బహుమతిగా అమెరికా అధ్యక్షునితో వైట్‌హౌస్‌లో అల్పాహారం తీసుకున్నారు. హయ్యర్ సెకండరీ స్థాయి పరీక్షలలో ఆల్ ఇండియా అగ్రస్థానం సాధించారు. ఆ రోజుల్లోనే పిల్లలకోసం ప్రచురించిన జూనియర్ స్టేట్స్‌మెన్ పత్రిక సీతారాం ఏచూరిని భావిభారత ప్రధానిగా అభివర్ణించిందని ఆయన బాల్య మిత్రుడు సంజయబారు గుర్తుచేసారు. ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యూ)లో కూడా అత్యుత్తమ అధ్యయనశీలిగానే నిలిచారు. కుటుంబ పెద్దలు ఉన్నతస్థాయికి ఎదిగిన నేపథ్యం కూడా ఉన్నది. వ్యక్తిగత అభివృద్ధికి ఇన్ని అవకాశాలు ఉండి కూడా అన్నీ వదులుకుని మార్క్సిజమే మార్గంగా ఎంచుకున్నారు. భారతదేశంలో నేటి గొప్ప మార్క్సిస్టు మేధావిగా నిలిచారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతినిధిగా అత్యంత సమర్ధవంతంగా జోక్యం చేసుకున్నారు.

> విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రూపొందించిన కీలకమైన నినాదాలను మనసా, వాచా, కర్మణా అక్షరాల అమలు చేసిన నేత సీతారాం ఏచూరి. ఆయన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత నాయకులుగా ఉన్న సమయంలోనే 'అధ్యయనం - పోరాటం' అన్న నినాదం దేశమంతా మారుమోగింది. 'చదువుతూ పోరాడు - చదువుకై పోరాడు' అని సాధారణ విద్యార్థులు కూడా అందుకున్న నినాదం ఇది. అంతేకాదు, పాఠ్యపుస్తకాలే కాక, సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్న సందేశాన్నిచ్చిన నినాదం ఇది. అనతికాలంలోనే ఇది అన్ని విద్యార్థి సంఘాల నినాదంగా మారింది. మా నినదాన్ని స్వీకరించిన ఇతర సంఘాలు మా విధానాలను కూడా స్వీకరిస్తే మంచిదని సీతారాం చురకలు వేసేవారు.

విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రూపొందించిన కీలకమైన నినాదాలను మనసా, వాచా, కర్మణా అక్షరాల అమలు చేసిన నేత సీతారాం ఏచూరి. ఆయన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత నాయకులుగా ఉన్న సమయంలోనే 'అధ్యయనం - పోరాటం' అన్న నినాదం దేశమంతా మారుమోగింది. 'చదువుతూ పోరాడు - చదువుకై పోరాడు' అని సాధారణ విద్యార్థులు కూడా అందుకున్న నినాదం ఇది. అంతేకాదు, పాఠ్యపుస్తకాలే కాక, సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్న సందేశాన్నిచ్చిన నినాదం ఇది. అనతికాలంలోనే ఇది అన్ని విద్యార్థి సంఘాల నినాదంగా మారింది. మా నినదాన్ని స్వీకరించిన ఇతర సంఘాలు మా విధానాలను కూడా స్వీకరిస్తే మంచిదని సీతారాం చురకలు వేసేవారు. విద్యార్థి ఉద్యమంలో సమ్మె ఒక ముఖ్యమైన ఆయుధంగా చలామణి అవుతున్న కాలమది. ఉత్పత్తి రంగంలో వర్గ పోరాటానికి, విద్యార్థి రంగంలో పోరాటానికి మధ్య ఉన్న తేడాను చూపిన సుందరయ్య బాటలో నాటి ఎస్ఎఫ్ఐ నాయకత్వం ముందుకు సాగింది. పరిశ్రమలు, వ్యవసాయ రంగంలో సమ్మెలు ఉత్పత్తిని స్తంభింపజేస్తాయి. పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల మీద పోరాటానికి సమ్మె పదునైన ఆయుధం. ప్రత్యేక సందర్భాల్లో తప్ప, విద్యార్థి ఉద్యమంలో అది సాధారణ ఎత్తుగడ కాజాలదని స్పష్టం చేసింది. నాటి విద్యార్థి ఉద్యమంలో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది కూడా ఏచూరి నాయకత్వంలోనే దేశ వ్యాపితంగా ప్రచారంలోకి వచ్చింది. అతి త్వరలోనే విస్తృత ఆమోదం పొందింది. విద్యా సంస్థల్లో భౌతికదాడులు సర్వసాధారణంగా మారిన కాలమది. భౌతిక దాడులు కాదనీ, భావసంఘర్షణ కేంద్రాలుగా భాసిల్లాలని నాటి నాయకత్వం నినదించింది. ఈ వైఖరులన్నీ విద్యారంగంలోనూ, విద్యార్థుల తల్లిదండ్రులు, సమాజంలోనూ ఆదరణ పొందాయి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైన పాలకులు సమస్యను రిజర్వేషన్ల చుట్టూ తిప్పే ప్రయత్నం ఇప్పుడే కాదు, ఆ కాలంలోనే మొదలైంది. సహజం గానే రెండు వాదనలు ముందుకొచ్చాయి. తరతరాలుగా వివక్షకు గురైన తరగతుల నుంచి కొందరు రిజర్వేషన్లే సర్వరోగ నివారిణిగా పైకెత్తేందుకు ప్రయత్నించారు. ఊరట కల్పించే చిన్న అవకాశాన్ని ఉన్నతమైన పరిష్కారంగా చూపించారు. మరోవైపు కొందరు రిజర్వేషన్ల వల్లనే ప్రతిభావంతులు అవకాశాలు కోల్పోతున్నారనే వాదన చేసారు. ఇలాంటి సమయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఇచ్చిన నినాదం 'అందరికీ విద్య-అందరికీ ఉద్యోగం' విద్యార్థి లోకాన్ని ఆకర్షించింది. ఐక్యంగా నిలిపే నినాదంగా ముందుకొచ్చింది. ఐక్య పోరాటాలకు బాటలు వేసింది. సమాజంలో అందరికీ చదువుకునే అవకాశం కల్పించి, అందరికీ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెస్తే రిజర్వేషన్ల ప్రశ్నే ఉదయించదు కదా! అందుకే ఈ నినాదం దేశమంతా మారుమోగింది. అనేక ప్రాంతాల్లో విచ్ఛిన్నకర ఉద్యమాలతో విద్యార్థిలోకం ప్రభావితం అవుతున్న కాలంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం 'మా దేహం ముక్కలైనా - దేశాన్ని ముక్కలు కానివ్వం' అని గర్జించింది. ఈ నినాదం విద్యార్థి లోకాన్ని పెద్ద ఎత్తున ప్రభావితం చేసింది. ఇలాంటి నినాదాలు విద్యార్థుల హృదయాలను కదలించే విధంగా ముందుకు తీసుకెళ్ళడంలో సీతారాం అగ్రగణ్యుడు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేతగా సీతారాం ఏచూరి భౌతికకాయానికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రాంగణంలో అధికారుల నుంచి విద్యార్థుల వరకు అందరూ నివాళులు అర్పించిన తీరు ప్రత్యేకతను సంతరించుకున్నది. జెఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా వరుసగా మూడుసార్లు ఎన్నికైన ఏకైక నాయకుడు ఏచూరి. ఆరోగ్యకరమైన విద్యార్థి ఉద్యమ సంప్రదాయాలు నెలకొల్పి ఎస్ఎఫ్ఐ బలమైన కేంద్రంగా జెఎన్‌యూను రూపుదిద్దిన ఇద్దరు నాయకుల్లో ఏచూరి ఒకరు. జెఎన్‌యూలో ప్రకాష్‌కారత్, సీతారాం ఏచూరిల నాయకత్వంలో నిర్మించిన విద్యార్థి ఉద్యమమే నాటికీ, నేటికీ ఒక నమూనా అంటే అతిశయోక్తికాదు. జెఎన్‌యూలో ఏచూరికి అందిన అసాధారణ నివాళిని ఈ నేపధ్యంలోనే అర్థం చేసుకోవచ్చు. అర్థశాస్త్రం, తత్వశాస్త్రం, చరిత్ర, రాజ్యాంగం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వంటి అనేక అంశాలను లోతుగా అధ్యయనం చేసారు. భారతీయ తాత్వికచింతన మూలాల ఆధారంగానే మతోన్మాదుల వాదనలను తిప్పికొట్టిన మేధావి. ఇది సహించలేకనే "హైందవ శక్తి" అనే పేరుతో కొందరు ఉన్మాదులు చనిపోయిన ఏచూరి మీద నీచమైన నిందాపూరిత ప్రచారం ప్రారంభించారు. అది ఎలాంటి సంస్కారమో, ఎట్లాంటి సంస్కృతో వారే సమాధానం చెప్పాలి. పార్లమెంట్‌లో సీతారాం ఏచూరి ప్రసంగాలు అన్ని పక్షాలకు చెందిన సభ్యులు శ్రద్ధగా వినేవారంటేనే ఆయన లోతైన అధ్యయనం, హేతుబద్ధమైన వాదనాపటిమ గురించి అర్థం చేసుకోవచ్చు.

ఏచూరి తండ్రి కోరిక మేరకు ఆయన మేనమామ మోహన్‌కందా (ఉమ్మడి రాష్ట్రప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ) గారు సీతారాం ఏచూరిని రాజకీయ కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారట. ఈ ప్రయత్నంలో సీతారాం మారకపోగా, తానే మార్క్సిస్టుగా మారిపోతానేమోనన్న పరిస్థితి ఏర్పడిందని మోహన్‌కందా గుర్తు చేసుకున్నారు. మార్క్సిజం- లెనినిజం పట్ల సీతారాం ఏచూరి ప్రదర్శించిన అచంచల విశ్వాసం ఫలితమిది. నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు విలువలు, క్రమశిక్షణా పాటించవలసి వచ్చినపుడు తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల ఒత్తిడి పేరుతో కొంతమంది మినహాయింపులు కోరడం చూస్తున్నాం. అధ్యయనశీలిగా, ప్రజా ప్రయోజనాల కోసం జీవితాంతం నిబద్ధతతో కృషి చేసిన నేతగా ఆయన భవిష్యత్ తరాలకు ఆదర్శం. ప్రపంచీకరణ ప్రభావంతో సమిష్టి ప్రయోజనం స్థానంలో వ్యక్తిగత ప్రయోజనానికి పెద్దపీట వేస్తున్న నేడు యువతలో క్యారియరిజం ఒక దశలో పరాకాష్టకు చేరింది. ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మళ్ళీ మార్పులొస్తున్నాయి. ప్రపంచీకరణ భ్రమలు మంచుతెరల్లా కరగడం మొదలైంది. అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాల్లో కూడా యువత జీవితంలో అస్థిరత పెరుగుతున్నది. భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నది. మరోవైపు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) పేరుతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా దూసుకు పోతున్నది. శ్రమ దోపిడీకి దీనిని సాధనంగా వాడుకుని లాభాలు దండుకునేందుకు పెట్టుబడి దారీ వర్గం సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నిస్తున్నది. సీతారాం అమలు చేసి చూపిన 'అధ్యయనం-పోరాటం' ప్రాధాన్యత మరొకసారి ముందుకొచ్చింది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాముని పేరుతో, మతం పేరుతో పక్కదారులు పట్టించే ప్రయత్నాలు జరుగుతున్న స్థితిలో ఉన్నాం. మనిషి ప్రశ్నించేతత్వాన్ని, తెలుసుకోవాలన్న జిజ్ఞాసను నీరుగార్చేందుకు పాలకవర్గాలు మతం పేరుతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే మనిషి జీవితం నిరర్థకం అనీ, చేయగలిగిందేమీ లేదని శ్రామికులను నిరుత్సాహపరచడానికి పూనుకుంటున్నాయి. ఈ సందర్భంగా "జీవితం నిరర్థకం కాదు... చనిపోయేంతవరకు జీవితపు ఉపయోగితను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలి" అన్నారు సీతారాం ఏచూరి. అదే ఆయన ఆచరించి చూపారు. అంతేకాదు, చనిపోయిన తర్వాత కూడా ఆయన శరీరపు ఉపయోగితను మరింత పెంచి చూపించారు. తన దేహాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. అందుకే నేటి యువతకు ఆయనొక ఐకాన్. ఆయన నమ్మిన మార్క్సిజమే మార్గదర్శకం.



> ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాముని పేరుతో, మతం పేరుతో పక్కదారులు పట్టించే ప్రయత్నాలు జరుగుతున్న స్థితిలో ఉన్నాం. మనిషి ప్రశ్నించేతత్వాన్ని, తెలుసుకోవాలన్న జిజ్ఞాసను నీరుగార్చేందుకు పాలకవర్గాలు మతం పేరుతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే మనిషి జీవితం నిరర్థకం అనీ, చేయగలిగిందేమీ లేదని శ్రామికులను నిరుత్సాహపరచడానికి పూనుకుంటున్నాయి. ఈ సందర్భంగా "జీవితం నిరర్థకం కాదు... చనిపోయేంతవరకు జీవితపు ఉపయోగితను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలి" అన్నారు సీతారాం ఏచూరి. అదే ఆయన ఆచరించి చూపారు. అంతేకాదు, చనిపోయిన తర్వాత కూడా ఆయన శరీరపు ఉపయోగితను మరింత పెంచి చూపించారు. తన దేహాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. అందుకే నేటి యువతకు ఆయనొక ఐకాన్.

శ్రమకు ఏదేదో జమైంది
కాళ్ళ శ్రమ బళ్ళెక్కింది
చేతి శ్రమ కీబోర్డు పరమైంది
నోటి శబ్దం స్పీకర్లో దూరింది
శ్రామికుడి యూనిఫారం
తెల్ల బట్టల్లో మెరుస్తోంది
శ్రమజీవులిప్పుడు కొందరు
ఏసీ గదుల్లో నిలపబడ్డారు
ఇదే పెట్టుబడి బజారు దండోర
అన్నీ పాక్షికంగానైనా నిజాలే
ఏవీ పూర్తి అబద్ధాలు కావు

ఆ ఒక్క నిజమే ...



కానీ చెప్పని కఠోర నిజం ఒకటుంది
కష్టజీవుల బతుకుల్లో మెరుపులు నింపే
ఉత్పత్తిలో శ్రమకు వాటా పెట్టలేదు
అది జీతమై జీవితానికి జమ కాలేదు
పని గంటల ముల్లుకు
స్కేటింగ్ చక్రాలు తొడిగి
ఎనిమిదిని పన్నెండుకు పెంచి
ఇబ్బడిముబ్బడిగా దోచడం ఆపలేదు
కష్టం మేరకు ధనం దక్కని జనం
పెరిగిన ధరలు .. చముర భారాల్లో
సలాసలా మరిగి చిక్కి పోతున్నారు
ఆ ఒక్క నిజమే వారిని
తూర్పు మార్పుకు కదంతొక్కిస్తుంది
అరుణ పతాకను చేత పట్టిస్తుంది

- ఉన్నం వెంకటేశ్వర్లు
8790068814

అతుల్ చంద్ర, విజయ్‌ప్రసాద్

సవాళ్లను అధిగమించి..చరిత్రను సృష్టించి...

ఈ నెల 22న ఫలితాలు ప్రకటించిన శ్రీలంక దేశ అధ్యక్ష ఎన్నికల్లో జన విముక్తి పెరుమన (జేవీపీ) నాయకత్వాన ఏర్పడిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్పీపీ) కూటమి గెలుపొందింది. గత పదేళ్లుగా వామపక్ష పార్టీ అయిన జేవీపీకి నాయకత్వం వహించిన దిశనాయకే, తనతో బరిలో ఉన్న 37మంది కాండిడేట్లపై గెలుపు సాధించి, అధ్యక్ష పదవిని చేపట్టనున్నారు. ఆయన ఓడించిన వారిలో ఇప్పటి వరకు అధ్యక్షునిగా ఉన్న యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్పీ) నాయకుడు రనిల్ విక్రమసింఘేతో పాటు, రెండవ స్థానంలో గట్టి పోటీనిచ్చిన సమాగి జాన బాలవేగవ (ఎస్‌జెబి) అభ్యర్థి సజిత్ ప్రేమదాస ఉన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా శ్రీలంక ఎన్నికలని, రాజకీయాలని శాసించిన, రెండు పార్టీలు - పోదుజన పెరుమన (ఎస్ఎల్ఎల్ పి), యూఎన్పిలకి, ఈ ఎన్నికలలో గట్టి దెబ్బ తగిలింది. అయినప్పటికీ, శ్రీలంక పార్లమెంట్‌లో వీరి ఆధిపత్యం కొనసాగబోతోంది. ప్రస్తుత పార్లమెంటులో ఉన్న స్థానాల్లో 105 సీట్లు ఎస్ఎల్ఎల్‌పికి మూడు స్థానాల్లో యూఎన్‌పికి ఉన్నాయి. దిసనాయకే నాయకత్వాన జేవీపీకి ఉన్న పార్లమెంటు స్థానాలు మూడు మాత్రమే.

మొత్తమ్మీద చూస్తే, దిసనాయకె గెలుపు, చారిత్రిక గెలుపుగా చూడవల్సిందే. శ్రీలంక దేశ చరిత్రలో మొట్ట మొదటి సారి, మార్క్సిస్టు చరిత్ర ఉన్న ఓ రాజకీయ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందింది. అందరూ ఏకేడీ అని పిలిచే, దిసనాయకే కొలంబోకి దూరంగా, ఉత్తర-మధ్య శ్రీలంకలో, ఓ శ్రామిక వర్గ కుటుంబంలో 1968లో పుట్టారు. ఆయన శ్రీలంక విద్యార్థి ఉద్యమంలో, తరువాత జేవీపీ కార్యకర్తగా రాజకీయ పరిణితి చెందారు. ప్రపంచంలో మొట్టమొదటి మహిళా దేశాధ్యక్షురాలైన సిరిమావో బాండారనాయకే కూతురు, 1994 నుండి 2005 వరకు శ్రీలంక అధ్యక్షురాలిగా ఎన్నికైన చంద్రిక కుమారతుంగతో 2004లో జేవీపీకి పొత్తు కుదిరింది. కుమారతుంగ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న దిశనాయకేకి అప్పుడే మంచి కార్యదక్షునిగా పేరొచ్చింది. ఆయన హయాంలో శ్రీలంక వ్యవసాయ విధానంపై దేశంలో అప్పట్లో విస్తృతంగా చర్చలు జరిగాయి. దిసనాయకే 2019లోనూ అధ్యక్ష ఎన్నికలలో ఎన్‌పిపి తరపున పోటీచేశారు.

శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం

2022లో శ్రీ లంక రాజధాని కొలంబో వీధుల్లో జరిగిన 'అరగలయ' నిరసనకారులు అధ్యక్షుని ఇంటిని చుట్టుముట్టి ఆక్రమించడం, ఆ పరిస్థితుల్లో అధ్యక్షుడు గోటబయ రాజపక్సే కొలంబో వదిలిపోవాల్సి రావడం తెలిసిందే. 2022 నాటికి పూర్తిగా సన్నగిల్లిన ప్రజల ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, తిండి, చమురు, మందులవంటి అత్యవసర వస్తువుల కొరత -ఈ అరగలయ (నిరసనలు) వెనుక ఉన్న కారణాలు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శ్రీలంక ప్రభుత్వం విదేశీ అప్పులను తీర్చలేక చేతులెత్తేసింది. గోటబయ రాజీనామా తరువాత, అమెరికా కూటమి పట్ల సుముఖంగా ఉంటూ శ్రీలంకలో సరళీకరణ ఆర్థిక విధానాల అమలుకు ఆధ్యుడైన విక్రమసింఘే అధ్యక్ష పదవిని ఆక్రమించాడు. ప్రజాసమ్మతం లేని విక్రమసింఘే పాలనలో, భారీ నిరసనలకు కారణమైన ఏఒక్క సమస్యని తీర్చే ప్రయత్నం జరగలేదు. 2023లో అంతర్జాతీయ విత్త సంస్థ ముందు మోకరిల్లి, 2.9 వందల కోట్ల డాలర్ల అప్పుని పొందింది విక్రమసింఘే ప్రభుత్వం. ఇలా షరతులతో కూడిన అప్పు ఇచ్చి శ్రీలంక ఆర్థిక వ్యవస్థలో కల్పించుకోవడం, గత అరవై ఏండ్లలో ఇది పదిహేడవ సారి. ఐఎంఎఫ్ కూడా షరతుల్లో భాగంగా విద్యుత్ సబ్సిడీలకు భారీ కోత పెట్టి, వస్తువులపై వేసే వాల్యూయాడేడ్ టాక్స్ (వ్యాట్) ని రెండితలు చేసి 18 శాతానికి తెచ్చింది. ఈ పరిస్థితిలో ఐఎంఎఫ్ షరతుల వల్ల, ముందు వెనుకలు చూడకుండా విచ్చలవిడిగా అధిక వడ్డీలకి అప్పులిచ్చిన అంతర్జాతీయ విత్త వ్యాపారులకు ఎటువంటి నష్టం కలుగలేదు, సరికదా అప్పుల భారం యావన్మంది శ్రీలంక కార్మిక వర్గంపై పడింది.

ప్రజలను కడగండ్లకు గురిచేస్తున్న ఈ ఐఎంఎఫ్ ఒప్పందాన్ని మళ్లీ తిరగరాయించి, ప్రజల మీద భారం తగ్గించి,అప్పులిచ్చిన తరువాత ఆ రిస్కు భరించవలసిన బాధ్యత ఉన్న అంతర్జాతీయ విత్త పెట్టుబడిదారులచేత అప్పు తరుగుకి ఒప్పించే దిశగా అడుగులు వేస్తామని దిసనాయకే అంటున్నారు. ఆదాయ పన్ను పరిమితిని తగ్గించి, నిత్యావసర వస్తువులపై విక్రమసింఘే ప్రభుత్వం వేసిన పన్నులను వెనక్కి తీసుకుంటామని వాగ్దానం చేశారు. ఈ వాగ్దానాలను నిలబెట్టుకుని, సంస్థాగతంగా వెళ్లూనికొని ఉన్న అవినీతిని అదుపు చేయగలిగితే, దిసనాయకే శ్రీలంక రాజకీయాలపై గట్టి ముద్రవేస్తారు. అంతర్యుద్ధం వల్ల గాయపడిన శ్రీలంక సమాజానికి, పెద్ద రాజకీయ పార్టీల చేత భంగపడి ఉన్న శ్రీలంక ప్రజలకు ఊరట కలిగించినవారవుతారు.



> ఎన్పిపి కూటమిలోని పార్టీలకి లోతైన సైద్ధాంతిక విబేధాలు ఉన్నప్పటికీ ఈ ఉమ్మడి ప్రోగ్రామ్ అధారంగా జాతీయ స్థాయిలో ప్రజలముందు ఒక ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని పెట్టగలిగింది. స్వదేశీ పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామిక స్వయం ప్రతిపత్తి, వ్యవసాయంలో ప్రజాహిత సంస్కరణలు, ఈ ఉమ్మడి ప్రోగ్రామ్‌లో భాగం. నాయకత్వంలో ఉన్న జేవీపీ కొన్నికీలక పరిశ్రమల జాతీయీకరణని (ముఖ్యంగా విద్యుత్, చమురు వంటి ప్రజావసరాలు), బడా వర్గాలపై పన్ను పెంచే ప్రగతిశీలక ఆదాయ పన్ను విధానాన్ని, విద్య, వైద్యం ఇతర సామాజిక వ్యయాలకి బడ్జెట్ పెంపును, కూటమి విధానాలుగా ముందుకు తెచ్చింది.

అధ్యక్ష భవనంలో మార్క్సిస్టు పార్టీ

జనవిముక్తి పెరుమన (పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్)1965లో ఒక మార్క్సిస్ట్-లెనినిస్టు పార్టీగా ఏర్పడింది. రోహన విజెవీర (1943-1989) నాయకత్వాన జేవీపీ, శ్రీలంకలో పాతుకుపోయిన సంస్థాగత ప్రజా వ్యతిరేక వ్యవస్థపై రెండుమార్లు (1971లో ఒకసారి, 1987 నుండి 1989 మధ్య మరోసారి) సాయుధ తెరుగుబాటు లేవనెత్తింది. ఈ రెండు తిరుగుబాట్లని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసింది. ఈ క్రమంలో వేలాదిమంది చనిపోయారు. ప్రభుత్వం రోహన విజెవీరను కూడా హత్య చేసింది. ఈ ఘటనల తరువాత 1989లో జేవీపీ, సాయుధ పోరాటం విరమించుకుని ఎన్నికల ప్రజా రాజకీయాలలో పాలుపంచుకోవాలని నిర్ణయించింది. అప్పటి తిరుగుబాటులో ఎందరో ముఖ్య నాయకులని కోల్పోయిన స్థితిలో, సోమవంశ అమెరసింఘే (1943-2016) నాయకత్వాన జేవీపీ పార్టీ పునర్నిర్మాణం చేపట్టింది. అమెరసింఘే తరువాత దిసనాయకె నాయకత్వం లో జేవీపీ ఎన్నికల బరిలో ఉంటూ, ప్రజల్లోకి తమ సోషలిస్టు ఆర్థిక, సామాజిక విధానాలని తీసుకుపోతూ పార్లమెంటరీ రాజకీయ పార్టీగా ఎదిగింది. దిసనాయకే జేవీపీ నాయకత్వంలోని రెండోతరం వారు. పార్టీ సంస్థాగత నాయకత్వం కన్నా ఓ ఇరవై ఏళ్ల తర్వాత వచ్చిన ఈ ప్రస్తుత నాయకత్వం, గత ముప్పై ఏళ్లుగా తమ రాజకీయాలని, సిద్ధాంతాలని శ్రీలంక శ్రామిక, రైతు, పేద వర్గాలలోకి తీసుకువెళ్లడంలో ముందడుగు వేశారు.

కానీ మరోవైపు శ్రీలంక తమిళుల పట్ల జేవీపీ విధానంపై అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అంతర్యుద్ధ సమయంలో, ఎల్టీటీఈ సాయుధ వేర్పాటువాదం పట్ల అవలంబించవలసిన విధానం పట్ల జేవీపీ వైఖరి సింహళ జాతీయవాదులకి దగ్గరగా ఉంది. తమిళుల విషయంపై, కొందరు జేవీపీ నాయకులు అప్పుడప్పుడు బయల్పరిచే సింహళ మితవాద ధోరణిపై ప్రశ్నలు ఇంకా ఉన్నాయి.మితిమీరిన లంచగొండితనం, అవినీతి, కుటుంబ రాజకీయాలతో విసుగెత్తిన ప్రజలకి దిసనాయకే వ్యక్తిగత నిజాయితీ, నిరాడంబరతకి ఆకర్షితులయ్యారనడంలో సందేహం లేదు. తమిళ, సింహళ స్పర్ధలు ఇకపై రాజకీయాలను శాసించకూడదన్న ఆయన వైఖరి కూడా ప్రజాంగీకారం పొందింది.

గత కొన్నేళ్లుగా పార్టీ పునర్నిర్మాణం జరిగిన క్రమంలో, ఒంటరిపోరు సరిపోదన్న అవగాహనతో జేవీపీ 2019లో మరో 21 వామ పక్ష, మధ్యేవాద వామపక్ష పార్టీలతో కలిసి ఉమ్మడి ప్రోగ్రామ్‌తో అవినీతికి, ఐఎమ్ఎఫ్ షరతులకి, ప్రజా బడ్జెట్ కోతలకి వ్యతిరేకంగా నేషనల్ పీపుల్స్ పవర్ కూటమి నిర్మాణానికై పనిచేసింది. ఎన్‌పిపి కూటమిలోని పార్టీలకి లోతైన సైద్ధాంతిక విబేధాలు ఉన్నప్పటికీ ఈ ఉమ్మడి ప్రోగ్రామ్ అధారంగా జాతీయ స్థాయిలో ప్రజలముందు ఒక ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని పెట్టగలిగింది. స్వదేశీ పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామిక స్వయం ప్రతిపత్తి, వ్యవసాయంలో ప్రజాహిత సంస్కరణలు, ఈ ఉమ్మడి ప్రోగ్రామ్‌లో భాగం. నాయకత్వంలో ఉన్న జేవీపీ కొన్నికీలక పరిశ్రమల జాతీయీకరణని (ముఖ్యంగా విద్యుత్, చమురు వంటి ప్రజావసరాలు), బడా వర్గాలపై పన్ను పెంచే ప్రగతిశీలక ఆదాయ పన్ను విధానాన్ని, విద్య, వైద్యం ఇతర సామాజిక వ్యయాలకి బడ్జెట్ పెంపును, కూటమి విధానాలుగా ముందుకు తెచ్చింది. అంతర్జాతీయ విత్త పెట్టుపడి ఎగదోసిన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంక ప్రజలని, కూటమి ఆర్థిక స్వయం ప్రతిపత్తి ఎజెండా గట్టిగా ఆకర్షించింది. దశాబ్దాలుగా జాతి వైషమ్యాలతో సతమతమవుతున్న శ్రీలంక సమాజానికి ఈ అజెండా ఒక కొత్త దారి చూపింది.

ఈ అజెండాని ఎంతవరకు కార్యరూపంలో పెట్టి, శ్రీలంక పారిశ్రామిక స్వయంప్రతిపత్తికి పునాదులు వేయడంలో సఫలం చెందు తారో మున్ముందు చూడాల్సిన విషయం. ఏది ఏమైనా, దిసనాయకే గెలుపుతో మార్పుకోసం ఎదురుచూస్తున్న నేటితరానికి ఓ కొత్త ఊపిరి దొరికింది. తమ శ్రీలంక ఐఎమ్ఎఫ్ కబంధ హస్తాలనుండి బయటపడి, సమగ్ర జాతీయ అభివృద్ధి వైపు అడుగులు వేయగలదన్న కొత్త ఆశ ఈ రోజు యువతలో చిగురించింది.

పెన్షనర్ల వైద్య సౌకర్యాలు కుదించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రుల్లో, సీజీహెచ్ఎస్‌లో నిపుణులైన వైద్యులను, పారా మెడికల్, ఇతర సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీపీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతోపాటు బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పి ప్రభాకర్, బీజేఎం రెడ్డి, బ్రహ్మాచారి, నరహరి, రామచంద్రుడు, అరుణ, ప్రభాకర్ నాయర్, శివలింగం, సుధావన్, వెంకయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎన్ సోమయ్య, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఉస్మాన్‌సాగర్(గండిపేట్) రిజర్వాయర్‌కు భారీ స్థాయిలో వరద వచ్చింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత అధికారులు 2 గేట్లను అడుగు మేర ఎత్తి 234 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేశారు. అటు హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం 7 గంటలకు రిజర్వాయర్ ఒక గేటు అడుగు మేర అధికారులు ఎత్తారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఆర్టీఎస్‌లో సింగరేణి భాగస్వామ్యం వద్దు

- తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్

దశలవారీగా ఆందోళనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రామగుండంలోని థర్మల్ స్టేషన్ (ఆర్టీఎస్) నూతన ప్లాంట్ నిర్మాణంలో సింగరేణి కాలరీస్‌ను భాగస్వామ్యం చేయొద్దని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ (టీజీపీఈ జేఏసీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ నిర్మాణాన్ని పూర్తిగా జెన్‌కోకే అప్పగించాలని డిమాండ్ చేశారు. జేఏసీ సమావేశం బుధవారంనాడిక్కడి 1104 యూనియన్ కార్యాలయంలో జరిగింది. జాయింట్ వెంచర్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 26 నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నట్టు ప్రకటించారు. 26న నల్లబ్యాడ్జీలతో నిరసన, ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3 వరకు జెన్‌కోలోని అన్ని ఉత్పత్తి సంస్థల్లో గేట్ మీటింగులు, అక్టోబర్ 4, 5 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల్లో భోజన విరామ సమయంలో ఆందోళనలు, అదే రోజు విద్యుత్ సౌధలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో జేఏసీ చైర్మెన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో చైర్మెన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మెన్ అనిల్‌కుమార్, వజీర్, శ్యామ్ మనోహర్, నాగతులసిరాణి, కరుణాకర్‌రెడ్డి, రాంజీ, సదానందం, వెంకట్ నారాయణరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, ఈశ్వర్ గౌడ్, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మైన్ ఎక్స్‌పోలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ మైనింగ్ ప్రదర్శన మైన్ ఎక్స్‌పోను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన వెంట సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం, ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్ తదితరులు ఉన్నారు. ఈ ప్రదర్శనలో నూతన మైనింగ్ ఆవిష్కరణలు, సాంకేతికతలు, యంత్రాలను డిప్యూటీ సీఎం బృందం పరిశీలించింది. 125 దేశాల నుంచి 44 వేలమంది నిపుణులు ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద మైనింగ్ పరికరాల తయారీదారుల సమ్మేళనమని డిప్యూటీ సీఎం తెలిపారు. అక్కడే పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్
- 50 ఏండ్లు నిండిన వారికి పింఛన్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గొరెంకల నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బుర్ర జ్ఞానేశ్వర్, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులను ఆదుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇప్పటికే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం వారికి భరోసా కల్పించిందన్నారు. నిధుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తున్నామని, మత్స్యకారులకు కనుచూపు మేరలో కూడా అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని స్పష్టంచేశారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మత్స్య కార్మిక శాఖ రాష్ట్ర చైర్మెన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. 50 ఏండ్లు నిండిన మత్స్యకారులందరికీ ఆసరా పింఛన్లు అందజేస్తామని చెప్పారు.

చెరువులు, కుంటలు పరిరక్షించాలి : మత్స్య కారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి చెరువులు, కుంటలను కాపాడాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. కాలుష్య కోరల నుంచి చెరువులను పరిరక్షించాలని కోరారు. రాష్ట్రంలో 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4.90 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ మాఫియా చేతుల్లో చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల డ్రయినేజీ నీరు మొత్తం చెరువులు, కుంటల్లో కలపడంతో మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. చెరువులు, కుంటలను నది పరివాహక ప్రాంతాల భూములను శాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను నాటి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.114 కోట్లు ప్రకటించిందన్నారు. కానీ టెండర్ల ద్వారా పంపిణీ చేయడం బాధాకరమన్నారు. చేప పిల్లలను జలాల్లో వదిలారని, కానీ భారీ వర్షాలతో అవి కొట్టుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచితంగా చేప పిల్లలు కాకుండా నేరుగా మత్స్య సొసైటీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లు నిండిన మత్స్యకారులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో రూ.20లక్షలతో చేపల మార్కెట్లను నిర్మించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మత్స్య కార్మికులు, ముదిరాజులు సంయుక్తంగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఎఫ్‌సీ సీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొప్పు పద్మ, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చెనమోని శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకన్న, కొండల్, మల్లేష్, పి.జంగయ్య, సహాయ కార్యదర్శులు నరసింహ, రవి, రామచంద్రయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలి
- 30న చలో లేబర్ కమిషనరేట్ జయప్రదం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయి మెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ధర్నా సందర్భంగా జిల్లాలోని కాటేదాన్ క్లస్టర్, కందుకూరు, తుర్కయంజాల్ ప్రాంతాల్లో 'వాల్ రైటింగ్' కార్యక్రమాన్ని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌తో కలిసి భూపాల్ ప్రారంభించారు. అనంతరం తుర్కయంజాల్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాల్ మాట్లాడారు. కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ ఎంప్లాయీస్ అందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్డ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం రెండింతలు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. ప్రయివేటు యాజమాన్యాలు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తూ కనీస వేతనాలు ఇవ్వకుండా, కార్మిక చట్టాలు అమలు చేయకుండా పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

హామీల అమలుకై సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని, అయినా ప్రభుత్వం స్పందించడం ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను అమలు డిమాండ్ చేస్తూ లేబర్ కమిషనర్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్, డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి వై.స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ బుగ్గరాములు, సీహెచ్ ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి జానీ మాస్టర్

- నాలుగు రోజులపాటు అనుమతిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు

నవతెలంగాణ-గండిపేట్



లైంగికదాడి వేధింపులు ఎదుర్కొంటూ చంచల్‌గూడ జైల్‌లో ఉన్న ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీని పోలీసు కస్టడీకి అనుమతినిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. తనపై లైంగిక దాడి చేశారని జానీమాస్టర్‌పై అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో జానీ మాస్టర్‌కు ఇటీవల అత్తాపూర్ కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. అయితే అతన్ని కస్టడీకి అప్పగించాలని నార్సింగి పోలీసులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. బుధవారం కూడా వాదనలు విన్న కోర్టు జానీ మాస్టర్‌ను నాలుగు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతి ఇస్తూ తీర్పునిచ్చింది. అయితే చంచల్‌గూడ జైల్‌లో ఉన్న జానీ మాస్టర్‌ను నార్సింగి ఏసీపీ రమణగౌడ్, సీఐ హరికృష్ణరెడ్డి నార్సింగి పీఎస్‌కు తరలించారు. ఈ కేసకు సంబంధించి నాలుగు రోజులపాటు పోలీసులు జానీ మాస్టర్‌ను విచారించనున్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించొద్దని, అవసరం అయితే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని పోలీసులకు కోర్టు సూచించింది.

టాప్-10లో పంత్

- రోహిత్, విరాట్ ర్యాంకులు
- ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ సత్తా చాటాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలిటెస్ట్‌లో సెంచరీతో కదం తొక్కడంతో తొలిసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. తాజా ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో ఈ వికెట్ కీపర్ ఆరో స్థానానికి చేరుకున్నారు. అదే సమయంలో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ర్యాంకులు దిగజారాయి. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌తో టెస్టుల్లో రీ ఎంట్రీ ఇచ్చిన పంత్.. తనదైన బ్యాటింగ్‌తో అందరినీ అలరించాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో 731పాయింట్లతో టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరాడు. అదే సమయంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఓ స్థానం మెరుగుపరుచుకొని 751 పాయింట్లతో టాప్-5కి ఎగబాకాడు. నెంబర్ వన్ స్థానంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్, రెండోస్థానంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్, 3వ స్థానంలో డారెల్ మిఛెల్, 4వ స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ ఉన్నారు. ఇక టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వరుసగా పది, 11వ స్థానాల్లో నిలిచారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఐదు ర్యాంకులు మెరుగుపరుచుకుని 14వ స్థానానికి ఎగబాకాడు. ఇక టెస్టు నెంబర్ వన్ బౌలర్‌గా రవిచంద్రన్ అశ్విన్ కొనసాగుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్ హేజిల్‌వుడ్ మూడు, పాట్ కమ్మిన్స్ 4వ స్థానంలో ఉన్నారు. టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒకస్థానం మెరుగుపరుచుకొని 6వ స్థానంలో నిలిచాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ అద్భుత ప్రదర్శనతో తొలిసారిగా టాప్-10లో చేరిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాపై సెంచరీ చేశాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బ్యాటర్‌గా పాక్ కెప్టెన్ బాబర్ అజామ్ నిలువగా.. రెండోస్థానంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వరుసగా మూడు, నాలుగు ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

రెండోటెస్ట్‌కు టీమిండియా సిద్ధం

రేపటి నుంచి బంగ్లాదేశ్‌తో చివరి టెస్ట్



కాన్పూర్: బంగ్లాదేశ్ జరిగిన తొలి టెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. కొత్త ప్రయోగాలకు తెరలేపకుండా తొలి టెస్ట్‌లో ఆడిన జట్టుతోనే రెండోటెస్ట్ బరిలోకి దిగాలని యోచిస్తోంది. బంగ్లాతో తొలిటెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జైస్వాల్, శుభ్‌మన్‌కి తోడు, అశ్విన్, వికెట్ కీపర్ రిషబ్ పంత్ అద్భుత బ్యాటింగ్‌తో అలరించారు. చెన్నై టెస్టులో రవిచంద్రన్ అశ్విన్ సెంచరీతో పాటు మ్యాచ్ విన్నింగ్ ఆరు వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియంలో సెప్టెంబరు 27న ప్రారంభమయ్యే రెండో టెస్టులో అశ్విన్ మరో రికార్డులకు అడుగు దూరంలో ఉన్నాడు. ఐసిసి ప్రకటించిన తాజా టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ అగ్రస్థానంలో ఉండగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. బంగ్లాపై అశ్విన్ సెంచరీతో చెలరేగాడు. జడేజాతో కలిసి ఏడో వికెట్‌కు ఏకంగా 199 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసి జట్టును ఆదుకున్నాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో చెలరేగాడు.

కెఎల్ రాహుల్‌ను ఆకాశానికి ఎత్తిన ఫీల్డింగ్ కోచ్

టీమిండియా ఫీల్డర్లలో కెఎల్ రాహుల్ అద్భుతమని ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ పేర్కొన్నాడు. భారత మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌ను మార్క్‌వాతో పోల్చుతూ ఆకాశానికి ఎత్తేశాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ప్రమాదకరమైన బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ ఇచ్చిన క్యాచ్‌ను కేఎల్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. కేఎల్ వద్ద అద్భుతమైన టెక్నిక్ ఉందని.. మార్క్‌వా కూడా గతంలో ఇలాంటి స్ట్రాటజీనే పాటించేవాడని దిలీప్ పేర్కొన్నాడు. స్లిప్‌లోనే కాకుండా.. మిడాన్ ఫీల్డింగ్‌లోనూ కేఎల్ రాహుల్ చురుగ్గా ఉంటాడు. క్యాచ్‌ల కోసం అతడు చూపించిన విధానం అద్భుతం. బంతి కింద పడకుండా తన వేళ్లను ఎలా ఉపయోగించాలనే దానిపై పూర్తి అవగాహన ఉండాలి. మైదానంలో సరైన సమయంలో ఆచరించాలి. కేఎల్ రాహుల్ ఎత్తుగా ఉండే ప్లేయర్. అలాంటి వ్యక్తి క్యాచ్‌ను అందుకోవడం తేలికైన విషయమేం కాదు" అని దిలీప్ వ్యాఖ్యానించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా వేసిన 13వ ఓవర్‌లో ముష్ఫికర్ రహీమ్ (8) ఆడిన బంతిని రెండో స్లిప్‌లో ఉన్న కేఎల్ రెండు చేతులతో అందుకొన్నాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ ముష్ఫికర్ ఇచ్చిన క్యాచ్‌ను రాహుల్ మిడాన్‌లో ఒడిసిపట్టాడు. ఈసారి అశ్విన్ బౌలర్.

ఢిల్లీ రంజీ జట్టులో కోహ్లీ, పంత్

84 మందితో ప్రాబబుల్స్ విడుదల



న్యూఢిల్లీ: టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లీ, యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ రంజీట్రోఫీలో ఆడనున్నారు. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(డిడిసిఏ) బుధవారం ప్రకటించిన జట్టులో వీరిద్దరూ ప్రాబబుల్స్‌లో ఉన్నారు. ఢిల్లీ జట్టు తరఫున రిలీజైన 84 మంది జాబితాలో ఆ ఇద్దరు బ్యాటర్ల పేర్లు కూడా ఉన్నాయి. నిజానికి రంజీ సీజన్‌లో ఇద్దరూ అందుబాటులో లేకున్నా.. ఆ ఇద్దర్ని మాత్రం ఢిల్లీ రంజీ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు కల్పించారు.

సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మకు ఆ లిస్టులో చోటు దక్కలేదు. మయాంక్ యాదవ్ ఆ ప్రాబబుల్స్ బృందంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ చివరిసారి 2012లో రంజీ ట్రోఫీ ఆడాడు. ఘజియాబాద్‌లో అతను యూపి జట్టుతో తలపడ్డాడు. పంత్ కూడా చివరిసారి కోవిడ్‌కు ముందు రంజీల్లో ఆడాడు. ప్రోటోకాల్ ప్రకారం లిస్టును తయారు చేశామని, ఒకవేళ వాళ్లు కావాలంటే రంజీల్లో ఆడుకోవచ్చు అని ప్రాబబుల్స్‌లో పేర్లు పెట్టినట్లు డిడిసిఏ అధికారి తెలిపారు.

నేటి నుంచి న్యూజిలాండ్-శ్రీలంక రెండో టెస్ట్



గాలే : సెప్టెంబర్ 26 నుంచి గాలే వేదికగా న్యూజిలాండ్‌తో జరిగే రెండో టెస్ట్ కోసం శ్రీలంక తుది జట్టును ప్రకటించారు. ఈ మ్యాచ్ కోసం శ్రీలంక మేనేజ్‌మెంట్ రెండు మార్పులు చేసింది. తొలి టెస్ట్ ఆడిన రమేశ్ మెండిస్, లహీరు కుమార స్థానాల్లో అన్ క్యాప్డ్ ప్లేయర్ నిషాన్ పెరిస్, మిలన్ రత్నాయకే తుది జట్టులోకి వచ్చారు. స్పిన్నర్ రమేశ్ మెండిస్ తొలి టెస్ట్‌లో ఆరు వికెట్లు తీసినప్పటికీ అతన్ని తుది జట్టు నుంచి తప్పించడం ఆసక్తికరం. రమేశ్ తొలి టెస్ట్‌లో వికెట్లు తీసినా భారీగా పరుగులు సమర్పించుకోవడమే ఇందుకు కారణం. ఇక పేసర్ లహీరు కుమార న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో ప్రభావం చూపించ లేకపోయాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అందుకే రెండో టెస్ట్‌లో ఇతని స్థానాన్ని మరో పేసర్ మిలన్ రత్నాయకేతో భర్తీ చేసింది శ్రీలంక మేనేజ్‌మెంట్. కాగా, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కమిందు మెండిస్ సెంచరీతో ప్రభాత్ జయసూర్య తొమ్మిది వికెట్లు తీసి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు.

జట్లు(అంచనా)...

శ్రీలంక: ధనంజయ డిసిల్వ (కెప్టెన్), కరుణరత్నే, నిస్సంక, చండీమల్, మాథ్యూస్, కమిందు మెండిస్, కుసాల్ మెండిస్, నిషాన్ పెరిస్, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, అశిత ఫెర్నాండో.

న్యూజిలాండ్: టిమ్ సౌథీ(కెప్టెన్), లాథమ్, కాన్వే విలియమ్సన్, మిచెల్, రచిన్ రవీంద్ర, బ్లండెల్(వికెట్ కీపర్), ఫిలిప్స్, సాంట్నర్, అజాజ్ పటేల్, రూర్కే.

శ్రీకాంత్ శుభారంభం

మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

మకావు: మకావు బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో శ్రీకాంత్ 21-14, 21-15తో ఇజ్రాయేల్‌కు చెందిన డానియేల్‌ను చిత్తుచేశాడు. వరుససెట్లలో నెగ్గిన శ్రీకాంత్.. ప్రి క్వార్టర్స్‌లో భారత్‌కే చెందిన అస్మిత్ శెట్టితో తలపడనున్నాడు. ఇతర పోటీల్లో అస్మిత్ శెట్టి 21-13, 21-5తో భారత్‌కే చెందిన మిశ్రాను ఓడించగా.. సమీర్ వర్మ, మిథున్ మంజునాథ్, సుబ్రహ్మణ్యన్, చిరాగ్ శేన్ తొలిరౌండ్‌లో ఓటమిపాలయ్యారు.



మంజునాథ్ 12-21, 15-21తో హంగ్(చైనీస్ తైపీ), సుమిత్ వర్మ 21-18, 11-21, 13-21తో వాంగ్(చైనా) చేతిలో పోరాడి ఓడారు. మరో పోటీలో చిరాగ్ సేన్ 12-21, 17-21తో అగస్(హాంకాంగ్) చేతిలో, సుబ్రమణ్యన్ 14-21, 21-10, 12-21తో థాయ్‌లాండ్‌కు చెందిన తీరరస్టకుల్ చేతిలో పోరాడి ఓడారు. ఇక మహిళల సింగిల్స్‌లో తస్నిమ్ మీర్ మినహా.. మిగిలిన షట్లర్లంతా తొలిరౌండ్‌లోనే నిష్క్రమించారు. తస్మిన్ తొలిరౌండ్‌లో 15-21, 21-18, 22-20తో భారత్‌కే చెందిన సిహాగ్‌ను ఓడించి రెండోరౌండ్‌కు చేరింది.

బ్రూక్స్ సెంచరీ

మూడో వన్డేలో ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ గెలుపు



చెస్టర్ లీ స్ట్రీట్(ఇంగ్లండ్): ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 46పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 305పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 37.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 254 పరుగుల వద్ద ఉండగా.. భారీ వర్షంతో మ్యాచ్ నిలిచిపోయింది. అప్పటికే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ గెలుపు ఖాయమైంది. బ్రూక్స్(110నాటౌట్) విల్ జాక్స్(84), లివింగ్‌స్టోన్(33) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకుముందు ఆస్ట్రేలియా జట్టు బ్యాటర్లు స్టీవ్ స్మిత్(60), అలెక్స్ క్యారీ(77) అర్ధసెంచరీలకి తోడు హార్డీ(44), గ్రీన్(42), మ్యాక్స్‌వెల్(30) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. భారీ ఛేదనలో ఇంగ్లండ్ ఓ దశలో 11 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజ్‌లోకి దిగిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. 94 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. అతని ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రూక్స్‌కు లభించగా.. నాల్గో వన్డే లండన్ వేదికగా శుక్రవారం జరగనుంది.

పని ఒత్తిడితో కుర్చీలోనే కుప్పకూలిన మహిళా ఉద్యోగి..!

లక్నో : పని ఒత్తిడితో కుర్చీలోనే ఓ బ్యాంకు మహిళా ఉద్యోగిని కుప్పకూలిపోయిన ఘటన యూపీలోని లక్నోలో జరిగింది. గోమతినగర్‌లోని ఓ ప్రయివేట్ బ్యాంకులో అదనపు డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సదాఫ్ ఫాతిమా రోజులాగానే ... ఆఫీసుకు వచ్చారు. విధులు నిర్వహిస్తుండగా ఉన్నట్టుండి కుర్చీలోనే కుప్పకూలారు. తోటి ఉద్యోగులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ, అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. అయితే.. అడిషనల్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఫాతిమాకు ఇటీవల ప్రమోషన్ వచ్చిందని.. అప్పటి నుంచి ఆమె తీవ్రమైన పని ఒత్తిడికి గురైందని తన తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఎక్స్ ద్వారా స్పందించారు. ప్రయివేట్, ప్రభుత్వ సంస్థలు ఎకానమీ టార్గెట్‌లను సీరియస్‌గా తీసుకుంటున్నాయని, అది ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడికి దారితీస్తున్నాయని ఆరోపించారు.. ఇది ముమ్మాటికీ ఆందోళన కలిగించే అంశంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి అడ్డుకట్ట పడాలంటే.. పని ప్రదేశాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు.

మూసీ సుందరీకరణతో
వేల కోట్ల కుంభకోణం



(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌ను మురుగునీటి రహిత నగరంగా మార్చే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ట్రయల్ రన్ దశలో ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎస్టీపీల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని.. ఉప్పల్ నల్లచెరువు, ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్ ఎస్టీపీలను కూడా త్వరలోనే సందర్శిస్తామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదన్నారు. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం వేరే ఉందనే అనుమానం ప్రజల్లో ఏర్పడిందన్నారు.

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇంటి తాళాలు అప్పగించాకే.. వారి ఇండ్లను కూల్చాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే కూల్చివేతలను అడ్డుకుంటామని హెచ్చరించారు. మూసీని శుద్ధి చేయాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ఎస్టీపీలను వినియోగించుకుంటే సరిపోతుందని అన్నారు. హైడ్రా కూల్చివేతలపై పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయమా అని అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మంత్రుల, నేతల ఇండ్లు కూల్చిన తరువాత పేదల ఇండ్లు కూల్చాలన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామాలు ఆపేసి హైదరాబాద్ ఇమేజ్‌ను కాపాడాలని సూచించారు. బీఆర్ఎస్ నగర ఎమ్మెల్యేలతో చర్చించి హైడ్రాపై ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. రేవంత్ సర్కార్ కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తోందని, కోర్టు సెలవు దినాలైన ఆదివారం తెల్లవారుజామున కూల్చివేతలు చేయడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం అండగా ఉంటుందన్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాధితులు సంప్రదించాలని.. లేదా స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలను సంప్రదించాలని సూచించారు.బీఆర్ఎస్ హయాంలో మొహరం, వినాయక చవితి, సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్లు ఏవి జరిగినా కట్టుదిట్టమైన భద్రత కల్పించి ఎలాంటి గొడవలూ జరగకుండా చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను కూడా సమర్థవంతంగా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కెపి.వివేకానంద, కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

చెక్కుచెదరని బంధం

(మొదటిపేజీ తరువాయి)

కుదిరేంతవరకు ఆ దేశానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫెరీలో పునరుద్ఘాటించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల సందర్భంగా అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం న్యూయార్క్‌లో జరిగింది. ఈ సమావేశంలో క్యూబా విదేశాంగ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు బ్రూనో రొడ్రిగజ్ పెరీరా మాట్లాడుతూ, పాలస్తీనాను ఐరాసలో పూర్తి స్థాయి సభ్యురాలిగా ముందస్తుగా చేర్చుకోవడాన్ని స్వాగతించారు. . పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని అంతమొందించేందుకు నిజాయితీతో జరిగే చట్టబద్ధమైన అంతర్జాతీయ యత్నాలకు తాము సహకరిస్తామన్నారు. గాజాపైన, లెబనాన్‌పైన పెద్దయెత్తున బాంబు దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్ గత పన్నెండు మాసాల్లో 40వేల మంది ప్రాణాలు తోడేసింది. పెద్దయెత్తున ఇళ్ళు, ఆస్పత్రులు, ఇతర పౌర సదుపాయాలు ధ్వంసమయ్యాయి. గాజాలో 19 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనా ప్రజలకు మానవతా సాయం అందకుండా అడ్డుపడుతున్న ఇజ్రాయిల్ చర్యలను ఆయన ఖండించారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సంఘర్షణకు రెండు దేశాల ఏర్పాటే సరైన పరిష్కారమని, ఆ దిశగా దీనికి పరిష్కారం చూపేందుకు అలీనోద్యమం ఒత్తిడి పెంచాలని ఆయన కోరారు. 1967కు ముందున్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె)లో సౌతాఫ్రికా వేసిన పిటిషన్‌కు మద్దతుగా ఇంప్లీడ్ అవుతున్న దేశాల్లో క్యూబా మూడవది.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు 30 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్-ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మావోయిస్టుల మెరుపు దాడి

- పూసుగుప్ప బేస్ క్యాంపుపై గంట పాటు కవ్వింపు చర్య

నవతెలంగాణ-చర్ల

మావోయిస్టు విలీన ఉత్సవాల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప సమీప సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. బుధవారం సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 7:30 వరకు సుమారు 15 రౌండ్ల కాల్పులు జరిపినట్టు విశ్వసనీయ సమాచారం. సరిహద్దుల్లో చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ రాంపురం వైపు నుంచి మావోయిస్టులు బేస్ క్యాంప్‌పై ఎటాక్ చేసినట్టు తెలిసింది. ఫైరింగ్ చేయడంతో పాటు మందు పాత్రలు పేల్చి ఆ ప్రాంతమంతా హల్చల్ చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్న తరుణంలో పూసుగుప్ప క్యాంపుపై జరిగిన మెరుపు దాడి మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

నాలుగు రోజుల్లో కులగణనకు మార్గదర్శకాలు

- వారం, పది రోజుల్లో ప్రక్రియను ప్రారంభిస్తాం
- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తాం
- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలి : బీసీ సంఘాల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ, కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీసీలు ఎలాంటి సందేహాలకు లోనుకావొద్దని చెప్పారు. కులగణనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఒప్పుకున్నారని వివరించారు. నాలుగు రోజుల్లో కులగణన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. వారం, పది రోజుల్లో ఆ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభమవుతుందని చెప్పారు. బీసీ సంఘాల విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనను చేపట్టి స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతామంటూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించామన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కులగణనను నిర్వహించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. అందుకోసమే బీసీ కమిషన్‌ను నియమించామని గుర్తు చేశారు. కులగణన కోసం బీసీ సంఘాలు చేసే పోరాటంలో తప్పులేదనీ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 50 శాతానికి తగ్గించి బీసీలను రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీ గొంతు కోసిందని విమర్శించారు. ఇప్పుడు కులగణన అంటూ కొత్త పల్లవి అందుకుందనీ, బీఆర్ఎస్ పరిస్థితి చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు.

గత పదేండ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు కులగణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఆ పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అది కేవలం కుటుంబ పార్టీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధాని మోడీ ఉన్నప్పటికీ ఒరిగిందేమీ లేదని అన్నారు. బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తేయాలని కోరారు. కులగణన చేసే హక్కును రాష్ట్రాలకు కల్పించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించాలని చెప్పారు. కులగణన కాంగ్రెస్ పేటెంట్ అని అది నిర్వహించిన తర్వాత బీసీలు సంఘటితంగా ఏర్పడి నిజాం కాలేజ్ మైదానంలో లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే బీసీ సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి సంఘాలు, మేధావుల సలహాలు, సూచనలను తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే కులగణనను నిర్వహించి బీసీ రిజర్వేషన్లు పెంచాలనీ, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన చేసి పార్లమెంట్‌లో విపక్షాలకు రాహుల్ గాంధీని విమర్శించే అవకాశాన్ని ఇవ్వొద్దని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగాని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ, ప్రొఫెసర్ బాగయ్య, వివిధ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వేముల వెంకటేష్, శేఖర్ ఉప్పర, కొండ దేవన్న, బాలకృష్ణ నాయి, శంకర్ రజక, బి మనీ మంజరి, తాటికొండ విక్రమ్ గౌడ్, అయిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల కృషి వల్లే పండుగలు విజయవంతం

- వైద్య, విద్యారంగాలకు ప్రాధాన్యత : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అధికారులకు సత్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండుగలను అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా కష్టపడి పని చేయడంతో విజయవంతం అయ్యాయని రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని తెలిపారు. బుధవారం నగరంలోని గోల్కొండ హోటల్‌లో బోనాలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ సక్సెస్ మీట్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పండుగలకు అధికారులు కష్టపడి విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని అభినందించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతమూ కలగకుండా పోలీస్ సిబ్బంది కృషి చేసిందన్నారు. భవిష్యత్‌లో ఇలాగే అందరూ సమిష్టి బాధ్యతగా భావించి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు.. ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు నష్టం జరగకుండా పునరావాసం, ఉపాధి కల్పిస్తామని చెప్పారు. అనంతరం అధికారులకు శాలువా కప్పి మెమోంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ ఏసీపీ విశ్వ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైడ్రాలో 169 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

బట్టి వేతనాలనూ ఖరారు చేసారు. ఐఏఎస్ కేడర్‌ను కమిషనర్ పోస్టుగా, మరో ఎస్పీ ర్యాంక్ కేడర్ పోస్టు అధికారిని అడిషనల్ కమిషనర్‌గా నియమించుకొనేందుకు ఆర్థికశాఖ అనుమతించింది. వీరితో పాటు మరో మూడు ఎస్పీ ర్యాంక్ అధికారుల పోస్టులు, 5 డీఎస్పీ పోస్టులు, 16 మంది ఇన్స్‌పెక్టర్లు, 16 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, 3 రిజర్వు ఇన్స్‌పెక్టర్ పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. వారితోపాటు 60 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఒక అసిస్టెంట్ అనలిటికల్ ఆఫీసర్, ఒక రీజినల్ ఫైర్ ఆఫీసర్, మూడు సిటీ ప్లానర్, 12 అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, ఎమ్మార్వో, సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్ వంటి మొత్తం 169 పోస్టులకు భర్తీకి అనుమతి లభించింది.

అటవీ జంతువుల నుంచి జీవనోపాధిని రక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

నియంత్రించడానికి శాస్త్రీయంగా చంపడం సహా ఇతర చర్యలను ప్రకటించే రాష్ట్రాల హక్కులకు హామీ ఉందని నిర్ధారించాలి.షెడ్యూల్ జంతువుల జాబితా నుంచి అడవి పందిని తొలగించాలి.

3. ఏకపక్ష ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌లు, వన్యప్రాణుల అభయారణ్యాలు, బలవంతపు తొలగింపులను ఆపాలి.

4. అటవీ హక్కులు, కమ్యూనిటీ అటవీ హక్కులను నిర్ధారించాలి. ఎఫ్ఆర్ఎ, పీఈఎస్ఎ ఉల్లంఘనను ఆపాలి. అటవీ ప్రాంత ప్రజలకు విద్యుత్తు అందేలా చూడాలి.

5. పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలి. ఉత్పత్తి లేని పశువులను మార్కెట్ ధరలకు కొనుగోలు చేయాలి. ఆవు విజిలెంట్ గ్రూపులపై బలమైన నిరోధక చర్యలను నిర్ధారించాలి.

6. వన్యప్రాణుల వల్ల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, అలాగే తీవ్ర గాయాలపాలైన వారికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి.

7. పంచాయతీలు, గ్రామసభల ద్వారా పంట నష్టాలను సరిగ్గా అంచనా వేసి తగిన పరిహారం అందించాలి.

8. కృత్రిమ వాణిజ్య కలప చెట్లను, ఆక్రమణ జాతులను దశలవారీగా క్లియర్ చేయాలి. అటవీ ప్రాంతాల్లో పండ్ల చెట్లను, వెదురును ప్రోత్సహించాలి.

9. హాట్ బెడ్‌లలో కందకాలు, వైర్-మెష్, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించాలి.

10. ఉపాధి కింద సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు కమ్యూనిటీ వాచ్‌ను రోజుకు రూ.1,000కి ఏర్పాటు చేయాలి.

మంత్రుల అరాచకాలు ఎండగడదాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మంత్రుల అరాచకాలను ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. అధికార అహంకారంతో ఈ జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. వారి అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో హైదరాబాద్‌లోని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తతంగా చర్చించారు. పార్టీ చేపట్టనున్న అంశాలు, కార్యక్రమాలను నేతలకు కేటీఆర్ వివరించారు. జిల్లాలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తోందని కేటీఆర్‌కు జిల్లా పార్టీ నేతలు వివరించారు. అదే విధంగా కాంగ్రెస్ నేతల అరాచకాలకు, అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏ విధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజక వర్గాల వారీగా కేటీఆర్‌కు వివరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని అంశాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

రాష్ట్ర రాజకీయాలతో పాటు నల్లగొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపై కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలోకి వెళ్దామని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను స్థానిక జిల్లా నేతలకు కేటీఆర్ వివరించారు. కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో పాటు నల్లగొండ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మరుపల్లిలో బీఆర్ఎస్ దళిత కార్యకర్తలపై పోలీసుల దాడి : కేటీఆర్ ఆగ్రహం

వికారాబాద్ నియోజకవర్గంలోని మరుపల్లిలో పార్టీ కార్యకర్తలైన నవీన్, ప్రవీణ్ అనే ఇద్దరు దళితులపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తూ అక్రమ కేసులతో అక్రమంగా వ్యవహరిస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దాడికి గురైన బాధితులు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పోలీసుల చేతిలో దాడికి గురైన బాధితులకు ఈ సందర్భంగా కేటీఆర్ ధైర్యం చెప్పారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే తాను కూడా వికారాబాద్‌కు వచ్చి ఆందోళన చేస్తానని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జరిగే ఇలాంటి చిల్లర దాడులతో ధైర్యం కోల్పోవద్దని కార్యకర్తలకు సూచించారు. బాధితులకు పూర్తిగా న్యాయసాయం పార్టీ లీగల్ సెల్ ద్వారా అందిస్తామన్నారు.

స్పీకర్ స్పందించాలి

అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో దళితులను పోలీసులు హింసిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదని కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ఆయన ఈ దాడులను ఖండించాలని కోరారు. దాడికి పాల్పడిన ఎస్సై విషయంలో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌తో, డీజీపీతో మాట్లాడుతానని కేటీఆర్ చెప్పారు.

ఓటమి మన మంచికే

ఓటమి కూడా మన మంచికే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనేక హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలను ప్రజలు గ్రహిస్తూ మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన హన్మకొండ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 14 ఏండ్ల ఉద్యమపార్టీగా అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఢిల్లీని ఒప్పించి తెలంగాణ సాకారం చేసుకున్నామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చేసిన పనులను చెప్పుకోలేకపోయిందనీ, కాంగ్రెస్ చేయని పనులను కూడా చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నదని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, అత్తకు రూ.4 వేలు, కోడలుకు రూ.2,500 తదితర హామీలను కేటీఆర్ గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవా లని ఆదేశించడంతో ఫిరాయించిన వారిలో భయం మొదలైందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలిపారు. రాజయ్యే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ కవచంలా ఉంటూ కాపాడుతున్నదని కేటీఆర్ విమర్శించారు.

రైతుల గోస చూడు : కేటీఆర్

ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదు-కన్నెత్తి రైతుల గోస చూడు ముఖ్యమంత్రి అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. మాఫీ కానీ రుణమాఫీ- పత్తా లేని పాల బిల్లులు-వేస్తావన్న భరోసా లేని రైతు భరోసా - బోనస్ పేరుతో బోగస్ మాటలు, ఒకటా రెండా అన్నింట్లో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ విమర్శించారు. రైతు రోడ్డెక్కితే జంకిన మీరు 150 కోట్ల రూపాయల పాల బిల్లుల బకాయిలకు 50 కోట్ల రూపాయలు విడుదల ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పుణ్యమా అని ఈ దసరా రైతులకు మునపటి దసరాలా ఉండేలా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

గురుకులాల సమస్యలను
సత్వరమే పరిష్కరించాలి

- సొంత భవనాలను నిర్మించాలి
- మెనూచార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలి
- జేఏసీ ఆందోళనను విరమింపజేసేందుకు చర్యలు తీసుకోండి : సీఎస్ శాంతికుమారికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఐదు రకాల గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమింపజేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారికి బుధవారం ఆయన లేఖ రాశారు. గురుకులాల సమస్యలపై ఈనెల 18 నుంచి 23 వరకు దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల కింద ఉన్న ఐదు రకాల సొసైటీల పరిధిలోని 1,022 గురుకులాల్లో సుమారు 700 గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. వసతి సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలనీ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పనివేళలను సవరించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. గురుకులాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన

- పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనెల 27న చేపట్టిన విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,225 కోట్లు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడూతున్నారని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నా రన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. యూనివర్సిటీ లకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్స్‌ను నియమించాలన్నారు. 27న ఇందిరాపార్క్ వద్ద జరిగే విద్యార్థి మహా గర్జనకు విద్యార్థులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు స్టాలిన్ శ్రీమాన్, జిల్లా సహాయ కార్యదర్శి నాగేందర్, ప్రశాంత్, లక్ష్మణ్, నాయకులు నికిత, భగత్, భారత్, పవన్, వరుణ్, కైలాష్, ప్రణవ్ యాదవ్ పాల్గొన్నారు.

అలా అనొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశించి కూడా సదరు న్యాయమూర్తి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

వాదిస్తున్న కేసుకు సంబంధం లేని రీతిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి వుండాలని న్యాయమూర్తులకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి అనవసర వ్యాఖ్యలు చేయడం వల్ల ఆ న్యాయమూర్తులపై వ్యతిరేక అభిప్రాయాలు ఏర్పడడమే కాకుండా మొత్తంగా న్యాయ వ్యవస్థపైనే ప్రతికూల ప్రభావం పడుతుందని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. న్యాయమూర్తులు, లాయర్లు, కక్షిదారులు, ముఖ్యంగా పిటిషనర్లు అందరూ కూడా తమ భాష, వ్యవహార శైలిలో సంయమనం పాటించాల్సిన అవసరం వుందన్నారు. కోర్టులో వున్నవారే కాదని, బయటవున్న లక్షలాదిమంది జనం కూడా తమను చూస్తారని వారు గ్రహించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న మరునాడే ఈ నెల 21నే బహిరంగ న్యాయస్థానంలో జస్టిస్ శ్రీశానంద క్షమాపణ చెప్పారు. దాంతో ఇక ఈ విషయాన్ని ఇంతటితో మూసివేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

సీఎం సహాయనిధికి రూ.ఒక కోటి విరాళం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి సహాయనిధికి కిమ్స్ ఆస్పత్రి రూ.ఒక కోటి విరాళం అందజేసింది. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కిమ్స్ హాస్పిటల్ ఎండీ భాస్కర్ రావు కలిసి చెక్కును అందజేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సినీ గేయ రచయిత చంద్రబోస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డును చంద్రబోస్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబోస్‌ను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తి

- కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రైతాంగ పోరాట యోధ, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి (సెప్టెంబర్ 26) సందర్భంగా ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. అణిచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, అస్తిత్వ ఉద్యమంలో, స్వయం పాలన కోసం కొనసాగిన పోరాటంలో, పెద్ద ఎత్తున బహుజనులు భాగస్వామ్యం కావడం వెనక నాడు ఆమె పోరాట స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ తెలిపారు. చిట్యాల ఐలమ్మ ఆకాంక్షలకు అనుగుణంగానే.. పదేండ్ల బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వం, బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ, ప్రగతి కార్యాచరణ ను అమలుచేసిందని గుర్తుచేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ సబ్బండ వర్గాలకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వేలకోట్ల రూపాయలతో పలు పథకాలను అమలు చేసి వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిపిందని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ చెప్పారు. ఐలమ్మ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారంగా నిర్వహించాలని నిర్ణయించి అమలు చేసిందని గుర్తుచేశారు. బలహీన వర్గాలు, నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేయడమే ఐలమ్మకు మనమర్పించే ఘన నివాళి అని కేసీఆర్ తెలిపారు.



చిన్నతనం నుంచే పిల్లలకు పోలీసులు చేసే విధుల గురించి తెలియపర్చాలనే ఉద్దేశంతో హయత్‌నగర్‌లోని సాయి చైతన్య మోడల్ స్కూల్ విద్యార్థులను హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు బుధవారం తీసుకొనివచ్చారు. పోలీసులు ప్రతి రోజు చేస్తున్న విధుల గురించి, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంపై అవగాహన కల్పించారు. స్టేషన్ అధికారి నాగరాజు, స్కూల్ చైర్మెన్ మూర్తి పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్‌నగర్

వివాహిత అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వివాహిత అదృశ్యమైన సంఘటన పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాడపాటి నవీన్ రాజ్,మాడపాటి గీతాంజలి భార్య భర్తలు. ఇద్దరూ జీవనోపాధి కోసం శివకూడ గ్రామం,రాజోల్ మండలం,అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ నుండి నెల క్రితం వచ్చి మహేశ్వరం మండలం తుక్కుగూడలో మిర్చి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 23న భార్య గీతాంజలి సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం బంధువులను స్నేహితులను సంప్రదించగా ఆచూకీ లభించలేదు. దాంతో భర్త నవీన్ రాజ్ పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పిర్యాదు చేశాడు. ఆయన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



జలమండలిలో
ఏడుగురికి కారుణ్య నియామకం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో ఏడుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ఏడుగురి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు.. వారి వారి విద్యార్హతలను బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ఈ నియామక పత్రాలను వారికి అందించారు.

ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బైరామల్‌గూడలో సీపీఐ(ఎం) పార్టీ చంపాపేట శాఖ మహాసభ ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, రవీందర్ యాదవ్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డు ఇవ్వాలి కోరారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు తీసుకొచ్చి.. కార్పొరేట్ శక్తులు తీసుకున్న అప్పులను రూ.17 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని ఆరోపించారు. కార్మిక చట్టాలను మారుస్తూ 4 లేబర్ కోడ్స్‌ను కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ కూలీల, రైతుల చట్టాలను మారుస్తూ,పేదల పొట్టలు కొడుతూ పెద్దలకు కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో జెమిలి ఎన్నికల పేరుతో ఒకటే కార్డు ఒకటే ఓటు ఒకటే మతం ఒకటే ఓటు ఎన్నికలు అంటూ మరోసారి ప్రజలకు ఉన్న హక్కులన్నీ తీసివేయడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తూ ఉందని అన్నారు. భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను ఎస్సీ, ఎస్టీ, సామాజిక వర్గాలకు అందకుండా రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారత ప్రజలపైన ఉందన్నారు.

ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎలాంటి సంబంధం లేని బీజేపీ పార్టీ ప్రజలకు రంగు పూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సామాజిక వివక్ష అణచివేత మీద సమైక్య పోరాటమే వీర తెలంగాణ రైతంగా సాయుధ పోరాటమని, ఆ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని వెల్లడించారు. నిజాం, రజాకార్ల, భూస్వాములకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం 3 వేల గ్రామాల్లో ఈ పోరాటంలో వేలాది మంది వీరమరణం పొందారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ప్రారంభమైన నాటి నుంచి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మరో ముగ్గురుతో తొలి సమావేశం జరిగిందని గుర్తు చేశారు. నిజాం ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీగా 1941 ఒకటిలో ఏర్పడిందని, ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలందరూ తిరగబడ్డారు అన్నారు. తప్పని పరిస్థితుల్లో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారతదేశంలో విలీనం కమ్యూనిస్టుల విజయం అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కొనసాగించారని వివరించారు. చంపాపేట డివిజన్లో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి.. ప్రజా సమస్యలను పరిష్కరించేంతవరకు ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా మనం పోరాటం చేయాలని అన్నారు. గతంలో వచ్చిన వర్షాలకు రోడ్డు ఎక్కడికక్కడ కొట్టుకుపోయి గుంతలు గుంతలుగా మారుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయాలని, ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. హైడ్రా వల్ల ప్రజల్లో సమస్యలు తీవ్రంగా ఉందన్నారు. ఆ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు రామస్వామి, చంపాపేట శాఖ నూతన కార్యదర్శిగా బి, దుర్గారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు గణేష్, ప్రభాకర్, కోటేశ్వరరావు, గోపి, నగేష్, యేసు, చిన్న, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేకుంది. సీఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గుంతపల్లి గ్రామానికి చెందిన బరిగెల రాములమ్మ జీహెచ్ ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని షాడో హాస్పిటల్ ఎదుట రోడ్డుపై వెళ్తున్న రాములమ్మను హయత్ నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ కు పోలీసులు తలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సర్టిఫికేట్స్ అందజేత

నవతెలంగాణ-నాగోల్

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్స్ ద్వారా నెలపాటు ఆన్లైన్ ద్వారా శిక్షణ పొంది రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని మినర్వాగ్రాండ్ హోటల్లో మోటివేటర్ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మోడిమెట్ అయిన నాగోల్‌కు చెందిన ఉప్పుల శ్రీనివాస్, ఉప్పుల శివరాణి, జోన్నల శ్రావణిలు ఉత్తమ సర్టిఫికేట్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటికో స్పీకర్, ఊరికో ట్రైనర్ నినాదంతో ఇంపాక్ట్ పని చేస్తుందన్నారు. నవభారత్ నిర్మాణానికి రాలెత్తే కూలీలం మేము అనే నినాదంతో ఎంతో మంది నైపుణ్యం దానాన్ని పంచి, ఇంపాక్ట్ ద్వారా అందరికి ట్రైనర్స్, మోటివేటర్, తీర్చి దిద్దడం జరిగిందన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం అనేద గడిచిన 40 రోజులుగా జూమ్ మిటింగ్ ద్వారా జరిగిందన్నారు. రెండు రోజులుగా హైదరాబాద్లోని ఒక స్టార్ హోటల్లో ఆఫ్ లైన్లో కండక్ట్ చేశారన్నారు. టీటీటీడబ్ల్యూఎస్ 170 బ్యాచ్ ట్రైనింగ్ ప్రొగ్రాంలో 60 మందిలో అందరికంటే బాగా పెర్ఫార్మెన్స్ చేసినందుకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అదు కోవడం జరిగిందని తెలిపారు. మాస్టర్ మోటివేటర్ గంప నాగేశ్వ ర్రావుకు, స్ఫూర్తి ఫౌండర్ శ్యాం, రాథోడ్, ప్రవీణ్, విశ్వశ్రీ, మెంటర్స్ రమేష్ చేతుల మీదుగా సర్టిఫికేట్స్‌ను అందుకున్నట్టు తెలిపారు. ఈ అవార్డును అందుకోవడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు.





క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఉప్పల శ్రీనివాసగుప్త

నవతెలంగాణ- నాగోల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హైదరాబాద్ నగరంలోని హైటెక్ సిటీలో గల ఇస్తే హోటల్లో బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ తొలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బ్యాట్మెంటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన జరిగిన తొలి కార్యవర్గ సమావేశంలో పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ.. నవంబర్ 14ను పురస్కరించుకొని 14,15,16 వయస్సు గల పిల్లలకు వన్ డే కప్పును నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు క్రీడాకారులను ప్రోత్సహించాలని చర్చించినట్టు తెలిపారు. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా కృషి చేస్తుంది అని





ఆయన అన్నారు. ప్రతి జిల్లాకు ఒక స్టేడియం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారని అన్నారు. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పల శ్రీనివాసగుప్తను పుల్లెల గోపీచంద్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ యువీఎం బాబు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి క్రీడల శ్రీనివాస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ భాస్కర్, కోశాధికారి హర్ష యాదవ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జాయింట్ కార్యదర్శి నాగరాజు, రమేశ్, వైస్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ వేణు కుమార్ షేక్ రేష్మ, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో
డ్రైవర్, కండక్టర్ల పాత్ర ఎంతో గొప్పది

డిపో మేనేజర్ విజయ్

నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధిలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌ల పాత్ర ఎంతో గొప్పదని హయత్ నగర్ 1 డిపో మేనేజర్ విజయ్ పేర్కొన్నారు. హయత్ నగర్1 డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్‌లకు, ఇందనం పొదుపు చేసిన డ్రైవర్‌లకు నగదు, పురస్కారాలను అందజేసినట్టు తెలిపారు. అందులో భాగంగా ఉత్తమ ప్రతిభ



కనపర్చిన ఉదయశ్రీ, రమాదేవి, లక్ష్మరెడ్డి, ప్రశాంత్, సురేందర్ నగదు పురస్కారాలతో అభినందనలు తెలిపారు. అదే విధంగా సంస్థ నూతనంగా ప్రవేశ పెట్టిన మెట్రో డీలక్స్ బస్సులను ప్రతి 30 నిముషాలకు ఒకటి చొప్పున హయత్ నగర్ నుండి ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా 290యూ రూట్‌లో జేబీఎస్ వరకు నడిపిస్తున్నామని ఈ బస్సులను ప్రయాణికులు ఆదరించి సుఖమాయవంతంగా ప్రయాణం చేయాలని కోరారు. అంతేగాక సంస్థ ప్రయాణికులకు మరింత చేరువ కావడానికి ప్రవేశపెట్టిన టికెట్ బుకింగ్ యాప్, గమ్యం యాప్, ట్విటర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని సంస్థ అందించే సదుపాయాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో సహాయ మేనేజర్ విజయ కుమారి పాల్గొన్నారు.

బాపుబాటలో
సత్య శోధన పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ- నాగోల్

నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా బాపుబాటలో సత్య శోధన పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 100 రోజుల పాటు 1000 కిలో మీటర్ల మేర గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు గాంధీ జ్ఞాన ప్రతిష్టన్ ఆధ్వర్యంలో పాదయాత్ర సాగుతుందని అన్నారు. జోగులాంబ దేవాలయం ఆలంపూర్ నుండి ఉమా మహేశ్వర దేవాలయం అచ్చంపేట వరకు కొనసాగుతుంది అని చెప్పారు. ఈ పాదయాత్రలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బడే సబ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలు
చేపడితే చర్యలు తీసుకుంటాం'



నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. పుర పాలక సంఘం పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని కుంట్లూర్ గ్రామంలో ఉన్న 24వ వార్డులో సర్వే నెంబర్ 143లో ఇంటి నిర్మాణాలు చేపట్టొద్దని కోర్టు ఆర్డర్లు ఉన్నా ఉత్తర్వులను దిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నందున ఆ గృహ నిర్మాణాలను బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఏసీపీ శ్రీనివాస్, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.



'గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి'

నవతెలంగాణ-హయత్ నగర్

వర్షాలు ఎక్కువగా పడుతుండడం, ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిల్వ ఉండడంతో అనేక రకాల వ్యాధుల కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని, వీటి విషయంలో గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి కన్సల్టెంట్, ఆబ్స్టెట్రిక్స్, గైనకాలజీ డాక్టర్ బి. మేనక సూచించారు. బుధవారం కామినేని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'ప్రస్తుతం నగరంలో డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. వీటివల్ల సాధారణ ప్రజలతో పాటు గర్భిణులకు ఇంకా ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయని ప్లేట్ లెట్లు తగ్గడం, కీళ్ల నొప్పులు, లంగ్ ఇన్ఫెక్షన్ వల్ల ఆయాసం రావడం, రక్తం గడ్డకట్టకుండా హెమరేజ్ ఏర్పడి షాక్‌లోకి వెళ్లి, చివరకు ఐసీయూలో చేరాల్సి వస్తోందన్నారు. చాలామందిలో ఆక్సిజన్ శాచ్యురేషన్ కూడా పడిపోతోందన్నారు.



చికెన్‌గున్యాతో మోకాళ్ల నొప్పులు, నడవలేకపోవడం, రాషెస్ ఉంటున్నాయన్నారు. మలేరియా కూడా ఎక్కువగానే ఉందన్నారు. గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో అయినా, ఐదో నెలలో ఉన్నా, లేదా ప్రసవానికి కొద్ది ముందుగా అయినా ఇలాంటి జ్వరాలు వస్తే వెంటనే గైనకాలజిస్టును, ఇంటర్నల్ మెడిసిన్ నిపుణులు లేదా ఫిజిషియన్‌ను సంప్రదించాలని సూచించారు. కొంతమంది తెలిసి, తెలియక ఒళ్లు నొప్పులు తగ్గుతాయని ఎసి క్లోఫినాక్ లాంటి నొప్పి నివారణ మందులు వాడడం వల్ల వారిలో ప్లేట్‌లెట్లు పడిపోయి కండిషన్ సీరియస్ అవుతోందన్నారు. ఏ సమస్య వచ్చినా గర్భిణులు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి, వాళ్ల సలహా మేరకు మాత్రమే పారాసిటమాల్ లేదా యాంటీబయాటిక్స్ వాడాలన్నారు. కొందరిలో అబార్షన్లు అయ్యే ప్రమాదం కూడా ఉంటుందన్నారు.

జ్వరాలు రాకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి, నీళ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చేతులకు నూనె రాసుకోవడం, చేతులు, కాళ్లు పూర్తిగా కవర్ అయ్యే దుస్తులు వేసుకోవడం ముఖ్యం. దోమతెరలు ఉపయోగించాలి. ఇలాంటి ముందుజాగ్రత్తలు ముఖ్యం. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. డీహైడ్రేషన్ ఉంటే నొప్పులు త్వరగా తగ్గవు. జాగ్రత్తలు తీసుకుంటే ప్రసవం సులభంగా అవుతుంది. సొంత మందులు వాడితే లేనిపోని సమస్యలు ఎదురవుతాయన్నారు. మొదటి మూడు నెలల్లో జ్వరాలు తీవ్రంగా వస్తే గర్భస్థ శిశువులకు కూడా సమస్యలు వస్తాయి. మరీ ఎక్కువైతే కడుపులో బిడ్డకు, తల్లికి ఇద్దరికి ప్రాణాపాయ పరిస్థితి రావచ్చు. అందువల్ల గర్భం దాల్చినవారు ప్రస్తుత సీజన్‌లో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించకుండా సొంత వైద్యంతో మందులు మాత్రం వాడకూడదు" అని కామినేని ఆస్పత్రి వైద్యనిపుణులు వివరించారు. ఆమె వెంట వైద్యులు అర్చన, ప్రసన్న లత, వాసవి ఉన్నారు.

చలో లేబర్ కమిషనరేట్‌ను జయప్రదం చేయాలి



- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్

నవతెలంగాణ-తుర్కయంజాల్

కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 2024 సెప్టెంబర్ 30న నిర్వహించతలపెట్టిన చలో లేబర్ కమిషనరేట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్‌లు హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 2024 సెప్టెంబర్‌లలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగ కార్మికుల సమస్యలపై క్యాంపెయిన్ నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ పరిశ్రమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల శాఖల్లోని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, మున్సిపల్ గ్రామపంచాయతీ తదితర స్థానిక సంస్థలు వైద్య ఆరోగ్య, విద్యుత్తు రంగం మరియు వివిధ రకాల హమాలీ కార్మిక సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఇప్పటికే సర్వే నిర్వహించినట్టు తెలిపారు. ఈ సర్వే వలన కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ముఖ్యంగా ప్రైవేట్ యాజమాన్యాలు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తూ కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలు అమలు చేయకుండా పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు కూడా తీవ్రమైన శ్రమదోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలని, కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ అందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు.

ఈ నెల 30న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. కిషన్, డి. జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి వై. స్వప్న జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. బుగ్గరాములు, సీహెచ్. ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'నేడు జీఎస్ఐ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం'

నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో గల భారతీయ భూ వైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ పరిధిలో గల తట్టిఅన్నారం ఆర్కేనగర్ కాలనీలోని రహదారులలో స్వచ్ఛతే సేవ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు జీఎస్ఐ శిక్షణ సంస్థ ప్రజా సంబంధాల అధికారి, భూ వైజ్ఞానిక శాస్త్రవేత్త అధ్యాపకులు డాక్టర్ గంజి మల్లేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జీఎస్ఐ శిక్షణ సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగస్తులు, సిబ్బందితోపాటు పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జీఎస్ఐ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నాగారం పట్టణాభివృద్ధికి కృషి : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-కీసర

నాగారం పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్టు నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని వార్డు నెం.6, 7లో గల శిల్పానగర్ కాలనీలో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ. 20 లక్షలతో చేపడుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కౌకుట్ల చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. రాజేందర్ కుమార్, వైస్ చైర్ పర్సన్ బి. మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్ కౌకుంట్ల అనంత రెడ్డి, గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్, పాల్గొన్నారు.

భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువులపై అవగాహన



నవతెలంగాణ-శామీర్‌పేట

భూసార పరీక్షలు చేసుకుని సరైన పంట వేసి అధిక దిగుబడులు సాధించాలని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం జగముగూడ గ్రామంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు సూక్ష్మ జీవులతో సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. భూసార పరీక్షలపై బస్సు ద్వారా ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. పుష్పజిత్ చౌదరి, డా. లావణ్య, డా. చేతన్, లక్ష్మారెడ్డి, ఏఓ రమేష్, ఏఈఓ రవి, రైతులు బాల్‌రెడ్డి, అనిల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డంపింగ్ యార్డ్

- రాంకీ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి
- స్కూటీని డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి
- మృతదేహంతో రాంకీ ఆఫీసు ఎదుట నిరసన

నవతెలంగాణ-జవహర్‌నగర్

రాంకీ డంపింగ్ యార్డ్ తమ పాలిట పెనుభూతంగా మారిందని, ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోయారని స్థానికులు మండిపడుతున్నారు. లారీలు ఎక్కువగా నడవడంతో రోడ్డు గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయని, రాంకీ యాజమాన్యానికి చెప్పినా ఎలాంటి లాభం లేదన్నారు. ఇటీవల కోట్ల రూపాయలతో కల్వర్టు నిర్మాణం చేపట్టినా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలవడంతో సీఆర్పీఎఫ్, మల్కారానికి ఆర్టీసీ బస్సులను నిలిపేశారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు వద్ద ఇంతకుముందు చాలా ప్రమాదాలు జరిగాయని, ఇప్పుడు ఓ నిండు ప్రాణం బలైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని చెత్తను జవహర్‌నగర్‌కు తీసుకురావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. నగరానికి నాలుగు దిక్కుల డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని



హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు కాలేదని గుర్తు చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు క్యాపింగ్ పనులు చేశారని, రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు డంపింగ్ యార్డు తొలగిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు సీఎంగా ఉన్నారని డంపింగ్ పెనుభూతం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

స్కూటీ డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి

స్కూటీని డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం కీసర మండలం తిమ్మాయిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ప్రమీల భర్త మాజీ ఉప సర్పంచ్ కందాడి అమరేందర్ రెడ్డి స్కూటీపై వెళ్తుండగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ మల్కారం మలుపు వద్ద చెత్త లారీలు అధికంగా నడవడంతో రోడ్డుపై గుంతలను తప్పించబోయి అదుపు తప్పి పడిపోయాడు.



వెనుక నుండి వాటర్ ట్యాంకర్ల లోడుతో వస్తున్న డీసీఎం అతని మీద నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

డంపింగ్ యార్డ్ వద్ద ఉద్రిక్తత

రాంకీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వలన నిండు ప్రాణం బలైందని అమరేందర్ రెడ్డి మృతదేహంతో డంపింగ్ యార్డ్‌లోని రాంకీ ప్రధాన కార్యాలయం వద్ద స్థానికులు, బంధువులు ఆందోళన చేశారు. రాంకీ డౌన్ డౌన్, జీహెచ్ఎంసీ మేయర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో డంపింగ్ యార్డ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు రాంకీ కార్యాలయం అద్దాలను ధ్వంసం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. దీంతో మేడ్చల్ జిల్లా ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, కుషాయిగూడ ఏసీపీ మహేష్, కాప్రా మండల తహశీల్దార్ సుచరిత సంఘటన స్థలానికి వెళ్లి సర్ది చెప్పినా మృతుడి కుటుంబ సభ్యులు వినకపోవడంతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడిపించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో నిరసన ఉపసంహరించుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం

-మేయర్ శాంతి డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో తిమ్మాయిపల్లికి చెందిన అమరేందర్ రెడ్డి చనిపోయాడన్న సమాచారంతో జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కమిషనర్ ప్రవీణ్ రెడ్డిలు ఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో, రాంకీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజకుమార్, ఎడ్ల శ్రీనివాసరెడ్డి, శారద మనోహర్ రెడ్డి, పల్లపు రవి, మేకల లలిత యాదవ్, మారగోనినాగరాణి వెంకటేష్ గౌడ్, కృష్ణ గౌడ్, పానుగంటి బాబు, రాజు కుమార్, ప్రేమల శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, ఉన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నర్సింహారెడ్డికి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-కాప్రా,ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, టీచర్లు లేని స్కూళ్లల్లో ఉపాధ్యాయులను నియమించాలని, అదనపు తరగతి గదులు నిర్మించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నర్సింహారెడ్డిని ఆయన కార్యాల యంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నర్సింహా రెడ్డి ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఉప్పల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీద బాలరాజు గౌడ్, వెంకట్‌రాం రెడ్డిలు హాజరై జర్నలిస్టుల ఇండ్ల పట్టాలు, హెల్త్‌కార్డులపై చర్చించారు. ఇండ్ల పట్టాలకు దరఖాస్తుల స్వీకరణపై అవగాహన కల్పించారు.

పార్కు స్థలాన్ని పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-ఘట్కేసర్

గతంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజు మొహమ్మద్‌కు ఇచ్చిన పిటిషన్‌పై హెచ్ఎండీ అధికారులు స్పందించారు. బుధవారం ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న నర్సరీ స్థలాన్ని హెచ్ఎండీఏ డీఈ జగన్, ఏఈ జీవన్ రెడ్డి, ఫారెస్ట్ మేనేజర్ సునీతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పార్కుపై గతంలో పిటిషన్ ఇచ్చిన సీపీఐ(ఎం) నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్. సబిత, జి. నాగమణి, టీఎస్ ఉద్యమ నాయకుడు బాబు చారి మాట్లాడుతూ.. ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం అన్నారు. గతంలో ఉన్న పంచాయతీలు అన్నీ ఇప్పుడు మున్సిపాలిటీలలో కలిశాయని తెలిపారు. ఈ పార్కు ఘట్కేసర్, పోచారానికి మధ్యలో ఉన్న స్థలం అని పేర్కొన్నారు. ఇది వరంగల్ హైవేకు, ఔటర్ రింగ్‌రోడ్డుకు అనుకొని ఉన్న స్థలం అని పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుండి యాదగిరిగుట్ట స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి, కీసర రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి రావడానికి ప్రధానమైన రహదారి కాబట్టి వచ్చి పోయేవారు ఈ పార్కులో సేద విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఘట్కేసర్, పోచారం మున్సిపాలిటీ ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. కాబట్టి ఈ స్థలాన్ని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేయాలని అధికారులకు చింతల యాదయ్య వివరించారు.

వరద బాధితులకు నూతన దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

విజయవాడ వరద బాధితులకు విజయవాడలోని ఆర్ఎస్ స్టీల్ సిండికేట్, ఈసీఐఎల్ చౌరస్తాలోని సోలిస్ ఐ ఆస్పత్రి వారు సంయుక్తంగా రూ.5 లక్షల విలువ చేసే నూతన దుస్తులను పంపిణీ చేశారు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని ఆర్ఎస్ స్టీల్ సిండికేట్ ఎండీ బాలమురళీకృష్ణ, ప్రొప్రైటర్ పొనూరి రోహిత్, ఈసీఐఎల్ చౌరస్తాలోని సోలిస్ ఐ ఆస్పత్రి చైర్మెన్ నందనంపాటి రామాంజనేయులు (ఎస్.రాము), గుంటూరు సంగడి కుంట గొల్ల ఆంజనేయ స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని రాజరాజేశ్వరి పేటలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు, చీరలు, పురుషులకు టవళ్లు, లుంగీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన నందనంపాటి రాము మిత్రబృందంతో పాటు పుల్లారావు, మద్దాల కామేశ్వరరావు, సీతారాం గుప్తా, కిషోర్, పురుషోత్తం, రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలి

- ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత



నవతెలంగాణ-ఘట్కేసర్

టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ మహేంద్ర హిల్స్ గురుకుల క్రీడా అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ మహేంద్రహిల్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత అన్నారు. ఈనెల 21 నుండి 23 వరకు వరంగల్ హనుమకొండలో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలో టీఎస్‌డబ్ల్యూఆర్ డీసీ మహేంద్రహిల్స్ గురుకుల క్రీడా అకాడమీ బాలికలు అత్యంత ప్రతిభ కనబరిచారు. బి.కావ్య, ఎం.త్రివేణి, బి.మీనాక్షి, బి.నందిని జాతీయ స్థాయిలో నిర్వహించే అల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19, 20 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో రాష్ట్ర స్థాయి జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన ఎస్.బుచ్చమ్మ (షాట్ పుట్, డిస్కస్ త్రో), ఎం.మనిషా (4-100మీటర్ రీలే ల) లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు వచ్చేనెల 17,18,19 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన బాలికలను ప్రిన్సిపాల్, కళాశాల ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప, విజయ లక్ష్మీ, డాక్టర్ పద్మజ, డాక్టర్ అనురాధ, డాక్టర్ రామ లక్ష్మణ్, హ్యాండ్ బాల్ కోచ్ పద్మిని గుప్తా, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సీపీఐ(ఎం)ను విస్తరించాలి

- ఘట్కేసర్‌లో వాకింగ్ పార్క్‌ను నిర్మించాలి
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్. సబిత

నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రజా ఉద్యమాలతోనే సీపీఐ(ఎం)ను విస్తరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్. సబిత పిలుపునిచ్చారు. బుధవారం ఘట్కేసర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గ్రామ ఒకటో శాఖ మహాసభ నిర్వహించారు. సభ ప్రారంభానికి సీపీఐ(ఎం) జెండాను శాఖ కార్యదర్శి కళ్లెం శ్రీకాంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ఎన్. సబిత హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడానికి పూనుకుందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మతతత్వ విధానాలను రెచ్చగొడుతూ మతోన్మాద రాజకీయాలను చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా జమిలి ఎన్నికలకు పూనుకుంటుందని విమర్శించారు. ఆ ఆలోచనలు మానుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు 300 రోజులు గడుస్తున్నా మూడు గ్యారెంటీలు కూడా అమలు చేయలేకపోయారని విమర్శించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ నేటికీ పూర్తి చేయలేకపోయిందన్నారు. అనేకమంది రైతులు రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు.



అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. పదేండ్లుగా కొత్త రేషన్ కార్డు లేక, పెన్షన్లు, ఇండ్లు లేక అనేక మంది ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కమ్యూనిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్రంలోని బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అనేకమంది ఉద్యోగులు మధ్యతరగతి వర్గం పెరిగిందని వాకింగ్ ట్రాక్ పార్క్ నిర్మాణం చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) ఒకటో శాఖ కార్యదర్శిగా తిరిగి శ్రీకాంత్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కడమంచి యాదగిరి, రమేష్, చంద్రమోహన్, ఇనాయత్ ఖాన్, పరమేష్, నాగమణి, పోచయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్

వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ పట్టణ ప్రాంత పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గృహకల్ప కాలనీలోని 1,2,3వ వార్డుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం స్థలంలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. నాసిన్ చెరువులో వినాయకుడి నిమజ్జనం వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నాగమణి, స్థానిక కౌన్సిలర్స్ నాను నాయక్, నాగాయిపల్లి సుజాత, ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళా సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌహతి మున్సిపల్ కార్పొరేషన్ సందర్శన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీహెచ్ఎంసీ స్టడీ టూర్‌లో భాగంగా అస్సాంలోని గౌహతి మున్సిపల్ కార్పొరేషన్‌ను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, ఇతర కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించి, అక్కడి అభివృద్ధి, వాటి వివరాలను తెలుసుకున్నారు.

ఘనపూర్ పాఠశాలలో నీటి సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఘనపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా పాఠశాల ఆవరణలో ఉన్న బోరు గత రెండు నెలలుగా పనిచేయకపోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎం చంద్రకళ బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలోని విద్యార్థుల కోసం తక్షణమే గ్రామపంచాయతీ అధికారులు బోరుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా చేయాలని గ్రామ యువ నాయకుడు మేకల విజయ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి సైతం నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని కృప కాంప్లెక్స్, మా ఫర్నిచర్ వద్ద బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మిలు ప్రారంభించారు. ఈ వారు మాట్లాడుతూ వినాయక్ నగర్ డివిజన్‌లో సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.



ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు గౌహతి డిప్యూటీ కమిషనర్ సన్మానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీహెచ్ఎంసీ స్టడీ టూర్‌లో భాగంగా అస్సాం రాష్ట్రం గౌహతి నగరంలోని మున్సిపల్ కార్యాలయాన్ని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి ఉపేందర్ రెడ్డిలు తోటి కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు అక్కడ వాళ్ళు చేసే ప్రక్రియ, అక్కడి అభివృద్ధిని తెలుసుకున్నారు. అనంతరం గౌహతి డిప్యూటీ కమిషనర్ కార్పొరేటర్‌లను సన్మానించారు.

మాల మహానాడు సంఘం

మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా గుజ్జుక పరుశురాం



నవతెలంగాణ-కీసర

మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా గుజ్జుక పరుశురాం నియామకం అయ్యారు. హైదరాబాద్‌లోని బోరబండలో ఉన్న సెంటర్ ఫర్ దళిత భవనంలో మంగళవారం నిర్వహించిన జాతీయ మాల మహానాడు సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సంఘం కన్వీనర్‌గా గుజ్జుక పరుశురాంను నియమిస్తూ నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుజ్జుక పరుశురాం మాట్లా డుతూ.. మాల సంఘం భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమా లలో పాల్గొంటూ, జాతి ఐక్యతకు పాటుపడతానని, అంబేద్కర్ ఆశయ సాధనలో ముందుండి దళితుల అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. జిల్లా కన్వీనర్‌గా నియమించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్ రావు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ ఉద్దండపురం సత్యనారాయణ, రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మెన్ రాకం శ్రీరాములు, రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

- వీఎస్ఎస్ఏ ప్రాజెక్టు మేనేజర్ రాఘవ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వీఎస్ఎస్ఏ ప్రాజెక్టు మేనేజర్ రాఘవ అన్నారు. ఎన్ఏసీపీవీలో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీజీఎస్ఏసీఎస్) దిశా ఆదేశాల మేరకు వీఎస్ఎస్ఏ సంస్థ ఆధ్వర్యంలో రాజధాని మోడల్ హై స్కూల్‌లో 8,9,10వ తరగతి విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ఎస్ఏ ప్రాజెక్టు మేనేజర్ రాఘవ మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ, లైంగిక వ్యాధులపై అవగాహన కల్పించారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజంగా తీర్చి దిద్దలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. ఎయిడ్స్‌పై ప్రతి విద్యార్థి ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో కొంతమంది ప్రాణాలను కాపాడిన వారమవుతామని, తల్లి గర్భం నుండి జన్మించే చిన్నారులకు కూడా వదలని వ్యాధి తెలిపారు. నూతన సమాజాన్ని నిర్మించాలంటే ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి అయిందన్నారు. ఎయిడ్స్‌కు రిలేటివ్ పరీక్షలకు 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయించాలని తెలిపారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. హెచ్ఐవీ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. వీఎస్ఎస్ఏ పీఎం రాఘవ, కిరణ్, కౌన్సిలర్ రేణుక, ఓఆర్‌డబ్ల్యూ కైలాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ

రామచంద్రరావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని దీనదయాళ్ సేవా కేంద్ర ఆధ్వర్యంలో వినాయక్ నగర్ డివిజన్ దీన్ దయాళ్ నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు, స్థానిక కార్పొరేటర్ క్యానం రాజలక్ష్మిలు హాజరై దీన్ దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశసేవనే జీవిత పరమావధిగా భావించిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో దీనదయాళ్ సేవా కేంద్ర వ్యవస్థాపకులు థియోయిరెడ్డి సోమిరెడ్డి, అధ్యక్షులు జూలూరి శ్రీనివాస్, కార్యదర్శులు సూర్యనారాయణ మూర్తి, కోశాధికారి రామకృష్ణ, సంఘ పెద్దలు రవీంద్రనాథ్, వాసు జి, జగదీష్, ఇతర కార్యకర్తలు, బీజేపీ వినాయకనగర్ అధ్యక్షులు ఓం ప్రకాష్, సీనియర్ నాయకులు డిఆర్ నరసింహ గౌడ్, ఆనంద్ గౌలీకర్, నవీన్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, సాయి సురేష్ జ్యోతిర్మయి, సుమలత, గోపాల్, జగదీష్ చారి, వెంకటేష్, కాలనీ వాసులు గడప నరసింగ్ రావు, ఉపేంద్ర, జగదీష్, తదితరీలు పాల్గొన్నారు.

దీన్ దయాల్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలి



దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం ఆనంద్‌బాగ్ ఆర్‌కే నగర్‌లో మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కార్యాలయంలో బీజేపీ నాయకులు రాంబాబు ఆధ్వర్యంలో దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభుగుప్తా, మాజీ కౌన్సిలర్ ఆనంద్, సునీల్ యాదవ్, రవి, వెంకటేష్, ముబ్బు లక్ష్మయ్య, సాయి పటేల్, వేణు యాదవ్, పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రైలపూర్, శ్రీరంగవరం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి అర్చన ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి కాండంకు, కుళ్ళు తెగులు కనిపిస్తే ఎక్సోకోనజల్ 2.0 మిల్లీలీటర్లు, ప్రాపి కొనోజోల్1.0 మిల్లీలీటర్లు నీటిని కలిపి పిచికారి చేయాలని సూచించారు. మెడవిరుపు తెగుళ్లకు కానుగమైసిన్ 2.5 మిల్లీలీటర్లు, అగ్గి తెగులుకు ట్రై సైక్లోజోల్‌పీకాక్సి స్ట్రోబిన్ 400 మిల్లీమీటర్లు కలిపి ఒక ఎకరానికి కలిపి పిచికారి చేయాలన్నారు. కాటుక తెగులుకు ప్రాపి కొనోజోల్ 1మిల్లీలీటర్, కార్బండ జిమ్ 50శాతం ఒక గ్రామ్ వెన్నులు పైకి వచ్చు దశలో ఒక్కసారి వారం రోజుల తర్వాత ఒకసారి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏ ఈవో తేజస్విని, సుమీత, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

బీసీ హక్కుల కోసం కృషి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీసీ హక్కుల కోసం తమ వంతు కృషి చేస్తామని టీపీసీసీ లేబర్ సెల్ చైర్మెన్, ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ నాయకులు, ఐఎన్‌టీయూసీ సీనియర్ సెక్రటరీ అన్నారు. ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యని కలిశారు. వెనుకబడిన తరగతుల (బీ.సి) హక్కుల కోసం తమ వంతు పోరాడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు కూన రవీందర్ గౌడ్, సప్పిడి భాస్కర్, కూన భరత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, పృథ్వి గౌడ్ ఉన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు.. కూకట్‌పల్లి కోర్ట్ కాంప్లెక్స్‌లో ఈనెల 28 వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో నిర్వహించడం జరుగుతుందని మండల లీగల్ సర్వీస్ సంస్థ న్యాయ అధికారి మూడవ అదనపు జిల్లా జడ్జి బి. తిరుపతి తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ లో 12 బెంచీలను ఏర్పాటు చేయడమైనదని.. కోర్టు పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులలో, భార్యాభర్తల తగాదాలు, 498 ఏ, డీవీసీ, మనీ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు. ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి కేసులు రాజీమార్గాలలో పరిష్కరించుకోవలసినదిగా తెలియజేశారు.

ఇదెక్కడి అన్యాయం..
అధికారులు పనిచెయ్యరు, ప్రజలు చేస్తే కూల్చేస్తారు





- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పేద ప్రజల నివాస ప్రాంతాల్లో అధికారుల పనితీరు ఆయారాం... ప్రజాప్రతినిధుల పనితీరు గాయారామ్.. అన్నచందంగా మారింది. అధికారులు పనిచేయరు.. ప్రజలు చేపిస్తే వాటిని కూల్చివేయడం ఎంతవరకు సమంజసం అని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఈ.ఉమామహేష్ విమర్శించారు. బుధవారం గాజులరామారం డివిజన్, రావినారాయణ రెడ్డి నగర్ ప్రాంతంలో సీపీఐ శ్రేణులు, స్థానిక బస్తీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల కురిసిన కుండతెరిపి వర్షాలకు అక్కడి చెరువులు,క్వారీలు కబ్జాలకు గురికావడం వల్ల నీరు రోడ్లపై చేరడమే కాకుండా.. లోతుగా ఉన్న గల్లీలో నేటికీ వరదలా ప్రవహిస్తుండటంతో రోడ్డుపై (పాకూరు)నాచు చేరి అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు అధిక స్పీడుతో వెళ్లడంతో స్తంభించిన వర్షపునీరు పాదాచారుల పై పడటంతో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయని అన్నారు. సంబంధిత అధికారుల ప్రజాప్రతినిదుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడంతో ప్రజలే నీరు వెళ్లడానికి కొద్దిగా మరమత్తులు చేసుకున్నారన్నారు. దాన్ని కాస్త మున్సిపల్ సిబ్బంది కులగొట్టడం, ఏఈ.ని అడిగితే మాకు తెలియకుండా జరిగిందని అనడం హాస్యాస్పదమ ని అన్నారు.

గత నెలలో గాజులరామారం డిప్యూటీ కమీషనర్ మల్లారెడ్డి సమస్యను చూసి పరిష్కరిస్తామని చెప్పి ఇంతవరకు పరిష్కరించ లేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. చిన్న సమస్యను పరిష్కరించడానికి ఎన్ని నెలలు కావాలని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల మధ్య గొడవలకు దారితిస్తుందని ఎద్దేవా చేశారు. అధికారుల పని తిరు ఈ ప్రభుత్వంపై, ప్రజల్లో వ్యతిరేకత తీసుకువస్తుందన్నారు. ఇలాంటి అధికారులను ప్రభుత్వం గుర్తించి నిరంతరం నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య గూర్చి డీసీ మల్లారెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఫోన్ లిఫ్ట్ చెయ్యట్లేదని, అలాంటి అధికారి ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని అన్నారు. ఇప్పటికైనా పరిష్కరించక పోతే ప్రజలతో సర్కిల్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానికులే మళ్ళీ రోడ్డును శుభ్రం చేసుకొని నీటిని మళ్లించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు శ్రీనివాస్, శ్రీహరి, స్వామి, వరలక్ష్మి, మాధవి, పమీల, శోభ, మిన్నె తదితరులు పాల్గొన్నారు.

27న విద్యార్థి మహాగర్జన

- విద్యా రంగ సమస్యల పరిష్కారం, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరాటం
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యా రంగ సమస్యల పరిష్కారం, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఈ నెల 27వ తేదీన(రేపు) విద్యార్థి మహాగర్జన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరేండ్లుగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత ప్రయివేటు యాజమాన్యాలు ట్యూషన్ ఫీజులు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. సర్టిఫికెట్లు జారీ చేయకుండా మొండికేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9నెలలు అవుతున్నా విద్యారంగం సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రం, జిల్లా విద్యారంగాన్ని పర్యవేక్షించేందుకు కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేరన్నారు. సంక్షేమ వసతి గహాలు, గురుకులాలను సమస్యలు వెంటాడుతున్నాయని తెలిపారు. గురుకులాలు, జనరల్ వసతి గహాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు, జనరల్ వసతి గహాల అద్దెలను నేరుగా భవన ఓనర్‌కే చెల్లించడంతో భవనాలకు కనీసం మైనర్ రిపేర్లు చేయించడానికి కూడా నిధులు ఉండటం లేదన్నారు. అద్దె భవనాల్లో తాగునీరు, టాయిలెట్స్, శిథిలావస్థకు చేరిన పైకప్పులు వంటి తీవ్రమైన సమస్యలు వేధిస్తున్నాయని చెప్పారు. పెరిగిన నిత్యవసరాల ధరల కారణంగా చాలీచాలని మెస్ ఛార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కావడం లేదన్నారు. ప్రభుత్వం చెల్లించే మెస్ ఛార్జీలు ఎటూ సరిపడక, వసతి గహాల్లో విద్యార్థులకు అందించే నాసిరకం భోజనంతో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు రాష్ట్రంలో పదే పదే పునరావతవుతున్నాయని తెలిపారు. చాలీచాలని ముద్దగట్టిన అన్నం, నాసిరకం కూరలు, నీళ్ల చారు, నీళ్ల మజ్జిగ పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న విద్యార్థి మహా గర్జనకు జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కార్యదర్శి టి.అరుణ్, పృథ్వీ, థామస్, పండు, శ్యామ్‌రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి



- మాజీ చైర్మెన్ మద్దెల సత్యనారాయణ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని జరుగుతున్న నిత్య పూలమాల కార్యక్రమం 38వ రోజుకు చేరుకున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దళిత సంఘాల ఐక్యవేదిక మాజీ చైర్మెన్ మద్దెల సత్యనారాయణ చేతుల మీదుగా బుధవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా విచ్చేసిన మద్దెల సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కోసం ప్రత్యేకంగా పోరాటం చేయాల్సిన అవసరం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే స్పందించి, భారత రాజ్యాంగం పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే అకాడమీ సంవత్సరంలో భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చని పక్షంలో ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో.. పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దెలసత్యనారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహకుడు మంచింటి అంజన్న, డబ్బా నరసింహన్న, జి.జె. రత్నం భగత్ సింగ్ నగర్ అశోక్, మిత్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపల్ పరిధిలోని దుండిగల్ మున్సిపల్ పరిధిలో "స్వచ్చత హి సేవ 2024" కార్యక్రమంలో భాగంగా స్కూల్స్, కాలేజీల వద్ద విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ రావు కాలేజీ విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించినారు. ముఖ్యంగా "స్వచ్చత హి సేవ" స్వచ్ఛ తెలంగాణ స్వచ్ఛ దుండిగల్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ బ్యాన్, వాటి వలన పర్యావరణానికి జరుగుతున్న నష్టం, సోర్స్ సెగ్రికేషన్ ఇంటింటిలోనే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి తడి చెత్తని కాంపోస్టుగా తయారు చేయటం, ఎన్విరాన్మెంటుకు హానికరం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన, పోటీలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా అన్ని వార్డులలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణ రావు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు

- ఈ నెల 25 నుంచి అక్టోబర్ 1వరకు నిర్వహణ
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అక్టోబర్ 1వ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ ఆధికారి ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కృష్ణారెడ్డి అధ్యక్షత వయోవద్ధుల దినోత్సవ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజెన్స్‌తో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 26న వద్ధాశ్రమాల్లోని వయోద్ధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహనా సదస్సు, 29న సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం 2007పై అవగాహన, ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 పై అవగాహనా సదస్సు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, అక్టోబర్ 1వ తేదీన జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయకుమారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి,

జిల్లా గ్రామీణ ఆబివద్ధిశాఖ ఆధికారి సాంబశివరావు, జిల్లా పౌర సరపరాల ఆధికారి, జిల్లాలోని ఉన్న సీడీపీఓలు, జిల్లా వయోవద్ధుల కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, కమిటీ మెంబర్స్, ఇతర వయోవద్ధులు, జిల్లాలోని ఓల్డ్ ఏజ్ హోమ్స్ నిర్వహకులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వృద్ధుడు అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాపిరెడ్డినగర్ రోడ్ నెంబర్.11(దేవమ్మ బస్తీ) ప్రాంతానికి చెందిన కొండాడి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బయటికి వెళుతున్నాను చెప్పి తన స్కూటీ టీఎస్ 08 JQ 4874 వాహనంపై వెళ్ళాడని కుటుంబ సభ్యులు తెలిపారు.అతని వద్ద ఫోన్ లేదని పరిసర ప్రాంతాల్లో బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ తెలవకపోవడంతో.. కుమారుడు కే.శేఖర్ రావు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో
ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలు..



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిదిలోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం 2024 ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరానికి సంబంధించిన థీమ్ "ఫార్మసిస్ట్: ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడం" ఆధారంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకలో భాగంగా నిర్వహించిన ముఖ్యమైన కార్యక్రమాలు..

గెస్టు లెక్చర్ " రైజ్ ఎబొవ్ ఆడిక్షన్ " అనే అంశంపై ప్రత్యేక వక్త ద్వారా విలువైన సమాచారాన్ని అందించారు. అలాగే వ్యాసరచన పోటీలు క్రింది అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యాసరచన రూపంలో ప్రదర్శించారు. ప్రధానంగ జనరిక్ మందులపై అవగాహన, క్లినికల్ ఫార్మసిస్ట్ రోగి సలహాలు రైజ్ ఏబోవ్ అడిక్షణ్ ప్రస్తుత ఉత్తమ తయారీ ప్రక్రియలు (కరెంట్ గుడ్ మణ్యుక్చరింగ్ ప్రాక్టిసెస్) చార్ట్ ప్రిపరేషన్ పై పేర్కొన్న అన్ని అంశాలపై విద్యార్థులు చార్ట్‌లను తయారు చేసి ప్రదర్శించారు.

నాటిక పోటీ: పై అంశాల ఆధారంగా విద్యార్థులు నాటికలను ప్రదర్శించి తమ ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చారు. అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (ఎఫ్ఐపీ) ప్రకటించిన ఈ సంవత్సరం థీమ్ "ఫార్మసిస్ట్: ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడం" ను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.అర్జబ్ మాలిక్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు ప్రజారోగ్య సంరక్షణలో అందిస్తున్న సేవలు, వారి పాత్రకు సంబంధించిన అవగాహనను పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఫార్మసీ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ఈ దినోత్సవం గొప్ప పాత్ర పోషిస్తుందని తెలియజేశారు.

మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, చేంజింగ్ టైమ్స్‌కి అనుగుణంగా నాణ్యమైన ఫార్మసీ విద్యను అందిస్తూ... ఫార్మసీ రంగంలో నైపుణ్యాలు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలోవాలిడేషన్ హెడ్ డాక్టర్ ప్రవీణ్ నాయక్, డాక్టర్ మోనికా అసిస్టెంట్ ప్రొఫెసర్, అరుంధతి ఆస్పత్రి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

సీపీఐ(ఎం) శాఖ మహాసభలు

- జెండా ఆవిష్కరించిన మండల కార్యదర్శి ఎం.శంకర్
- ఏకగ్రీవంగా శాఖ కార్యదర్శిగా కృష్ణా నాయక్ ఎన్నిక



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో సీపీఐ(ఎం) శాఖ మహాసభ కూకట్‌పల్లి మండలోని శ్రీశ్రీ నగర్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నూతన శాఖ కార్యదర్శిగా కె.కృష్ణా నాయక్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సీపీఐ(ఎం) జెండాను మండల కార్యదర్శి ఎం.శంకర్ ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిం చి అనంతరం మహాసభ ప్రారంభించారు. సభాధ్యక్షులు గా కె.శ్రీను వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గత మూడు సంవత్సరాల ప్రణాళిక ను ఉద్దేశించి కార్యక్రమాల రిపోర్టింగ్ కృష్ణా నాయక్ ప్రవేశపెట్టారు. రిపోర్టింగ్ కూడా శాఖలో ఏకగ్రీవంగా ఆమోదించబడిందని, సమీక్ష భవిష్యత్తు కర్తవ్యాలను సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కార్యదర్శి ఎం.శంక ర్, మండల నాయకులు కృష్ణా నాయకులు మాట్లాడు తూ.. ఉమ్మడిగా పని సమిష్టి కృషితో పార్టీ ఆశయాలకు అనుగుణంగా సీతారాం ఏచూరి బాటలో నడవాలని వారు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన గళమెత్తాలని కోరారు. పార్టీ విస్తరించడానికి పలు అంశాలపై కృషి చేయవలసి ఉంద`ని, భవిష్యత్తు కాలంలో అన్ని బస్తీలలో పార్టీని విస్తరింప చేయాలని ఈ విషయంలో అందరూ భాగస్వాములు అవ్వాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష ప్రభుత్వా లు ఏర్పడుతున్నాయని, అందులో భాగంగానే శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించిందని వారికి జేజేలు పలికారు. ఉద్యమాల పోరాటాలతోనే పార్టీ విస్తరణ జరుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందని భారతదేశంలో లౌకిక ప్రజా స్వామ్య రాజ్యాంగ పరిరక్షణను కాపాడాలని బీజేపీ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ధర్మారావు, శాఖ సభ్యులు, శివకుమార్, చిరంజీవి, బాలు, భాష పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడి సీపీఐ(ఎం) బలోపేతం చేయాలి : సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం.శంకర్

కూకట్‌పల్లి: ప్రజా సమస్యలపై పారాడి సీపీఐ(ఎం) బలోపేతం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎం. శంకర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు, సీపీఐ(ఎం) కూకట్‌పల్లి శాఖ మహాసభ హనుమాన్ నగర్ కామ్రేడ్ నర్సమ్మ ఇంటి వద్ద, ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. ఈ మహాసభకు ముందుగా సీపీఐ(ఎం) జెండా ఆవిష్కరణ చేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులఆర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ నాయకులు కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, శాఖ కార్యదర్శి పి.ధర్మారావు, నరసమ్మ, పోలయ్య, జ్యోతి, బాలరాజ్, రంగారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ గడ్డపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విరోచితంగా ఐదు సంవత్సరాల పాటు జరిపారన్నారు. అందులో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడంతో పాటు, 3000 గ్రామసరాజ్యాలు ఏర్పాటు చేసి, దొరలను నైజాం సర్కార్ను ఎదిరించి పోరాడి, 4000 మంది అమరుల య్యారని తెలిపారు. ఈ వాస్తవాన్ని వక్రీకరిస్తూ.. బీజేపీ ఇతర పార్టీలు సెప్టెంబర్ 17న విమోచన దినమని, విద్రోహ దినమని విముక్తి దినమని రకరకాలుగా చెప్తున్నారని పేర్కొన్నారు. ఇది నిజం కాదని.. తెలంగాణ లో కమ్యూనిస్టులు అధికారంలోకి రాబోతున్నారని తెలిసి, నైజాం సర్కారు, నెహ్రూ ప్రభుత్వంతో రాజీ ఒప్పందం చేసుకొని, సెప్టెంబర్ 17,1948 లో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసిందన్నారు. ఇది హిందూ, ముస్లిం గొడవ కాదన్నారు.. అన్ని మతాలు, కులాల వారు ప్రాంతాల వారు కలిసి ఈ పోరాటం నడిపారని తెలిపారు. ఎన్నికల్లో బీజేపీకి చావు తప్పి కన్ను లొట్ట పోయిందని అన్నారు. కావున రాబోవు కాలంలో తిరిగి కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నూతన శాఖ కార్యదర్శిగా పల్లి ధర్మారావు ఎన్నికయ్యారని, మండల కార్యదర్శి ఎం.శంకర్ తెలిపారు.



పండిత్ దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగించాలి



- జాతీయ కార్యవర్గ సభ్యులు సిద్ధార్థ శుక్ల

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగించాలని జాతీయ కార్యవర్గ సభ్యులు, సభ్యత్వ నమోదు కార్యక్రమ తెలంగాణ స్టేట్ ఇన్‌చార్జి సిద్ధార్థ శుక్ల అన్నారు. భారతీయ జన సంఘ్ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలో యువమోర్చా ఆధ్వర్యంలో... ఏర్పాటుచేసిన జయంతి కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొని దీన దయాల్ చిత్రపటానికి పుష్పాలతో నమస్సుమాంజలులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వదేశీయ భావనలతో స్వావలంబన దిశగా సాగడమే నిజమైన అభివృద్ధి అని సూచించిన మార్గదర్శి దీన్ దయాళ్ అని అన్నారు. ఏకాత్మతా మానవతా వాదాన్ని ప్రబోధించిన గొప్ప మానవతావాది, మనిషి మనిషిగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేసిన సంఘసంస్కర్త అన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్తీలలో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-బేగంపేట

మోండా డివిజన్ పరిధిలోని ఎరుకాల బస్తీ, లక్ష్మయ్య దోడి బస్తీలలో అధికారులతో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం పర్యటించారు. విద్యుత్, తాగు నీరు, రోడ్ల సమస్యను బస్తీవాసులు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. గతంలో ఎంతో మంది నాయకులు వచ్చినప్పటికీ ఎవరూ సమస్యను తీర్చలేదని మహిళలు వాపోయారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్ యాదవ్, డి.ఈ లు ధర్మారెడ్డి, ఆంజనేయులు, డీసీ సమ్మయ్య, వాటర్ వర్క్స్ డీ.జీ.ఎం సాగర్, ఏ.ఈ హక్కిం తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం - రాజా మార్గం

- **ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు**

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

ఈ నెల 28న శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగించుకుని పంతాలు పట్టింపులకు పోకుండా భవిష్యత్‌ను దష్టిలో పెట్టుకొని, అవసరం కొద్దో, ఆవేశం కొద్దో పెట్టుకున్న కేసులను రాజీ చేసుకోవాలని ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు కోరారు. ఈ అదాలత్ లో పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్య-భర్తల పంచాయితీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎక్కువ పెండింగ్ చలాన్లు ఉన్న కేసులు, కొట్లాటలు, రోడ్డు ప్రమాదం కేసులు, పేకాట, ఎక్సైజ్ కేసులు, దొంగతనం కేసులు కూడా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు అన్నారు. పంతాలకు పోకుండా మానసిక ప్రశాంతత కోసం రాజీ మార్గం ఉత్తమమైనదన్నారు. ఇట్టి లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం ఏవైనా సందేహాలు ఉంటే తనను కానీ, ఎస్సార్‌నగర్‌పోలీస్ స్టేషన్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగాన్ని కానీ కలవవచ్చు అన్నారు. పాత కేసులను రాజీ చేసుకొని ఇరువర్గాల వారు మీ సమయం- డబ్బు ఆదా చేసుకోవాలని, అందుకు పోలీసు వారి సహాయ సహకారాలు తీసుకోవాలని కోరారు.

నిజాం కాలేజీకి గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

- **అవార్డు స్వీకరించిన ప్రిన్సిపాల్ ప్రొ.భీమా**



నవతెలంగాణ-ఓయూ

చారిత్రక నిజాం కాలేజీకి గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. విద్యలో ఉన్నత ప్రమాణాలు కలిగి ఉంటూ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌కు సంబంధించి జాతీయ స్థాయిలో 101-150 బ్యాండ్ విడ్త్ ను నిజాం కళాశాల సాధించింది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఆఫ్ విండ్ సర్ (కెనడా) గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్ ఫోరం వారు కలిసి సంయుక్తంగా నిజాం కళాశాలను గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు కు ఎంపిక చేశారు. నగరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ చేతుల మీదుగా నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.బీమా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి పాల్గొన్నారు. అవార్డు సాధించినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.బీమా మాట్లాడుతూ. తమ కళాశాలలో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితమే ఉన్నత విద్యా ప్రమాణాలు సాధించామని తెలిపారు. దీన్ని గుర్తించి నిజాం కళాశాలకు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ను అందించడం పట్ల యూనివర్సిటీ ఆఫ్ విండ్ సర్ (కెనడా) గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్ ఫోరం సంస్థలకు ప్రొఫెసర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యా, పరిశోధనలతో పాటు వివిధ జాతీయస్థాయి అంతరాతీయ సంస్థలతో కలిసి మరింత ముందుకు సాగుతూ అకాడమిక్ ఎక్సలెన్సును మరింత ఉన్నత ర్యాంకుల దిశగా తీసుకుపోతామని తెలియజేశారు.

ప్రముఖ ఆస్పత్రి యజమానులపై ఫోర్జరీ కేసు

- **నర్సింగ్‌హోంలో డెలివరీలు, ప్రముఖ ఆస్పత్రిలో ధ్రువీకరణ పత్రాలు**
- **నకిలీ పత్రాలతో బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు**
- **సమగ్ర విచారణకు హైదరాబాద్ సీసీఎస్‌కు కేసు బదిలీ**



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల యాజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణకు హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఓ ఘటనలో రెండో భార్య పిల్లలను మొదటి భార్య పిల్లలుగా చిత్రీకరించడంతోపాటు ఆమె వివరాలను రికార్డుల్లో లేకుండా చేశారు. బాధితురాలికి తెలియకుండానే ఆమె పెద్ద కుమార్తెను మరో ఆస్పత్రి ఎండీకి ఇవ్వడంపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అస్సలు విషయం వెలుగు చూసింది.

విశాఖపట్నానికి చెందిన కృష్ణవేణి బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వలసవచ్చింది. 2003లో నాంపల్లిలోని మెడ్విన్ ఆస్పత్రిలో కృష్ణవేణి పని చేస్తుండగా కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్‌గా ఉన్న బొల్లినేని కృష్ణయ్యతో పరిచయమైంది. తన భార్యతో సరైన సంబంధాలు లేవని, ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ కృష్ణవేణిని నమ్మించిన కృష్ణయ్య 2004 ఫిబ్రవరిలో రెండో వివాహం చేసుకున్నారు. వైజాగ్‌లోని గోపాలపట్నంలో పెండ్లి చేసుకున్న ఇరువురూ అప్పట్లో బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని అపూర్వ టవర్స్‌లో కాపురం పెట్టారు. కొన్ని రోజులు ఓపిక పట్టాలని, ఆ తర్వాత ఇంటికి తీసుకువెళ్లడంతో పాటు బంధువులకూ భార్యగా పరిచయం చేస్తానంటూ కృష్ణయ్య నమ్మబలికారు. వీరికి 2004 ఆగస్టు 31న సోమాజీగూడలోని స్వప్న నర్సింగ్ హోమ్‌లో కుమారుడు అర్జున్ జన్మించాడు. కృష్ణయ్య, కృష్ణవేణి తల్లిదండ్రులుగా బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారు. 2006లో అనారోగ్య కారణాలు చెప్పిన కృష్ణయ్య తన కుమారుడు అర్జున్‌ను తనతో పాటు తీసుకు వెళ్లారు. 2006 జూలై 29న అదే నర్సింగ్ హోమ్‌లో కృష్ణవేణి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈమెకు కృష్ణ వైష్ణవి అని పేరు పెట్టిన కృష్ణయ్య రెండేండ్ల తర్వాత వివిధ కారణాలు చెప్పి తనతో తీసుకెళ్లిపోయాడు. బొల్లినేని కష్ణయ్య, కష్ణవేణిలకు 2011 మే 27న స్వప్న నర్సింగ్ హోమ్‌లోనే మరో ఆడపిల్ల శ్రీనిక పుట్టింది. ఆ తర్వాత నుంచి కృష్ణయ్య రెండో భార్య కష్ణవేణి వద్దకు రావడం మానేశాడు. కుమారుడు, మొదటి కుమార్తె వివరాలను కూడా రెండో భార్యకు తెలియనీయలేదు. ప్రతి చిన్న విషయానికి కృష్ణవేణిని అనుమానిస్తూ వేధించడం ప్రారంభించాడు. కృష్ణవేణి ఎన్నిసార్లు కోరినా అర్జున్, వైష్ణవిలను చూపించడానికి సుముఖత చూపని కృష్ణయ్య వాళ్లు తన సంరక్షణలో, క్షేమంగా ఉన్నారని చెప్తూ వచ్చాడు. సరైన సమయం వచ్చినప్పుడు వాళ్లను చూపించడంతో పాటు బంధువులకూ పరిచయం చేస్తానంటూ కృష్ణవేణిని మభ్యపెట్టాడు. ప్రతి నెలా కృష్ణవేణికి నిర్ణీత మొత్తం చెల్లిస్తూ వచ్చాడు. 2016లో ఆమెను కృష్ణయ్య అపూర్వ టవర్స్ నుంచి ఖాజాగూడలో ఉన్న తన విల్లాలోకి మార్చాడు. తనతో పాటు తన పిల్లల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇవ్వాలంటూ కృష్ణవేణి పదేపదే కృష్ణయ్యను కోరింది. కుమారుడు, పెద్ద కుమార్తె క్షేమంగానే ఉన్నారని చెప్పిన ఆయన వీళ్లు నివసిస్తున్న విల్లాను మాత్రం శ్రీనిక పేరుతో బదిలీ చేశాడు. ఆ తర్వాత నుంచి కృష్ణవేణిని పట్టించుకోవడం పూర్తిగా మానేశాడు. తన కుమారుడిని కలవడానికి అనేక ప్రయత్నాలు చేసిన కృష్ణవేణి ఎట్టకేలకు 2021లో కలవగలిగారు. ఆమె తన తల్లి అని తెలుసుకున్న అర్జున్ షాక్ అవడంతో పాటు తండ్రి కృష్ణయ్య తన మొదటి భార్యనే తన తల్లిగా నమ్మించినట్టు కష్ణవేణికి చెప్పాడు. ఈమె అర్జున్‌ను కలుస్తున్న విషయం తెలుసుకున్న కృష్ణయ్య తక్షణం మానుకోవాలని, లేదంటే నెల నెలా ఇచ్చే మొత్తమూ ఇవ్వనని బెదిరించాడు.

బీబీఏ చదవడం కోసం 2022లో విదేశాలకు వెళ్లిన అర్జున్ ఇక్కడికి వచ్చిన సమయంలో తన తల్లిని కలిసేవాడు. ఓ సందర్భంలో వైష్ణవి తన సోదరి అని తల్లి కృష్ణవేణి ద్వారా తెలుసుకున్నాడు. అయితే ఆమెను కృష్ణయ్య తన సమీప బంధువులు, లోటస్ హాస్పిటల్ ఎండీలుగా ఉన్న భార్యభర్తలకు ఇచ్చినట్టు వారి కుమార్తెగానే ఆమె పెరుగుతున్నట్టు చెప్పాడు. ఆమెకు సంబంధించి కొన్ని నకిలీ పత్రాలు సష్టించి, ధ్రువీకరణలు పొందినట్టు కృష్ణవేణి గుర్తించింది. తన బిడ్డను ఇతరులకు ఎందుకిచ్చాడని ఆరాతీయ్యగా అస్సలు విషయం తెలిసింది. ఆస్తిపాస్తులు తనకు, తన రెండో కుమార్తెకు దక్కకుండా చేయడానికి కృష్ణయ్య కుట్ర పన్నుతున్నాడని తెలుసుకుంది. దీంతో ఆమె తనను భార్యగా అందరికీ పరిచయం చేయా లంటూ కృష్ణయ్యపై ఒత్తిడి చేస్తుండటంతో పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు. తమ రెండో కుమార్తె పాస్‌పోర్టు దరఖాస్తుపై సంతకం చేయమన్నా, చాలాకాలం తర్వాత చేసి, డ్రైవర్‌కు ఇచ్చి పంపారు. తమ సంతానమైన అర్జున్, వైష్ణవిలకు సంబంధించి కృష్ణయ్య తదితరులు నకిలీ పత్రాలు సష్టించాడని కృష్ణవేణి గుర్తించింది. వీటి ఆధారంగానే జీహెచ్‌ఎంసీ నుంచి బర్త్ సర్టిఫికెట్లు, రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి పాస్‌పోర్టులు పొందినట్లు తెలుసు కుంది. ఈ ఆధారాలన్నీ పొందుపరుస్తూ రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎన్నో అడ్డంకులు ఎదురు కావడంతో సుదీర్ఘ పోరాటం తరవాత కేసు నమోదైంది. ఈ కేసు కొట్టేయాలంటూ కృష్ణయ్య కోర్టుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. తొలుత కేవలం చీటింగ్, ఆపై అదనపు ఆధారా లతో ఫోర్జరీ కేసుగా మారింది. ప్రాథమిక దర్యాప్తు నేపథ్యంలో ఈ నేరం మొత్తం హైదరాబాద్ కేంద్రంగా జరిగినట్టు తేలింది. దీంతో సైబరాబాద్ అధికారులు కేసును సీసీఎస్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఫైల్‌ను నగరానికి పంపగా, బుధవారం అందుకున్న సీసీఎస్ పోలీసులు కేసును రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు చేపట్టారు.



డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు

- **28,29 తేదీల్లో తల్లిపాలపై ప్రాముఖ్యతపై సదస్సు**
- **జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు డాక్టర్ కె.సంతోష్ కుమార్**

నవతెలంగాణ - బంజారా హిల్స్

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈనెల 28, 29 తేదీలలో నగరంలో అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు డాక్టర్ కె,సంతోష్ కుమార్ తెలిపారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ దుర్గ భవాని,నితాష బగ్గా తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులో భాగంగా 28న నగరంలోని నీలోఫర్ ఆస్పత్రితో పాటు నగరంలోని మరో ఏడు ఆస్పత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 29న అమీర్‌పేటలోని మ్యారిగోల్డ్ హెూటల్లో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా జాతీయ మెడికల్ కమిషన్ చైర్మెన్ పద్మశ్రీ డాక్టర్ బి.ఎన్ గంగాధర్,లాక్టేషన్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సుష్మ మల్లిక్, డాక్టర్ జలాలెమ్ బిర్హానులు హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సదస్సులో సుమారు 1000 మందికి పైన వైద్యులు పాల్గొంటారని చెప్పారు. తల్లిపాలే చిన్నారులకు దివ్య ఔషధమని తెలిపారు.వీటి ప్రాముఖ్యత వివరించడమే లక్ష్యంగా తాము సుషేనా హెల్త్ ఫౌండేషన్, దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ భాగస్వామ్యంతో కలిసి పీడియాట్రిక్స్ అకాడమీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సౌత్ ఏషియన్ లంబ్కాన్ నాలుగవ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.



ఫర్బిషి ఇంటీరియర్ స్టూడియో, బెస్పోక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

లగ్జరీ,ఆధునికత రెండింటినీ మిళితం చేసే సరికొత్త ఇంటీరియర్ డెస్టినేషన్‌గా ఫర్బిషి(ఫీఖక్మదీక్మీూన్) తమ శాఖగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రోడ్ నెంబర్ 92 ఎమ్మెల్యే కాలనీలో వినూత్నమైన ఎక్స్‌పీరియెన్స్ కేంద్రం ప్రారంభించింది. ఫర్బిషి వ్యవస్థాపకులు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ తేజస్విని పి మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో మా భౌతిక కార్యకలాపాలు పరిచయం చేస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. మా లక్ష్యం కేవలం ఇంటి ఇంటీరియర్స్ కంటే ఎక్కువ అందించడమే. మేము మార్కెట్‌లోని అత్యుత్తమ నాణ్యత కలిగిన మెటీరియల్‌తో ఏ పరిమాణంలో ఉన్నా సరే, మీ ఇంటికి ప్రత్యేకమైన ఇంటీరియర్‌లను అందించే అనుభవాన్ని సష్టించాలనుకుం టున్నాము. బెస్పోక్ ఇంటీరియర్‌ల కోసం మేము సమగ్రమైన సేవలను అందించే సంస్థగా గుర్తించబడడంలో ఎటువంటి సందేహం లేకుండా, మేమే డిజైన్ చేసి తీర్చిదిద్దుతుంటాము" అని అన్నారు.

మాడ్యులర్ కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు, కస్టమ్ ఫర్నిచర్, సాఫ్ట్ ఫర్నిషింగ్‌లు, అనుకూలమైన రీతిలో చెక్కిన రాతి పలకలు, మరిన్నింటిని ప్రదర్శించే, ఈ ప్రత్యేకమైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ హైదరాబాద్‌లోని ఫర్బిషి మొదటి ఇంటీరియర్ స్టూడియోగా నిలుస్తుంది. స్పర్శ, అనుభూతి ప్రత్యక్ష అనుభవాన్ని ఫర్బిషి అందించటంతో పాటుగా మీ కలల గహాలను పునర్నిర్వచించటానికి, మార్కెట్ లో అనుకూల ఫినిషెస్, మెటీరియల్‌ల గురించి లోతైన అవగాహనను అందిస్తుంది. అలాగే ఈ అనుభవ కేంద్రం సజనాత్మకతను ప్రేరేపించడానికి రూపొందించారు. ఉత్పత్తుల విలాసవంతమైన నాణ్యతను "టచ్ అండ్ ఫీల్" తో ప్రత్యక్షంగా అనుభవాలు పొందడానికి వినియోగదారులకు ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుంది.

29 నుంచి రాష్ట్రపతి నిలయంలో కళా మహెూత్సవం

- **ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **పాల్గొననున్న 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 400 మంది కళాకారులు**
- **వివరాలు వెల్లడించిన రాష్ట్రపతి భవన్ ఓఎస్‌డీ స్వాతి, రిటైర్డ్ బ్రిగేడియర్ ఆర్కే సింగ్**



నవతెలంగాణ-కంటోన్మెంట్

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మొదటిసారిగా ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా భారత్ కళా మహెూత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్రపతి భవన్ ఓఎస్‌డీ స్వాతి , రిటైర్డ్ బ్రిగేడియర్ ఆర్కే సింగ్ తెలిపారు. రాష్ట్రపతి నిలయంలో ఈనెల 29 నుండి అక్టోబర్ 6 వరకు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఈనెల 28న సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 400 మంది కళాకారులు ఈ మహెూత్సవంలో పాల్గొని వారి సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని చెప్పారు. అలాగే ఆయా రాష్ట్రాలకు చెందిన 300 మంది చేతివత్తుల కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను కూడా ఈ మహెూత్సవంలో ప్రదర్శనకు ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఈశాన్యరాష్ట్రాలకు వంటకాలు, ఆహార పదార్థాలు కూడా ఇక్కడ ప్రదర్శిస్తారని చెప్పారు. సందర్శకులు కార్యక్రమాలు వీక్షించడంతోపాటు, ఆయా రాష్ట్రాల ఆహార పదార్థాల రుచులను కూడా ఆరగించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని చూడాలనుకునేవారు రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్ ద్వారా కానీ రాష్ట్రపతి నిలయం వద్ద ఉన్న కౌంటర్ వద్ద గాని వివరాలు నమోదు చేసుకొని ఉచిత ఎంట్రీ పాసులు పొందవచ్చని వివరించారు.

గువాహటి పర్యటనలో డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

జీహెచ్‌ఎంసీ అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఇతర కార్పొరేటర్లు, అధికారులతో కలిసి గువాహటి డంపింగ్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. డంప్ యార్డ్‌ను ప్రాసెస్ చేసే సంస్థ అక్కడ చెత్తను ఎలా శుద్ధి చేస్తుందో, వారు అనుసరిస్తున్న పద్ధతులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వారు ఎలా పనిచేస్తున్నారో వివరించారు. ల్యాండ్‌ఫిల్లింగ్ ని ప్రామాణిక విధానాలను అనుసరించి పూర్తి చేస్తారని, అనంతరం ఆ భూమిని చెత్త రహితంగా చేసి, గువాహటి మునిసిపల్ కార్పొరేషన్‌కు వివిధ ప్రయోజనాల కోసం అప్పగిస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ అమలు చేస్తోంది. అదనంగా, ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ గువాహటి నగరంలో సాగుతున్న అద్భుతమైన అభివద్ధి పనులను కూడా సమీక్షించారు. ఆ నగరంలో చెత్త నిర్వహణలో అవలంబిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులు, పర్యావరణానికి హాని కలిగించకుండా విధులు నిర్వహించే విధానం గురించి కూడా అవగాహన పొందారు. ఈ విధానం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా తీసుకురావడంపై చర్చ జరిగింది. తద్వారా చెత్త నిర్వహణ సమస్యలకు ఒక శాశ్వత పరిష్కారం లభించవచ్చునని భావిస్తున్నారు.గువాహటి మునిసిపల్ కార్పొరేషన్ మరియు జిగ్మా గ్లోబల్ సంస్థల మధ్య సమన్వయం ద్వారా చేపట్టబడిన ఈ ప్రాజెక్ట్, ఇతర నగరాలకు కూడా ఒక ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్‌కు ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సంబంధించిన పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లందరూ బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో కోదండరామ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బోనకుర్తి సోమేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగించారు. వేదిక పైకి డాక్టర్ జానకి రెడ్డి ఆహ్వానం తెలిపి తమ గోడును వివరించారు. వివిధ యూనివర్సిటీలకు సంబంధించిన పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎమ్మెల్సీ కోదండరాంకు తప్ప విద్యాశాఖ మంత్రిగా కొనసాగే అర్హత మరెవ్వరికీలేదన్నారు. స్కూల్ విద్యా పరిస్థితి నుంచి యూనివర్సిటీ విద్య వరకు పూర్తిగా విద్యారంగం మీద పట్టున్న సకల జనుల నేత ఎవరూ లేరని చెప్పారు. నాటి ఆంధ్ర పెత్తందారి విధానాన్ని తరిమికొట్టడంలో తెలంగాణ ప్రజలను జాగతం చేసిన వ్యక్తి అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (పార్ట్ టైం)కు సమాన పనికి సమాన వేతనంగా తీర్చిదిద్ది బాధ్యతలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మేధావి ప్రొఫెసర్ హరగోపాల్, ఓయూ యూజీసీ డీన్ ప్రొ. మల్లేశం, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రో. సుల్తానా, ఓయూ ఫిజిక్స్ డిపార్ట్మెంటు హెడ్ చింతబట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వారి మద్దతును ప్రకటించారు, ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపక సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజా సంఘాల నేతలు, ప్రసంగించి ఉత్తమ మద్దతును ప్రకటించారు.

మెడికల్ కౌన్సిలింగ్‌ను ఆపాలి

- **బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్**



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో ఉన్న మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో, నీలిమ మెడికల్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లను కల్పించే అంతవరకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మెడికల్ కౌన్సిలింగ్‌ను ఆపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ డిమాండ్ చేశారు.యూజీసీ చైర్మెన్ తెలుగు వాడు అయినా మామిడాల జగదీష్ కుమార్, కాళోజి నారాయణ యూనివర్సిటీ వీసీ కరుణాకర్ రెడ్డి ఇద్దరు కలసి కుమ్మక్కై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుదారి పట్టించి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మెడికల్ విద్యను అందకుండా మెడికల్ విద్యలో రిజర్వేషన్లు కల్పించకుండా కుట్రలు చేపడుతు న్నారని ఆరోపించారు. వారిద్దరిని తక్షణమే వారి పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.అనవసరంగా విద్యార్థులు మల్లారెడ్డి మెడికల్ డీమ్డ్ యూనివర్సిటీలో, నీలిమ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోవద్దని తీసుకుంటే అనవసరంగా నష్టపోతారని తెలిపారు. తమ సంఘం తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, అదేవిధంగా కోర్టుకు వెళ్లి మెడికల్ కౌన్సిలింగ్ ను ఆపుతామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయవలసి వస్తే ఓపెన్ కోటా నుండి మాత్రమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధనిక విద్యార్థుల పక్షాన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయాలని హైకోర్టుకు వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి పేద వర్గాలకు చెందిన ఎస్సీ ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు మల్లారెడ్డి మెడికల్ డీమ్డ్ యూనివర్సిటీలో, నీలిమ ప్రయివేటు మెడికల్ కాలేజీలో రిజర్వేషన్లను కల్పించాలని ఎందుకు హైకోర్టుకు వెళ్లలేదని ప్రశ్నించారు. తక్షణమే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమరెడ్డిని బీజేపీ నుంచి బహిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు.

సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి

- **ఆదం సంతోష్ కుమార్‌ను కోరిన సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్‌ను సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఇన్‌చార్జిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు మంచినీటి, రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ మౌలిక సదుపాయాల సమస్యలతో నిరంతరం సతమతమవు తున్నారని తెలిపారు. అదేవిధంగా నిధుల కొరతతో పెండింగ్‌లో ఉన్న అడ్డగుట్ట, లాలపెట్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లను, దుద్ బావి, సాయి నగర్ లోని డబల్ బెడ్ రూమ్ ఇండ్లను యుద్ధ ప్రతిపాదికన నిర్మాణం పూర్తి చేసి త్వరగా లబ్దిదారులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఇండ్ల కోసం ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తూ కిరాయి ఇండ్లలో ఉంటూ కిరాయిలు కట్టలేక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. పై అంశాల పైన ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సంతోష్ కుమార్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

- **ప్రొ.గాలి.వినోద్ కుమార్**



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ తీర్మానం చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ న్యాయ కళాశాల ఆవరణలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు .హైదరాబాద్‌లో సుప్రీం కోర్ట్ బెంచ్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కర్నూల్‌లో హైకోర్టు బెంచ్, అమరావతిలో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటును స్వాగతిస్తున్నానని అన్నారు.

ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోటా నీలిమా, ప్రస్తుతం అమరావతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఏఐసీసీ పరిశీలకురాలిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమరావతి పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు చురుకుగా సిద్ధమవుతోంది. బుధవారం విదర్భ ప్రాంతంలోని అమరావతిలోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ కోటా నీలిమా ఒక ఫలవంతమైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు, జిల్లా, బ్లాక్ అధ్యక్షులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, ఇతరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బేగంపేట



బతుకమ్మ పండుగ పోస్టర్ విడుదల

నవతెలంగాణ-ఓయూ



ఓయూలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ పండుగ పోస్టర్స్‌ను, లోగోను టీపీసీసీ అధికార ప్రతినిధి చేనాగని దయాకర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మేడ శ్రీను , సాయి ఓంకార్ , వినయ్ , మోహన్ , మల్లేష్ , శివ పాల్గొన్నారు.

జాషువా జయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న గుర్రం జాషువా 129వ జయంతి సభ పోస్టర్ ను బుధవారం ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీంలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యాలను అభిమానించేవారందరూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య సూర్యధనంజయ, రీసెర్చ్ స్కాలర్స్ రాజీవ్, ఉదయ్, యాదగిరి పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం 129 డివిజన్, షాపూర్ నగర్‌లోని కళావతి నగర్ వాసులు గాదె వినోద్ తల్లితండ్రుల సంవత్సరికంకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారికీ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రజాక్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అందుబాటులోకి నూతన రోబోటిక్ సర్జరీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హైదరాబాద్ సూరారంలోని మొట్టమొదటిసారి పేషెంట్లకు మెరుగైన చికిత్స కోసం రోబోటిక్ సర్జరీని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి బుధవారం అందుబాటులోకి తెచ్చింది. నటి సుజాత మాట్లాడుతూ... తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో క్రిటికల్ స్టేజ్‌లో ఉన్న పేషెంట్లకు మెరుగైన చికిత్స అందించడమే ధ్యేయంగా రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తెచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఇండోర్‌లో పరిశుభ్రతకు అమలు చేస్తున్న చర్యలు భేష్



- సెకండరీ స్టోరేజ్ బిన్‌ల వాడకంపై 18 నెలల అధ్యయనం
- విధి విధానాలను పరిశీలించిన హైదరాబాద్ మేయర్ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండోర్ నగరంలో పరిశుభ్రతకు అమలు చేస్తున్న విధి విధానాలు పరిశీలించడానికి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 40 మంది కార్పొరేటర్ల బృందంతో కలిసి ఇండోర్ నగర్ నిగమ్‌ను బుధవారం సందర్శించారు. ఇండోర్ నగర్ నిగమ్ మేయర్ పుష్యమిత్ర ఇండోర్ నగరంలో పరిశుభ్రత కోసం మేము ఇతర నగరాల నుండి బెస్ట్ ప్రాక్టీసెస్ తీసుకొని నగర పాలక సంస్థతో పాటు ప్రజలను అవగాహన కల్పించ డం, వాటిని ఆచరించి నగరాన్ని శుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇండోర్ స్మార్ట్ సిటీ అధికారులు 2015 నుండి వివిధ సామర్థ్యాల సెకండరీ స్టోరేజ్ బిన్‌లను వాడకం గురించి వారు అధ్యయనం చేయడానికి 18 నెలలు పట్టిందని, బిన్ లెస్ సిటీకి తరలించడానికి సమర్థవంతమైన ప్రణాళిక ఎలా ప్లాన్ చేశారో వివరించారు. అప్పటి స్థానిక రాజకీయ నాయకత్వం యొక్క చొరవలు, ప్రయత్నాలకు, వారి సూచనలు అనుసరించారో వివరించారు.

ప్రజలను భాగస్వామ్యంతోనే విజయం

ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలను భాగస్వామ్యం చేసి, నెమ్మదిగా వారిని నగరం యొక్క పరిశుభ్రతలో భాగస్వాములను చేశామని వివరించారు. చెత్త సేకరణలో ఆటో వ్యర్థ జనరేటర్ (గృహం) మధ్య వారధిగా పనిచేసే ఒక మొబిలైజర్‌తో ప్రతి ప్రాథమిక సేకరణ వాహనాన్ని ట్యాగ్ చేసి తడి, పొడి చెత్త వేర్వేరుగా విభజన జరిగేలా చేయడం అతిపెద్ద విజయం అని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ 'పెనాల్టీలు'..

నిరంతర సమాచారం, ప్రవర్తన మార్పు కమ్యూని కేషన్ ప్రజలకు వివరించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారీ 'పెనాల్టీలు' అమలు చేశామని వివరించా రు. ఈ రోజు వరకు, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విసిరే లేదా మూలం వద్ద వేరు చేయడంలో విఫలమైన ఉల్లంఘించిన వారిపై రోజుకు సుమారు రూ. 3 లక్షలు జరిమానా విధిస్తుందని తెలిపారు. ఏదైనా బహిరంగ సభ, ఫంక్షన్లు, వ్యక్తులు పరిశుభ్రతను కాపాడుకోవడానికి ఈవెంట్‌ను బట్టి అనుమతి తీసుకుని రుసుము చెల్లించా లనే విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

1,300 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి

రోజుకు దాదాపు 1,300 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది, అందులో 550 'ఎంటీ' బయోగ్యాస్ (సీఎన్‌జీ) ప్లాంట్‌కు వెళ్తుంది. బ్యాలెన్స్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీకి వెళ్తుంది. డోర్ టు డోర్ కలెక్షన్, బల్క్ గార్బేజ్ కలెక్షన్ కోసం ప్రత్యేక వాహనాలు కలిగి ఉన్నామని వివరించారు.



వరుసగా 7 సార్లు నెం.1 ర్యాంక్ :

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వరుసగా 7 సార్లు నెం.1 ర్యాంక్ పొందడానికి ఇండోర్ నగర్ నిగమ్ చేసిన అవిశ్రాంత ప్రయత్నాలను కమిని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అభినందించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో క్షేత్ర స్థాయి అధికారులు ఎక్కువ కాలం పని చేయడం వల్ల నగరానికి ప్రయోజనం చేకూరిందని, మెట్రో నగరంగా హైదరాబాద్‌లో జనాభా సాంద్రత, వ్యర్థాల ఉత్పత్తిలో పరిమాణం పరంగా హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన సవాళ్లను కూడా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వ్యక్తం చేశారు. ఇండోర్‌లో తలసరి వ్యర్థాల ఉత్పత్తి 400 మెట్రిక్ టన్నులు మాత్రమే కాగా, హైదరాబాద్‌లో రోజుకు 6500 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని తెలిపారు. వ్యర్థాల సేకరణ కార్యకలాపాలను ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వకుండా తమ ఉద్యోగుల ద్వారా నియంత్రించడంలో ఇండోర్ అనుసరిస్తున్న క్రమబద్ధమైన విధానం పై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేట్ల బృందం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలి



- బాలనగర్ డీసీపీ కే.సురేష్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ జోన్ డిసిపి కే.సురేష్ కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి అస్ బేస్టస్ కమాన్ వద్ద గల రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్,ఆకార్ ఆశా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని బాలనగర్ జోన్,కూకట్పల్లి జోన్ ఏసీపీలు హనుమంతరావు, శ్రీనివాసరావు,జగద్గిరిగుట్ట సీఐ.కే.క్రాంతి కుమార్‌లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల నివాస ప్రాంతాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు, ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆస్పటల్ వైద్య బృందాన్ని డీసీపీ అభినందించారు. ఆకార్ ఆశ ఆస్పత్రి వైద్యనిపుణులు భరతెందు స్పైన్ నేత్రుత్వంలో పుట్టుకతో వచ్చే శారీరక వైకల్యం,గ్రహణ మొర్రి,అగ్ని ప్రమాదాలు(కాలిన గాయాలు)చేతులు అతుక్కొని పుట్టడం, కాళ్లు వంకరగా ఉండడం, రోడ్డు ప్రమాదాలకు గురైన 35 మందికి పరీక్షలు చేశారు. అందులో 20 మందికి ఆకార్ ఆశ ఆస్పత్రి సౌజన్యంతో శస్త్రచికిత్సలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TIVARI NILMANI S/O TIVARI SUKHADER,** R/O 14-B1-315/S, NFCNAGAR, GHATKESAR,TELANGANA 501301 HAVE CHANGED MY NAME TO **NILMANI TIWARI** FOR ALL FUTURE PURPOSES.

CHANGE OF NAME

I, **TIVARI NILAM D/O RAMANAND MISHRA & W/O NILMANI TIWARI,** R/O 14-B1-315/S, NFC NAGAR, GHATKESAR, TELANGANA 501301 HAVE CHANGED MY NAME TO **NILAM TIWARI** For All Future Purposes

---

మహారాజ శ్రీ గౌరవ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు
E P No. 113/2016 IN O.S.No. 198/2009

బిట్వీన్
వంకాయల సరస్వతి ...D.hr/వాది
మరియు
గుండా సత్యనారాయణ ..JDr/ప్రతివాది.
To
Jdr/ప్రతివాది
గుండా సత్యనారాయణ తండ్రి : లేట్ వెంకటరామయ్య, వయస్సు : 75 సం॥లు, వృత్తి: బిజినెస్, R/o నీలాద్రి అపార్ట్మెంట్, తిలక్ నగర్ ,నల్లకుంట , హైదరాబాద్

సేల్ నోటీసు

పైన తెలిపిన కేసులో పైన తెలిపిన కోర్టు వారు ఎన్ని సార్లు మీకు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున వాయిదా వేసినారు. కావున మీరు **ఆ తేదిన 16-10- 2024 నాడు ఉదయం 10:30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి అనుమతి తో//
పోలిశెట్టి పద్మావతి
సోదే ధర్మేంద్ర
ఖమ్మం — న్యాయవాదులు, ఖమ్మం
ది.25.09.2024 — సెల్ 8886299938

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE NALGONDA DISTRICT, AT : NALGONDA
O.S.NO. 7 OF 2023

Between:
Kotha Shankar Reddy And Anther ... Plaintiffs
AND
B. Gopal Reddy & Others ... Defendants
To
B. Gopal Reddy S/o. Sathi Reddy,Aged about 46 Years,Occ: Business,R/o. H.No. 19-5-305/1,Bahadurpura,Hyderabad

Take notice that the Plaintiffs filed the above Suit for SUIT FOR CANCELLATION OF AGREEMENT OF SALE CUM GENERAL POWER OF ATTORNEY VIDE DOC NO.4893 OF 2011 dated 1 st November, 2011 AND CONSEQUENTLY DECLARE THE SALE DEED No. 5051 of 2011 Dated 17 th November, 2011 AND SALE DEED 5608 OF 2011 Dated 09 th December, 2011 AS "NULL AND VOID" and the Suit is coming for your appearance on 04 th October, 2024. You are hereby directed to appear before the Hon'ble Senior Civil Judge, Nalgonda District, At : Nalgonda either in person or through an Advocate on 04 th October, 2024 at 10.30 A.M., failing which the matter will be decided in your absence as per law.

SUIT SCHDULE OF PROPERTY

SY. NO.	Extent (Ac.-Gts.)	HEC.	NATURE (WET/DRY)	VILLAGE & MANDAL
Vendor No.1				
775/ అ	0.38 ½	0.38 ½	Dry	Veliminedu Village, Chityal,Mandal,Nalgonda District
775	0.20	0.20	Dry	
776	0.20	0.20	Dry	
Vendor No.2			Dry	
775/ అ	0.39		Dry	
775	0.20		Dry	
776	0.20		Dry	
Total	3.37 ½		1.57 ½	

Land Situated at : Velimineduu Village, Under Gram Panchayat : VelimineduMP-Chityal, Z.P. – Nalgonda, Registration : Sub-Registrar : Choutuppal,Registration District : Nalgonda.
BOUNDARIES AS FOLLOWS :North : Donka,South : Land of Donda Buchamma,East : Land of Donda Buchamma,West : Donka

(BY ORDER OF COURT)

Sd/-
M/s. Y. Ravi Kiran
Advocates, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE : CCC : AT : HYD.
O.S.NO.4303 OF 2024

Between :-

1. Sayani Narsing Rao, S/o. Late Sayani Jalapathi Rao, Aged @ 55 years, occ: Business,
2. Kayathi Hemalatha, W/o. Kayathi Venkat, D/o. Late Sayani Jalapathi Rao, Age @ 46 years, occ: House hold,
3. Sayani Venkatesh, S/o. Late Sayani Jalapathi Rao, S/o. Late Sayani Jalapathi Rao, Aged @ 43 years, Occ: Business,

All are R/o. H.No.13-1-13/2, Amar Nagar colony, Mangalhat, Hyderabad, 500006- T.G. ....Plaintiffs

AND

1. The Tahsildar, Asif Nagar Mandal, Hyderabad, Telangana State.
2. All Concerned ....Defendants

To
All concerned

WHEREAS the above named Plaintiffs have filed the above numbered suit, praying to declare the Plaintiffs 1,2, and 3 as legal heirs of Late Sayani Laxmi Bai W/o Late Sayani Jalpathi Rao who died on 06-11-2021,

WHEREAS this court ordered notice by publication in News paper, concerning public at large and whom - so - ever concerned,

It is hereby informed that if anybody having objections with regard to the above prayer, they may put forth their objections before the above said Hon'ble court by 10.30 AM on 14-10-2024, if objections are not received by then, the suit will be decided according to law.

//BY ORDER OF THE HONORABLE COURT//
MOHD AZMATH
AZHER ANSAR AHMED
MOHD SADATH JAMAL
Advocates
Cell No's : 9849273878 9849299258, 7893959186

PUBLIC NOTICE
Lose of Documents

The General Public hereby informed that my Client's KACHAM SRIDHAR, S/o Late K SHANKARAIAH, aged about 44 years, R/o Plot No.91, Peerezadigud village & Muncipal Corporation, Medipally Mandal, Medchal Malkajgiri Dist-39. My client has been lost Original document and hand bag, while my client' travelling from residential house to Narapally by Two Wheeler bike on 28.04.2023, the bike was skidded on the road. That the land bearing plot No.132, an admeasuring area 400 Sq.yds 334.4 Sq.mtrs in Survey Nos. 128,129,135 to 138 situated at Chengicherial Village, and Medipally Mandal, Medchal Malkajgiri Dist. The Sale Deed Vide Doct. No.9810/1989, Registered at SRO Uppal & link Sale Deed Doct.No.2731/1988, SRO at Hyderabad East. If anybody found document please return back to my client's and pay rewards.

V.MALLESHAMU, Advocate
TS.Enrol.No.1000/2002.
H.No. 2-4-123/E/69, Swaroopnagar, Road No.7, Near Balaji Temple, Uppal, Medchal-Malkajgiri Dist.- 500039. T.G
Mobile: 9848483541, 9182233536,
email: vutlamallesham@gmail.com

దావా సమాను

IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE AT : VIJAYAWADA
O.S.NO. 220/2022

Between:
PATNALA NAGAMELLESHWAR RAO ...Plaintiff
Smt. TAMARAPALLI RATNA KUMARI & OTHERS ...Defendents
To,
D.3
Maroju Aravind, S/o. Venkata Chary, R/o. Flat No. 403, Block No. A6, Opp: TSRTC Bus Depot, Bandlaguda, Thatty Annaram, Abdullapurmet, Hyderabad, T.S.

పైన నంబర్ దావాలో 3 వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారినుండి దావా సమాన్లు పంపించినాను. మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమాన్లు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది తేది: 14-10-2024 కు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉ॥ గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 14-10-2024
ఇట్లు
యం. రామనాథ్,
వాది తరపు అడ్వకేట్
విజయవాడ, సెల్ : 9440150556

దావా సమాను

IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE AT : VIJAYAWADA
I.A. NO. 37/ 2022
IN
O.S.NO. 220/2022

Between:
PATNALA NAGAMELLESHWAR RAO ...Plaintiff / Petitioner
Smt. TAMARAPALLI RATNA KUMARI & OTHERS
To, ...Defendant / Respondent
D.3
Maroju Aravind, S/o. Venkata Chary, R/o. Flat No. 403, Block No. A6, Opp: TSRTC Bus Depot, Bandlaguda, Thatty Annaram, Abdullapurmet, Hyderabad, T.S.

పైన నంబర్ దావాలో 3 వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారినుండి దావా సమాన్లు పంపించినాను. మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమాన్లు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది తేది: 14-10-2024 కు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉ॥ గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 14-10-2024
ఇట్లు
యం. రామనాథ్,
వాది తరపు అడ్వకేట్
విజయవాడ, సెల్ : 9440150556

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE-CUM- VI ADDL METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT. AT: L.B. NAGAR.

O.S. No: 919 of 2022

Between:
Mr. A. Rajender **...Plaintiff**
And
Dandem Prabhakar **...Defendant**
To
D. Prabhakar S/o D. Yadaiah, Aged about 39 years, Occ: Business, R/o. H.No. 1619, RGK Colony, Ahamedguda, Keesara Mandal, Medchal Malkajgiri district-501301. **...Defendant**

Please take notice that the plaintiff 1) A. Rajender, have instituted the above suit for recovery of money and the same is posted to 22-10-2024 at 10.30 A.M. if anybody not appeared and filed any objection before the Hon'ble Court on 22-10-2024 at 10.30 A.M. the matter will decided on merits.

(BY ORDER OF THE HON'BLE COURT)
V.V. RAMANA & T.SWAMI
Advocates
Flat No. G-1 & G-2, Mani Plaza, H.No. 6-2-101/7/A&B, New Bhoiguda, Secunderabad–500 003.
Date: 25-09-2024.

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE-CUM- VI ADDL METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT. AT: L.B. NAGAR.

O.S. No: 1322 of 2022

Between:
Mr. T. Ranjith **...Plaintiff**
And
Dandem Prabhakar **...Defendant**
To
D. Prabhakar S/o D. Yadaiah, Aged about 39 years, Occ: Business, R/o. H.No. 1619, RGK Colony, Ahamedguda, Keesara Mandal, Medchal Malkajgiri district-501301. **...Defendant**

Please take notice that the plaintiff 1) T. Ranjith, have instituted the above suit for recovery of money and the same is posted to 22-10-2024 at 10.30 A.M. if anybody not appeared and filed any objection before the Hon'ble Court on 22-10-2024 at 10.30 A.M. the matter will decided on merits

(BY ORDER OF THE HON'BLE COURT)
V.V. RAMANA & T.SWAMI
Advocates
Flat No. G-1 & G-2, Mani Plaza, H.No. 6-2-101/7/A&B, New Bhoiguda, Secunderabad–500 003.
Date: 25-09-2024.

IN THE COURT OF THE HON'BLEIII ADDL.DISTRICT AND SESSIONS JUDGE AT: SANGAREDDY
MV OP NO. 90 OF 2023

BETWEEN:
Myathari Maneesha. ...Claimant
AND
Gundimeda Venkata Pratheek & another, ...Respondent

NOTICE

To,
Gundimeda Venkata Pratheek S/o. G. Venkata Sai Prasad, 28 Years,Occ: Software Engineer and Driver of vehicle bearing no. TS 09 FP 4714,R/o.Flat no.6, block 3, HIG-2, Bagh Lingampally, Hyderabad. Cell: 8897566276. ...Respondent No. 1

Whereas the above claimant filed One MV OP.NO. 90 OF 2023, against you on the file of Hon'bleIII ADDL.DISTRICT AND SESSIONS JUDGE at Sangareddy, for Claiming Compensation Under Section. 166 of Motor Vehicle Act and the above case was posted to 10.10.2024.

Hence, you are hereby informed to appear before the Hon'bleIII ADDL.DISTRICT AND SESSIONS JUDGE at Sangareddy on 10.10.2024 at 10:30 AM., either in person or through counsel, failing which the matter will be decided ex-parte as per law.

// By order of the Hon'ble court //
S. SUJATHA
K. ARUNA KUMARI
Advocate
Sangareddy

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XI ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, R.R.DIST AT : RAJENDERNAGAR
O.S.No.521 of 2024

Between:
Kammari Vijaya Laxmi & Others ...Plaintiffs
AND
The Mandal Revenue Officer, Gandipet, R.R.District & others ...Defendants
To
All Concerned

Please take notice that the above named plaintiffs have filed the above suit for declaration to declare the plaintiffs as Legal Heirs of LATE.KAMMARI KRISHNA who died on 10.07.2024 seeking issuance of legal heir certificate in their favour being the sole legal heirs.

If any person (s) have any interest in the above matter and having any kind of objections may filed their objections before the above court **on 14.10.2024 at 10.30 AM** in person or through an advocate, if no objection is received by the court the matter will be decided as exparte.

//BY ORDER OF THE COURT//
G.SHIVA KUMAR SINGH
Advocate
Off : at # 11-6-650/651, Opp. Criminal Court, Nampally, Hyderabad. Cell: 9182235811

IN THE COURT OF THE HON'BLE JUDGE: I ADDITIONAL FAMILY COURT INTEGRATED FAMILY COURT COMPLEX: AT: HYDERABAD
FC O.P.NO. 1688 OF 2019

Between:
Rev.D.Samson ...Petitioner
And
G.Ritu, and others ...Respondents
To,
1.D.Vinod Kumar S/o.Swamydas Aged 38yrs, Occ: Service H.no. 5-60, Shanthinagar Colony, Hydersha kottla, Bandlaguda Jagir, Hyderabad ...Respondent No.2
2.Joshua Willam Carey S/o.John Canady Aged 27 years, Occ: Nil R/o.11-60, Sumitra Nagar, Quthbullapur Medchal-Malkajgiri District ...Respondent No.3

It is hereby informed that the plaintiff above named petitioner have filed FC O.P.No.1688 of 2019 on the file of the Hon'ble I Additional Judge: Family Court Integrated Family Court Complex At Hyderabad for dissolution of marriage dated 12.10.2018

You are therefore required to cause your appearance either in person or through your Advocate on 30.09.2024 at 10.30 AM before the Court failing which the matter will be decided ex-parte

CH. AVINASH KUMAR
ADVOCATE
#3-4-759, second FLOOR, BARKATPURA, HYDERABAD 500027. MOBILE: 9700400311

IN THE COURT OF THE XX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD.
O.S.NO.3442 of 2024

Between:
1.SHAIK HAJABI@ KHAJA BEE W/o Late SHAIK KAREEM, Aged about: 64yrs, occupation: Household, R/o:H.No.1-110,SC colony, Vaillapalli, Naryanapuram Mandal, Nalgonda District, T.G.
2.HAFIZ MOHAMMED NASEER UDDIN HUSAMI @MOHAMMED NASEER UDDIN S/O SHAIK MUNEER UDDIN, Age about: 50yrs, Occupation: Business, R/o H.No.18-12-418/0/57, Omer Colony, Chandryangutta, Hafiz Baba Nagar, T.G. ...PLAINTIFFS
AND
1.SUB REGISTRAR AZAMPURA, R/o.16-11-20/B/6, Moosaram Bagh, Hyd, pin code: 500024.
2.ALL CONCERNED ...DEFENDANTS

Whereas the SHAIK HAJABI@ KHAJA BEE and another has instituted a suit against Defendants for Declaration to declare the plaintiffs as only legal heirs of Late FATIMA SULTANA if any person or persons having any objection may approach in this court and able to answer all material questions relating to the suit or who shall be accomplained by some person able to answer all such questions **on the 17th day of October 2024, at 10:30.A.M,** in the forenoon to answer the claim.

By Order of Court XX JCJ
COUNSEL FOR PLAINTIFF
SUHEL AL DAYANI
Advocate
HYDERABAD, T.G.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: KUKATPALLY
O.S.NO.238 OF 2024

Between:
1.Jaya Gouri Atchutanna W/o. Late.A V S Bhimasankaram, Aged about: 63yrs, Occ: Retd Employee, R/o.H.No.6-37, Road No.2, Durga Estates, Deepthisri Nagar Colony, Miyapur, Hyd, Telangana State-500049.
2.Sri Harsha Atchutanna S/o. Late. A V S Bhimasankaram, aged about: 39yrs, Occ: Software Engineer, R/o.H.No.6-37, Road No.2, Durga Estates, Deepthisri Nagar Colony, Miyapur, Hyd, Telangana State-500049. ...Plaintiffs
AND
1.The Tahasildar, Serilingampally Mandal, Ranga Reddy District.
2. All concerned ...Defendants

NOTICE

To,
All Concerned

Whereas you are hereby informed that the above-named Plaintiffs filed the above O.S.against you for SUIT FOR DECLARATION TO DECLARE THE PLAINTIFFS AS OWNERS AS WELL AS LEGAL-HEIRS OF LATE A V S BHIMASANKARAM In the above suit, the matter is coming for your appearance. The matter stands posted **to 16/10/2024** for your appearance and if you have any objections. You have to appear in person or through an Advocate on that day in the above court **at 10.30 A.M.** otherwise the matter will be decided in your absence, as per law.

(By order of the court)
RR LEGAL ASSOCIATES
B.RAMANI
KPHB/HYDERABAD
Cell: 8686309661.

IN THE COURT OF THE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD,
O.S.No.767 OF 2013

Between:
Abdul Rasheed ..PLAINTIFF
AND
Syed Saleem Ahmed (died per L.Rs) Sayeeda Ahmed & others ...DEFENDANTS 2 & 3

NOTICE

To
01.Smt.Sayeeda Ahmed W/o late Dr.Saleem Ahmed Aged about 61yrs, Occupation Household R/o H.No.10-3-3A, Mehdipatnam Hyderabad.
02.Sayeeda Ismath Ahmed W/o Mir Mustafa Ali Khan Aged about 32 yrs, Occupation Housewife R/o H.No.10-3-3A, Mehdipatnam Hyderabad.

Sir/Madam,
Please take notice that in the above O.S., summons were sent to your above address, which are returned un-served. Please take notice that the above O.S. is now posted **to 01-10-2024.** You are to appear before the above Court on the above date **at 10.30 a.m.** either personally or through duly instructed advocate, failing which matter will be decided as per law in your absence.

//By order of the Court//
P. PANDURANG RAO
VIJAY PISSAY,
P.SANJEEVA REDDY,
Advocates,
OFFICE ADDRESS (Not for Postal Communication) Flat No. 101 "8", First Floor, Sri Gaurav Kalyan Apartments 3-4-229 & 3-4-230, Behind Sri Krishna Lodge Station Road, Kachiguda, Hyderabad 500027
Mobile No: 9948075801

CAUTION NOTICE

The general public are hereby informed that, our client **Rachamalla MADHU D/o. Sri Rachamalla Sudhakar Reddy,** aged about 24yrs, Occ:- Student R/o.H. No.1-10-1/64/4, Road No.1, Plot No.55, Sri Chakripuram Colony, Laxmi Pride, Kushaiguda, ECIL, Hyderabad-500 062.

I purchased the schedule property on Plot No.38, Southern part, in SY.No. 122 part, adm.125.0 Sq.Yds OR 104.5 Sq.Mtrs, situated at Block No.2, Cherlapally Old Village, Kapra [M], GHMC and Circle-1, Medchal-Malkajgiri District, and bounded as NORTH: Plot No.38 Northern part; SOUTH: Plot No. 39; EAST:-Plot No.61 and WEST;-25' Wide Road, under Regd. Sale Deed No. 5654 of 2024 dt.20-04-2024, at, SRO Uppal.

I indented to construct the above said plot, for which I approached several banks to get loan, and I showed the original sale deed documents to the bank managers, who agreed to sanction the loan. During this process our client took Xerox copies and handed over the Xerox copies to the bank managers, our client misplaced or lost in transit the original sale deed No.5654 of 2024 dt.20-04-2024, at, SRO Uppal, Immediately our client rushed to Xerox center and searched each and every corner, but in vain.

The original title deed is not deposited with any person/s OR bank OR non-banking financial institutions or any corporate office for creating any charge or third party interest in the property and that the above property is free from any charge, encumbrance, litigation, minors interest, acquisition, etc.,

Any body found the original sale deed No. 5654 of 2024 dt.20-04-2024, at, SRO Uppal, they may be handed over the same to the undersigned and the said person will get reward.

K.VENKATA CHARY
K. VIJAYA KUMAR
Advocates,
Flat No. 101, Aditya Mansion Apts, Opp:- New Kapra Municipal Office, ECIL Post, Hyderabad-500 062.
Phone No. 9885000754.

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: RAJENDRANAGAR
O.S.No.428 Of 2024

Between:
Smt.G. Shobha and others ...Plaintiffs
AND
TO WHOM SO IT MAY CONCERN & another ...Defendants
To,
WHOM SO IT MAY CONCERN ... Defendant No.1
Sir,
Please take notice that the plaintiffs filed above Suit for declaration to declare the plaintiffs herein are as the legal heirs of the deceased G. Amarnath. The above suit is posted **to 01-10-2024 at 10.30 A.M.** for summons to all concern if any person or persons have any objections or any claims they may appear before the said court on the date and time. If you fails to appear on the said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF COURT)
Kasoju Yadagiri
Advocate
Sri Sai Nilayam, 9-1-33/29/A, Langerhouse, Hyderabad-8.
Cell: 9848827443,

IN THE COURT OF THE HON'BLE XX1 JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT: HYDERABAD
O.S.No.4251 of 2024

Between:-
1.K.Sathyavathi W/o.late K.S.S. Nageshwara Rao Aged about 75 yrs, Occ: Housewife
2.K.Sridhar S/o.late K.S.S. Nageshwara Rao Aged about 54 yrs, Occ: Business
3.K.Padmaja D/o.late K.S.S. Nageshwara Rao Aged about 52yrs, Occ: Housewife,
All are R/o. Flat No.601, S.V. Classic Residency, Ameerpet, Near Lal Bungalow, Hyd-500016 ...Plaintiffs
And
1.The Tahsildar, Ameerpet, Hyderabad.
2. All concerned ...Defendants

Take notice that the Plaintiffs herein have filed the suit for Declaration to declare the Plaintiffs as legal heirs and successors against the defendant No.2 herein. The above case is posted **to 14-10-2024** for your appearance. Hence you are hereby directed to appear before this Hon'ble Court **on 14-10-2024 at 10.30 a.m.** personally or through an Advocate, failing which the matter will be decided on merits.

(BY THE ORDER OF THE COURT)
Sd/-
G. MANGIRA VENKATESH
B. Padmaja Reedy
Advocates
Plot No.16 & 17, Sai Srinivasa Hills Mathuguda, Nagole R.R.District-500068.
Cell: 9440420620

IN THE COURT OF THE HON'BLE II ADDL SENIOR CIVIL JUDGE: R.R.DIST COURT: AT: NTR NAGAR.
E.P.NO.11 OF 2016
IN
O.S.No. 1819 OF 2012

Between:
M/s.Margadarsi Chit Fund Pvt Ltd. ...Decree Holder
and
Mr.M.V.Kamalakar & Others ....Judgement Debtors
To
Mr.K.Ravi, S/o.K.Esthari, R/o. H.No.11-3-215/1, Flat No.201, Rajbharathi Apts., Road No.7, Sri Venkateshwara Colony, Saroor Nagar, R.R.Dist. ...J.D.No.02

TO WHOMSOEVER IT MAY BE CONCERN

In the above mentioned E.P., the below mentioned property is brought for Sale to realize the Decree Debt of Rs.9,66,299/-. Auction is going to be held **on 30.10.2024** at Court premises **at 10.30 A.M.,** Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid which is opened to one and all.

SCHEDULE OF PROPERTY BELONGING TO JDR.No.2 MR.K.RAVI, REGISTERED VIDE SALE DEED NO.2065/2008, DT.06.05.2008.

All that the Residential Portion bearing Flat No.302 in third Floor, of RajBharathi, having built-up area of 1000.00 sft (including common areas and Balconies), together with proportionate undivided share of land admeasuring, 15.00 sq.yds., out of 433.77 sq.yds, on Plot No.38, in Survey No.27, under Ward No.11, Block No.4, situated at Venkateswara Colony, Road No.7, Saroornagar Village and Revenue Mandal, under GHMC, L.B.Nagar Circle, Ranga Reddy District. Registration Sub- District: Saroornagar, R.R.District and bounded as follows by:-

BOUNDARIES OF ENTIRELAND
North : Neighbours Land
South: 30' Wide Road
East: Plot No.39
West: Plot No.37

BOUNDARIES OF ENTIRE FLAT
North: Corridor
South : Open to Sky
East : Flat No.301
West: Open to Sky

The terms and conditions of the sale may be ascertained from the Bailiff of the said Court.

(BY ORDER OF THE COURT)
V.SRINIVAS,
ADVOCATE FOR DECREE HOLDER
H.No.8-2-268/C/10, Road No.3, Arora Colony, Banjara Hills, Hyderabad.

తాజ్ మహల్ హెూటల్ యాజమాన్యానికి షోకాజు నోటీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తాజ్ మహల్ హెూటల్ యాజమాన్యానికి గురువారం జీహెచ్ఎంసీ అధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు. అబిడ్స్ రోడ్డులోని తాజ్ మహల్ హెూటల్‌లో పప్పులో పురుగు కనిపించడం గురించి సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో, గురువారం హెూటల్‌లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టి అధికారులు తనిఖీలు నిర్వహించారని హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. తనిఖీల్లో భాగంగా హెూటల్‌లో సరైన పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు గుర్తించారని తెలిపారు. ఆహార పదార్థాలకు సంబంధించిన ఐటమ్స్‌పై లేబుల్స్ లేకపోవడం, నిల్వ చేసే ప్రదేశంలో బొద్దింకలు ఉండటం వంటి అనేక లోపాలు ఆహార భద్రత అధికారులు గమనించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెూటల్ నిర్వహకులకు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. సంజాయిషి అందిన పిమ్మట తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పేకాటాడుతున్న 17 మంది అరెస్ట్

- రూ. 70, 470 నగదు తో పాటు పేకాట సామాగ్రి స్వాధీనం



నవతెలంగాణ - ముషీరాబాద్

17 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసిన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్‌లోని ఇందిరా నగర్ లోని సహారా ఫంక్షన్ హాల్‌లో గుట్టుచప్పుడు కాకుండా 17 మంది పేకాట ఆడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందంతో ముషీరాబాద్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మేరకు సహారా ఫంక్షన్ హాల్ లో రెండు గ్రూపులుగా ఏర్పడి పేకాట ఆడుతున్న 17 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 70, 470 నగదు తో పాటు పేకాట సామాగ్రిని స్వాధీనం చేసుకుని గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

అర్హులైన పేదలకు పునరావాసం కల్పించేందుకు వివరాలు సేకరించాలి

- సీఎం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినందున ఆ ప్రాంతంలోని అర్హులైన పేదలకు సీఎం ఆదేశాల మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించేందుకు వివరాలు సేకరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు తదితరులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పునరావాస కల్పన, డబుల్ ఇండ్ల కేటాయింపునకు వారి వివరాలు సేకరించేందుకు 16 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, జీహెచ్ఎంసీ, పోలీస్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌లు ఉంటారన్నారు. ఒక్కొక్క బృందం మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న 75 గృహాలను సందర్శించి సదరు ఇంటి యజమాని/కిరాయిదారు ఆధార్/వయసు /కులం /ఫిజీకల్ హ్యాండీక్యాప్ /ఇతర వివరాలు సేకరించాలని తెలిపారు. సర్వే ప్రశాంతంగా జరగాలన్నారు. ప్రతి రెండు బృందాలకు పర్యవేక్షణ అధికారిగా ఒక డిప్యూటీ కలెక్టర్‌ను నియమించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకట చారి, ఆర్డీవో మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్‌లు, ఆర్ఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారానికి కసరత్తు

- రహదారులపై వరద నివారణకు వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్
- లక్ష లీటర్ల కెపాసిటీ నుంచి 10 లక్షల లీటర్ల సామర్థ్యం





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై ఏర్పడిన వరద నివారణ చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది. వరదల వలన ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారులపై నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ చేపట్టాలని జీహెచ్ఎంసీ ప్రతిపాదించింది. వర్షాకాలంలో నగరంలో భారీ వర్షాల వలన వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద నీరు ఎక్కువగా నిలువడం మూలంగా మొత్తం రవాణా వ్యవస్థ నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు శాశ్వత పరిష్కారం కోసం లక్ష లీటర్ల సామర్థ్యం నుండి 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణలు చేపట్టేందుకు ప్రతిపాధించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో వినూత్నంగా 50 వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. నగర వ్యాప్తంగా 18 లోకేషన్లలో 23 వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలు చేపట్టారు. చేపట్టిన సంపుల నిర్మాణాలు వరదతో నిండిపోయిన సందర్భంగా వాటిని ఎప్పటికప్పుడు విద్యుత్ మోటర్లతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ లోకి తరలిస్తారు. సంపులో ఎప్పటికప్పుడు నీటి తొలగింపు వలన నీరు నిలువకుండా పోతుంది. తద్వారా ట్రాఫిక్ సమస్య చెక్ పడుతుంది.

నగరంలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్

నగరంలో ప్రస్తుతం 141 వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద వరద నీరు నిలువకుండా 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, 252 స్టాటిక్ బృందాలు పనిచేస్తున్నాయి. వర్షం వస్తుందని వాతావరణ శాఖ సూచనలు రాగానే సర్కిల్ వారీగా ప్రజలను, అధికారులను ముందస్తు గానే హెచ్చరించి సర్కిల్ స్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను అప్రమత్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 141 మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్‌లను భవిష్యత్తులో 50 వాటర్ లాగింగ్ పాయింట్‌లకు మాత్రమే పరిమితం చేయాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు

వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ (సంపుల) నిర్మాణాల వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకున్నారు. సంపుల వద్ద ప్రమాదాలకు తావివ్వకుండా సరిహద్దులో పటిష్టంగా ఇనుప రాడ్లతో నిర్మాణాలు చేపట్టి అదే విధంగా రాత్రి సమయంలో కూడా విద్యుత్ లైట్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఒక ఇన్‌చార్జిగా భాధ్యత గల అధికారిని పర్యవేక్షణ కు మరొక అధికారిని నోడల్ అధికారిగా నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నాలా భద్రత ఆడిట్‌లో అమలులో ఉన్న విధంగా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన పక్షంలో అతనినే బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట ఇంజినీరింగ్ అధికారులను అదేశించారు.

ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా హెూటెల్స్, రెస్టారెంట్‌లలో తనిఖీలు

- దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళల అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చెప్పుకుంటూ వివిధ హెూటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు జీహెచ్ఎంసీ (హెల్త్) అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. బొగ్గుల సునీత, నీలి విజయలక్ష్మి అనే ఇద్దరు మహిళలు ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చలామని అవుతూ వివిధ హెూటళ్లు, రెస్టారెంట్‌లలో తనిఖీలు చేసి దోపిడికి పాల్పడుతున్నట్లు ఇటీవల జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదులు అందాయని తెలిపారు. సంబంధిత ఇద్దరు మహిళలు ఈ నెల 23న అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాలలోని రెస్టారెంట్లను సందర్శిస్తున్నట్టు సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు వెంటనే సమీపంలోని రెస్టారెంట్లు, హెూటళ్లను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ఆ మేరకు సుచిత్ర ఎక్స్ రోడ్డు వద్ద గల మెసర్స్ గిస్మత్ జైల్ మండి రెస్టారెంట్ నిర్వాహకులు సంబంధిత మహిళలను పట్టుకొని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. పేట్ బషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్న నకిలీ అధికారులుగా చలామణి అవుతున్న వ్యక్తులు మలక్ పేట్‌కు చెందిన బొగ్గుల సునీత, సికింద్రాబాద్‌కు చెందిన నీలి విజయలక్ష్మి గా గుర్తించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పదవి విరమణ పొందిన రోజే ప్రయోజనాలు అందాలి



- తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఉద్యోగులు పదవి విరమణ పొందిన రోజే పోలీస్ శాఖ నుంచి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను అందించి, గౌరవ ప్రదంగా ఉద్యోగులను పంపించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాజ మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ 33 జిల్లాల్లో దాదాపు 20 వేల మంది రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ఉన్నారన్నారు. వారికి ఆరోగ్య భద్రత కోసం అందించే రూ.2 లక్షల బీమా సౌకర్యాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. తమ అసోసియేషన్ రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ నుంచి అధికారుల సంక్షేమం కోసం కషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు.రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.1,000కి పెంచాలని, అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం కోసం హైదరాబాద్‌లో ఒక చోట భవనాన్ని కేటాయించాలని, అదే విధంగా రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలలో 300 గజాల స్థలాన్ని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు ఎలాంటి సమస్యలు ఉన్న తమ అసోసియేషన్ దష్టికి తీసుకురావాలని సూచించారు.తమ సమస్యలపై త్వరలో రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర డీజీపీని కలిసి వినతి పత్రాలు అందజేస్తామని వారు చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఖాసీంపీరా, గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, సి.హెచ్.రాజమౌళి, ఉపాధ్యక్షులు సుదర్శన్ రాజు, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఎంఎంఎస్' దరఖాస్తుల నమోదు గడువు పొడిగింపు

- ఈ నెల 30వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం
- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-సిటీబ్యూరో

'ఉపకార వేతనం.. ప్రచారం నిల్' పేరిట మంగళవారం నవతెలంగాణ ప్రచురించిన కథనానికి విద్యాశాఖ స్పందించింది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు తేదీని ఈనెల 30వరకు పొడిగిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిభ ఉండి ఆర్థిక సోమత్త లేని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్కారు బడుల్లో ప్రతిభా చాటే విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కానీ ఈ పథకం గురించి విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో కనీసం దరఖాస్తు సైతం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రతిభ ఉండి.. అవగాహన లేమీతో ఈ పథకానికి దూరమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 287 హైస్కూళ్లలో ఎనిమిదో తరగతిలో సుమారు 13,103 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. 2024-25 విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతనాల కోసం కేవలం 73 స్కూళ్ల నుంచి 833 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. అందుకు సంబంధిత అధికారుల ఆలసత్వంతో పాటు ప్రచారం లోపం, ఇతర కారణాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించి అత్యల్పంగా దరఖాస్తులు రావడంపై డీఈవో రోహిణీ ఇప్పటికే మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించి.. స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో స్వల్పంగా దరఖాస్తులు పెరిగాయి. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు మరికొంది సమయం పొడిగిస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మరోసారి దీనిపై సీరియస్‌గా దృష్టిపెట్టాలని మండల విద్యాధికారులకు డీఈవో మౌఖిక ఆదేశాలు జారీచేసినట్టు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఫోరం ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ నెల 27న నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఈ నెల 27న సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (నవీన్), విమలక్క, దిలీప్ కుమార్, వెన్నల గద్దర్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని నియమించాలని, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్, నాయకులు కొంతం వీరస్వామి, బి.ఇంద్రకుమార్, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టాలి

- సర్కారు దృష్టికి తీసుకెళ్లాలని ముజీబ్‌కు ఉద్యోగుల విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టేలా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను కోరాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్)కి ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో వారు ముజీబ్‌ని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు ప్రభుత్వాలు అంగీకరించాయని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యోగులు తెలంగాణకు, ఏపీ ఉద్యోగులు వారి రాష్ట్రానికి వెళ్తారని,. ఎవ్వరూ ఆందోళన చెందకూడదని వారికి ముజీబ్ ధైర్యం చెప్పారు.

దద్దరిల్లిన అంబేద్కర్ వర్సిటీ



నవతెలంగాణ-బంజారా హిల్స్

జె.ఎన్.ఎఫ్.ఏ.యూకు భూ కేటాయింపు ఆలోచనను విరమించుకోవాలంటూ అంబేద్కర్ వర్సిటీ జేఏసీ నిరసన తెలిపింది. జూబ్లీహిల్స్‌లోని డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పది ఎకరాల స్థలాన్ని జె.ఎన్.ఎఫ్.ఏ.యూకు కేటాయించడాన్ని నిరసిస్తూ బుధవారం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మెన్ ప్రొ. పల్లవి కాబడే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జి . మహేశ్వర్ గౌడ్ మాట్లాడారు. యూనివర్శిటీ డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి జూబ్లీహిల్స్‌లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా 53 ఎకరాల భూమిని కేటాయించిందని, అయితే తర్వాత టీ సాట్ కి దాదాపు 5 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా కేటాయించిందన్నారు. కేబుల్ బ్రిడ్జి అభివృద్ధికి 4 ఎకరాల భూమిని ఉపయోగించారని, దుర్గం చెరువులో ఇప్పటికే మరో 5 ఎకరాలకు పైగా నీట మునిగిందని తెలిపారు. . ఇప్పటికే యూనివర్సిటీ లో ఉన్న బిల్డింగ్స్ ఇతర మౌలిక వసతులు సరిపోకపోవడంతో అటు విద్యార్థులు ఇటు ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థుల అవసరాల కోసం భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ తరుణంలో తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీ స్థలాలను ఇతరులకు కేటాయిస్తే భవిష్యత్తులో తమ యూనివర్సిటీ అభివృద్ధికీ, విస్తరణకు అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. జి. మహేశ్వర్ గౌడ్, డా. రవీంద్రనాథ్ సోలమన్, డా. వెంకటేశ్వర్లు, డా. నారాయణ రావు, డా. బానోత్ ధర్మ, ఎం. రుషేంద్రమని, ప్రొ. పుష్పా చక్రపాణి, ప్రొ. మాధురి, ప్రొ . మేరీ సునంద, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ మండలంలో ఎస్టీయూ మెంబర్‌షిప్ డ్రైవ్





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మెంబర్‌షిప్ క్యాంపెనింగ్‌లో భాగంగా బుధవారం సికింద్రాబాద్ మండలంలో జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఇఫ్తాకారుద్దీన్, ప్రధాన కార్యదర్శ శ్రీరామ సుబ్బారావు, ఎస్టీయూ బృందం వివిధ పాఠశాల లను సందర్శించి, మెంబర్‌షిప్ చేయించారు.

సికింద్రాబాద్ మండల నూతన కమిటీ ఎన్నిక

సికింద్రాబాద్ మండలం నూతన కమిటీ ఏర్పాటైంది. ఎస్టీయూటీఎస్ సికింద్రాబాద్ మండలం నూతన అధ్యక్షులుగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఇటీవల ఎంపికయిన విజయలక్ష్మి, సంవత్సర కాలం పూర్తి చేసుకున్న జీహెచ్ఎస్ కలాసిగూడ హెడ్‌మాస్టర్ యాకూబ్ చారిని ఎస్టీయూ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.షద్రక్, భోపాల్, వెంకటేష్, శైలేందర్, సుమన్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమం బలోపేతం కోసమే రాజీనామా

- ఈ ఉద్యమం ద్వారా దేశ వ్యాప్తంగా బీసీలకు న్యాయం జరగాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

బీసీ ఉద్యమం బలోపేతం కోసం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్ కష్ణయ్య తెలిపారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్ లో ఆర్ కష్ణయ్యను ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ వి హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ కష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ ఉద్యమం తారాస్థాయికి చేరిందని అటువంటి తరుణంలో ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా చేయబోతున్నామని తెలిపారు. అందుకే తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు. ఈ ఉద్యమం ద్వారా దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరగాలని కోరారు. వివిధ పద్ధతుల్లో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడం లేదని 76 సంవత్సరాల తరువాత కూడా బీసీలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాజ్యసభ ఇచ్చారని బీసీల తరపున చట్టసభల్లో ప్రశ్నించిన సమాధానం రాలేదన్నారు. ప్రజా ఉద్యమం,బీసీ ఉద్యమమే తన కార్యచరణ అని, రాజ్యాధికారంలో వాటా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నారన్నారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేసి సాధించడం తన జీవిత లక్ష్యం అని తెలిపారు.రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని ప్రతి ఒక్క బీసీ బిడ్డ కోరుతున్నారన్నారు. రాజకీయ పార్టీ పెట్టే నిర్ణయం తీసుకోలేదన్నారు.

ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ. ఆర్ కష్ణయ్య తీసుకునే నిర్ణయం ఏదైనా బలమైన నిర్ణయంగా ఉంటుందన్నారు కష్ణయ్య పోరాటాలను కాంగ్రెస్ గుర్తించి అన్నింటిని దష్టిలో ఉంచుకొని కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తూ బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చట్టసభల్లో అవకాశాలు మెరుగుపరచాలని అంశంతో తన మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. బీసీ ఉద్యమంలో అందరం కలిసి ఉమ్మడిగా పోరాటం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్‌తో పాటు కులగణన చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. మిగిలిన పార్టీలు బీసీ డిక్లరేషన్, కులగణన విషయంలో తమ స్పష్టత తెలియజేయాలన్నారు. ఆర్ కష్ణయ్య ను కాంగ్రెస్ పార్టీలోకి సాధరంగా ఆహ్వానిస్తున్నామని, ఆయనకు పార్టీలో సమ్మచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ ఆర్ కష్ణయ్య బీసీల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మహా వ్యక్తి అని వెల్లడించారు. పార్లమెంటులో 42 నుంచి 52 శాతం శాతానికి పెంచాలన్న కష్ణయ్య డిమాండ్ ను రాహుల్ గాంధీతో చర్చించి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కష్ణ, నీల వెంకటేష్, వేముల రామకష్ణ, అనంతయ్య, జీలపల్లి అంజి, పగిళ్ల సతీష్, నందగోపాల్, గొరిగ మల్లేష్, మోడీ రాందేవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మోహన్ బాబు ఇంట్లో డబ్బులు దొంగిలించిన నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సినీ నటుడు మోహన్ బాబు ఇంటిలో డబ్బులు దొంగిలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పహడి షరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సినీ నటుడు మోహన్ బాబు పర్సనల్ సెక్రటరీ కిరణ్ కుమార్ ఈ నెల 22న తిరుపతి నుండి మోహన్ బాబు ఎంబీయు యూనివర్శిటీకి సంబంధించిన రూ.10లక్షలు తీసుకువచ్చి జల్ పల్లిలోని మంచు టౌన్ షిప్ లోని రూములో భద్రపర్చాడు. 23న ఉదయం కిరణ్ కుమార్ లేచి రూంలోని డబ్బులను చూడగా కనిపించలేదు. సీసీ కెమెరాలో చూడగా అక్కడే పనిచేస్తున్న గణేష్ నాయక్ రూంలోకి వచ్చి పోయినట్లు ఉంది. అనుమానంతో గణేష్ నాయక్ పై పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. కిరణ్. రాచకొండ సీపి సుధీర్ బాబు ఆదేశం మేరకు పోలీసులు నిందితుడి కోసం బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టగా తిరుపతిలో ఉన్నట్టు గుర్తించారు. అనంతరం అక్కడికి పోలీసులు వెళ్లి నిందితుని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి డబ్బులను రికవరీ చేశారు. బుధవారం నిందితుడిని రిమాండుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

యువతకు పెండ్లి సంబంధాలు చూడటం మా బాధ్యత

- ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ వ్యవస్థాపక అధ్యక్షులు బీఎం. అర్జున్‌రావు



నవతెలంగాణ-ముషీరాబాద్

తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధాలు చూడడానికి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ మీ వెంబడి ఉండి సహకరిస్తుందని వ్యవస్థాపక అధ్యక్షులు బీఎం.అర్జున్‌రావు అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియన్ మ్యారేజ్ బ్యూరోస్ జేఏసీ రెండో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి మ్యారేజ్ బ్యూరోస్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు హాజర య్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అర్జున్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి ఈ మ్యారేజ్ బ్యూరోలో మంచి సంబంధాలు చూడడమే కాకుండా వారి భవిష్యత్‌కు పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ఇప్పటి వరకు తమ జేఏసీలో 40 సంఘాల వారు మద్దతు తెలిపారన్నారు. అక్టోబర్ 29న రాజమండ్రిలో పెద్ద ఎత్తున సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మాయి, అబ్బాయిల ఫోటోలను ఎవరికి పడితే వారికి ఇవ్వవద్దని, కొంత మంది మోసాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మ్యారేజ్ బ్యూరోల నిర్వాహకులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
గురువారం 26 సెప్టెంబరు 2024
హైదరాబాద్
www.navatelangana.com

వానాకాలంలో సాయంత్రం పూట వేడివేడిగా స్నాక్స్ తినాలనిపిస్తుంది. పకోడీలు, బజ్జీలు వంటివి బయట కొని తినేవాళ్లే ఎక్కువ. బయట నూనెతో చేసిన స్నాక్స్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే కొద్దిగా టైం కేటాయించుకొని ఇంట్లో చేసుకుంటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం. అలా చేసుకొనే రుచికరమైన రెసిపీలు కొన్ని నేటి మానవిలో మీ కోసం..



క్రంచీ క్రంచీ స్నాక్స్......

కొత్తిమీర వడలు

కావలసిన పదార్థాలు : కొత్తిమీర- మూడు కట్టలు, శనగపిండి - ఒక కప్పు, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒక టీస్పూన్, కారం - అర స్పూన్, పసుపు - అర స్పూన్, పచ్చి మిర్చి - రెండు, దనియాల పొడి- అర స్పూన్, జీలకర్ర పొడి- అర స్పూన్, నువ్వులు - ఒక స్పూన్, గరంమసాలా - పావు స్పూన్, ఉప్పు - తగి నంత, నిమ్మరసం ఒక స్పూన్, నీళ్లు- పావు కప్పు, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.



తయారీ విధానం : ముందుగా కొత్తిమీరను శుభ్రంగా కడిగి తరిగి ఒక పాత్రలోకి తీసుకోవాలి. తరువాత అందులో శనగపిండి, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మిర్చి, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, నువ్వులు, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి అన్నీ బాగా కలుపుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు అర చేతిలో కొద్దిగా నూనె రాసుకుని ప్లేట్‌లో సమంగా పరిచి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉడికించాలి. చల్లారిన తరువాత మనకు కావాల్సిన షేప్‌లో కట్ చేసుకోవాలి. స్టవ్‌పై పాన్ పెట్టి నూనె పోసి కాస్త వేడి అయ్యాక వాటిని వేసి వేయించుకోవాలి. అంతే... కరకరలాడే కొత్తిమీర వడలు రెడీ.

పెసరపప్పు పకోడీ

కావలసిన పదార్థాలు: పెసరపప్పు - ఒక కప్పు, ఒకటిన్నర కప్పు నీళ్లు, పచ్చిమిర్చి తరుగు - ఒక స్పూను, సన్నగా తరిగిన అల్లం ముక్కలు - ఒక స్పూను, ఇంగువ - చిటికెడు, మిరియాలు - ఒక స్పూను, ధనియాలు - ఒక స్పూను, ఉప్పు, తగినంత, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ విధానం: ఒక గిన్నెలో శుభ్రంగా కడిగిన పెసరపప్పును తీసుకుని కనీసం మూడు నాలుగు గంటలు నానబెట్టుకోవాలి. నీళ్ల నుంచి పెసరపప్పు తీసేసి బరకగా గ్రైండ్ చేసుకోవాలి. అందులోనే పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, ఇంగువ, కొద్దిగా నీళ్లు పోసుకుని కలుపుకోవాలి. ఇప్పుడు మరోసారి గ్రైండ్ చేయాలి. మిరియాలు, ధనియాలు కొద్దిగా దంచుకొని వాటిని పెసరపప్పు మిశ్రమంలో కలిపేసుకోవాలి. ఉప్పు కూడా వేసుకుని పిండి బాగా కలుపుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసుకుని వేడెక్కాక చిన్న చిన్నగా పకోడీలు వేసుకోవాలి. క్రిస్పీగా, రంగు మారేంత వరకు వేయించుకోవాలి. పకోడీలు వేగేంత వరకు మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. ఒక టిష్యూ పేపర్ మీద తీసుకుంటే నూనె పీల్చేసుకుంటుంది. వీటిని కెచప్ లేదా ఏదైనా చట్నీతో సర్వ్ చేసుకోవచ్చు. చిన్న పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మూంగ్ పకోడీ ఒకసారి మీరూ ప్రయత్నం చేయండి.



పోహా కట్‌లెట్స్

కావలసిన పదార్థాలు : అటుకులు ఒక కప్పు, బంగాళదుంపలు- రెండు, పసుపు - చిటికెడు, కారం - అర టీస్పూన్, గరం మసాలా అర టీస్పూన్, మామిడికాయ పొడి - పావు స్పూన్, చాట్ మసాల - అర టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్టు- అర టీస్పూన్, మిరియాల పొడి - పావు టీస్పూన్, కార్న్ ఫ్లోర్ - ఒక టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత, కొత్తిమీర - ఒక కట్ట, బ్రెడ్ క్రంబ్స్- ఒక కప్పు, మైదా - ఒక స్పూన్.



తయారీ విధానం : బంగాళదుంపలను ఉడికించి, మెత్తటి గుజ్జుగా చేసి పెట్టుకోవాలి. అటుకులను శుభ్రంగా కడిగి ఒక పాత్రలోకి తీసుకోవాలి. తరువాత అందులో బంగాళదుంపల గుజ్జు వేయాలి. తరువాత పసుపు, కారం, గరం మసాలా, మామిడికాయ పొడి, చాట్‌మసాలా, అల్లంవెల్లుల్లి పేస్టు, మిరియాల పొడి, కార్న్‌ఫ్లోర్, కొత్తిమీర వేసి, తగినంత పోహా కట్లెట్స్, ఉప్పు వేసి మెత్తటి మిశ్రమంలా కలపాలి. లి మరొక పాత్రలో మైదా పిండి తీసుకుని అందులో కొద్దిగా కార్న్ ఫ్లోర్ వేసి తగినన్ని నీళ్లు పోసి పలుచగా కలపాలి. చేతులకు నూనె రాసుకుని మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతుల్లోకి తీసుకుంటూ వడల్లా ఒత్తుకుంటూ మైదా మిశ్రమంలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్ అద్దాలి. స్టవ్‌పై పాన్ పెట్టి నూనె పోసి కాస్త వేడి అయ్యాక వాటిని వేసి గోధుమరంగులోకి మారే వరకు వేయించాలి. టొమాటో సాస్తో పోహా కట్‌లెట్స్ వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి.

కార్న్ కట్లెట్

కావలసిన పదార్థాలు: స్వీట్ కార్న్ లేదా మామూలు మొక్కజొన్న గింజలు - ఒక కప్పు, బంగాళదుంపలు - రెండు (మీడియం సైజువి), క్యారట్ తురుము- ఒక స్పూను, క్యాప్సికం ముక్కలు - ఒక స్పూను, ఉల్లిపాయ సన్నటి ముక్కల తరుగు - ఒక కప్పు, గుప్పెడు కొత్తిమీర తరుగు, పావు టీస్పూన్ పసుపు, కారం - ఆర స్పూను, ధనియాల పొడి - అర స్పూను, జీలకర్ర పొడి -అర స్పూను, ఉప్పు- రుచికి సరిపడ, పావు కప్పు బ్రెడ్ క్రంబ్స్, కార్న్ ఫ్లోర్ - రెండు స్పూన్లు, డీప్ ఫ్రైకి సరిపడా నూనె.



తయారీ విధానం : ముందుగా మొక్కజొన్న గింజల్ని మిక్సీలో వేసి బరకగా రుబ్బుకోవాలి. కొన్ని గింజలు అలాగే కనిపించినా పరవాలేదు. వాటితో కూడా తినేటప్పుడు రుచి బాగుంటుంది. ఈ ముద్దను ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో క్యారట్ తురుము, క్యాప్సికం ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు వేసుకుని బాగా కలుపుకోవాలి.

పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి అన్నీ కలిసేలా కలపాలి. అందులోనే ఉడికించిన బంగాళదుంపలను బాగా మెదిపి వేసుకోవాలి. చివరగా కార్న్ ఫ్లోర్, బ్రెడ్ క్రంబ్స్ కూడా వేసి గట్టిగా ముద్దలా కలుపుకోవాలి. ఇప్పుడు చేతులకు నూనె రాసుకుని కొంచెం ముద్ద తీసుకుని కట్లెట్ ఆకారంలో ఒత్తుకోవాలి.

కళాయి పెట్టుకుని నూనె పోసుకుని ఈ కట్లెట్లు వేసుకుని డీప్ ఫ్రై చేసుకోవాలి. రెండు వైపులా రంగు మారేంత వరకు వేయించుకుంటే సరిపోతుంది. క్రిస్పీగా అయిపోతాయి.

వీటిని నూనెలో నుంచి బయటకు తీసుకుంటే చాలు. అదనంగా నూనె వదిలేయడానికి టిష్యూల మీద తీసుకుంటే సరిపోతుంది. వీటిని ఏదైనా చట్నీ లేదా టమాటా సాస్‌తో కలిపి సర్వ్ చేయండి. ■

మెదడు చురుకుదనానికి...

మెదడు మన శరీరంలోని అత్యంత సంక్లిష్టమైన అవయవం. ఇది నిరంతరం పని చేస్తూనే ఉంటుంది. అయితే శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతోపాటు మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం.

దీని కోసం డైట్‌లో కొన్ని సూపర్‌ఫుడ్‌లను చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇవి మెదడు పనితీరు, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

చాపలు : సాల్మన్, ట్యూనా వంటి చేపల్లో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా కనిపిస్తాయి. ఈ కొవ్వు ఆమ్లాలు మెదడు అభివృద్ధి, కణాల నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఒమేగా -3 లో అధికంగా ఉండే ఆహారం మెదడును పదును పెట్టడానికి, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి.



బెర్రీలు : స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్‌బెర్రీలు వంటి వాటిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి మెదడు కణాలను దెబ్బతినకుండా రక్షిస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

తృణధాన్యాలు : మిల్లెట్, బార్లీ, బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాలలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. విటమిన్ ఇ మెదడు కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షిస్తుంది. మెదడును పదునుగా ఉంచడంలో సహాయపడుతుంది. అలాగే, తృణ ధాన్యాలలో ఉండే ఫైబర్ మెదడుకు పోషకాలను అందించడంలో సహాయపడుతుంది.

టొమాటో : టొమాటోలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. లైకోపీన్ వృద్ధాప్యానికి సంబంధించిన నష్టం నుండి మెదడును కాపాడుతుంది. జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది.

కాఫీ : కాఫీ మెదడు చురుకుదనాన్ని పెంచుతుందని అంటారు. వాస్తవానికి, కాఫీలో కెఫిన్ ఉంటుంది. ఇది మెదడులోని న్యూరోట్రాన్స్‌మీటర్ల స్థాయిని పెంచుతుంది. ఇది మెదడు పనితీరు, దృష్టిని మెరుగుపరుస్తుంది. అయినప్పటికీ, కాఫీని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి సమతుల్య పరిమాణంలో మాత్రమే తినండి.

ఉపాధికి భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఏడాది మూడు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొంది కాలేజీల నుంచి బయటకు వస్తున్నప్పటికీ ఇండస్ట్రీ అవసరాలకు సంబంధించిన నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అన్నారు. పరిశ్రమలు సైతం సాంకేతిక నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించేందుకు యువతకు నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఇంటర్న్‌షిప్ కూడా ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనీ, దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా సమకూరుతుందని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయని, చదివిన డిగ్రీకి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు గ్యాప్ ఉంటోందని సీఎం వివరించారు. బీఎఫ్ఎస్ఐకు అవసరమైన స్కిల్స్ నేర్పేందుకు ఈ కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు.

గత పదేండ్లలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనందుకు రాష్ట్రంలో కొంత మంది యువత గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసయ్యారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పట్టుబడిన డ్రగ్ పెడలర్స్‌లో ఇంజినీరింగ్ స్టూడెంట్స్ ఉన్నారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు, కనీస ప్రమాణాలు ఉండటం లేదని సీఎం అన్నారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు.

టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, ఇప్పటికే మల్లేపల్లి ఐటీఐలో పైలెట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు చెప్పారు. దీంతో ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం లభిస్తుందని అన్నారు. రాబోయే రెండేండ్లలో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తామని తెలిపారు. ఇటీవలే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం నెలకొల్పిందని, మహీంద్రా గ్రూప్ చైర్మెన్ ఆనంద్ మహీంద్రాను బోర్డు చైర్మెన్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఏటా వేలాది మంది యువతకు వివిధ రంగాల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు నిర్వహిస్తామని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీలను అప్‌గ్రేడ్ చేస్తామనీ, త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసి, తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎక్విప్ సంస్థ రూ. 2.5 కోట్ల చెక్కును ముఖ్యమంత్రికి అందించింది. విద్యార్థుల డేటాతో రూపొందించిన ఎక్విప్ స్కిల్ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రానున్న కొద్ది సంవత్సరాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఐదు లక్షల మంది శిక్షణ పొందిన అభ్యర్థుల అవసరం ఉంటుందని తెలిపారు. ఈ ఖాళీల భర్తీకి నైపుణ్యం కలిగిన వారిని తయారు చేయగలిగితే రాష్ట్రంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. గత పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏనాడు నిరుద్యోగ యువత ఆకాంక్షలను గుర్తించలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇంజినీరింగ్, ఐఐటీ, మెడిసిన్ లాంటి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు బాగానే ఉన్నా బీఏ, బీకాం, బీఎస్సీ లాంటి డిగ్రీ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. వీరితో పాటు ఇంజినీరింగ్ చదివినా అవకాశాలు దక్కని వారిని దృష్టిలో పెట్టుకుని నైపుణ్య శిక్షణ కోర్సుకు రూపకల్పన చేసినట్టు వివరించారు. తాను ఎక్విప్ అనే సాంకేతిక శిక్షణ అందించే సంస్థను సంప్రదించినప్పుడు వారు సానుకూలంగా స్పందించడం ఉత్సాహాన్నిచ్చిందని వెల్లడించారు. సామాజిక బాధ్యత కింద ఎక్విప్ రూ.2.5 కోట్ల వ్యయంతో ఏటా పదివేల మందికి ఉచితంగా ట్రెయినింగ్ ఇవ్వడానికి ముందు కొచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం ప్రతినిధులు మమతా మాదిరెడ్డి, రమేష్ ఖాజా, ఎక్విప్ సంస్థ ప్రతినిధులు హేమంత్ గుప్తా, జి.సాయికిరణ్ పాల్గొన్నారు.

పని గంటలు పెంచితే ప్రమాదమే

(మొదటిపేజీ తరువాయి)

చాలా మంది ఉద్యోగులు నారాయణ మూర్తి చెబుతున్న 'వారానికి 70 గంటల' కంటే ఎక్కువ సమయమే పనిచేస్తున్నారు. అయినప్పటికీ మనుగడ కోసం పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఆశా వర్కర్లు రోజుకు 10-14 గంటలు పని చేస్తున్నారు. ఇంత కష్టపడినా వారికి నెలకు వచ్చే జీతం మూడు వేల రూపాయలు మాత్రమే. గిగ్ వర్కర్లు కూడా రోజుకు ఎనిమిది గంటలు కష్టపడాల్సి వస్తోంది. ఇదంతా కుటుంబ పోషణకోసమేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ఐస్‌లాండ్ అనుభవాలతో...

పని గంటల విషయంలో ఉద్యోగులకు వెసులుబాటు ఉండాలని, అప్పుడే వారు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఎక్కువగా నెరవేరుస్తారని పరిశోధకుల అభిప్రాయం. దీనివల్ల పని ఒత్తిడి కూడా తగ్గుతుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఉద్యోగులతో ఎక్కువ గంటలు పని చేయించుకుంటే వారితో నిరాసక్తత కలుగుతుంది. ఒత్తిడికి గురవుతారు. ఉత్పత్తి కూడా పడిపోతుంది. తక్కువ పని గంటలు సమర్థతను పెంచుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఉదాహరణకు ఐస్‌లాండ్‌లో 2015-2019 మధ్యకాలంలో 2,500 మందికి వారానికి నాలుగు పనిదినాల పద్ధతిని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ కాలంలో వారి ఉత్పాదకత పెరిగిందని తేలింది. వారి ఆరోగ్యం కూడా మెరుగైంది. పని-జీవితం మధ్య సమతూకం ఏర్పడింది.ఐస్‌లాండ్ అనుభవాల నేపథ్యంలో బెల్జియం, జర్మనీ, పోర్చుగల్ కూడా అలాంటి ప్రయోగాలే చేశాయి. అవి కూడా మంచి ఫలితాలనే అందించాయి. పని గంటలు కుదించడం, విశ్రాంతి సమయాన్ని తప్పనిసరి చేయడంపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్థాయిలో చర్చ జరుగుతోంది. పని గంటలను తగ్గించిన బెల్జియం, జర్మనీ దేశాలలో సత్ఫలితాలు కన్పిస్తున్నాయి.

రెండో దశ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

జరిగేందుకు మొత్తం 3502 పోలింగ్ స్టేషన్లను ఈసీ ఏర్పాటు చేసింది. పారదర్శక ఎన్నికల కోసం అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు చెప్పారు. రెండో దశలో 157 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు.

16 దేశాల నుంచి దౌత్యవేత్తల బృందం

రెండో దశ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జమ్మూకాశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు తారీఖ్ హమీద్ కర్రా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనాలు ఉన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని అసెంబ్లీ ఎన్నికలను గమనించటం కోసం యూఎస్, నార్వే, సింగపూర్ వంటి 16 దేశాల నుంచి దౌత్యవేత్తల బృందం బుధవారం చేరుకున్నది. రెండో దశ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 25 లక్షల మందికి పైగా ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. కాశ్మీర్‌లోని గండెర్బాల్, శ్రీనగర్, బుద్గాం, జమ్మూలోని రీయాసీ, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మొత్తం 26 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి, స్వతంత్రులు కలుపుకొని మొత్తం 239 మంది పోటీ చేశారు. శ్రీనగర్ జిల్లాలో అత్యధికంగా 93 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో బుద్గాం (46), రాజౌరీ (34), పూంచ్(25), గండెర్బాల్ (21), రీయాసీ (20) జిల్లాలు ఉన్నాయి.

రెండు స్థానాల నుంచి ఒమర్ పోటీ

ఒమర్ అబ్దుల్లా గండెర్బాల్, బుద్గాం స్థానాల నుంచి పోటీ చేశారు. కర్రా సెంట్రల్ షాల్టెంగ్ నుంచి బరిలో ఉన్నారు. 2014లో విజయం సాధించిన నౌషేరా స్థానం నుంచి రైనా తన అదృష్టాన్ని మళ్లీ పరీక్షించుకోనున్నారు. జైలులో ఉన్న వేర్పాటువాది నాయకుడు సర్జన్ అహ్మద్ వాగే అలియాస్ బర్కాటీ.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రషీద్ లోక్‌సభ విజయ నమోదును ప్రతిబింబించాలని చూస్తున్నాడు. ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో షేక్ అబ్దుల్ రషీద్ (రషీద్ ఇంజినీర్‌గా పేరున్నది) తీహార్ జైలులో నుంచే బారాముల్లా స్థానం నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లాపై పోటీ చేసి విజయం సాధించిన విషయం విదితమే. రెండు లక్షలకుపైగా ఓట్ల తేడాతో రషీద్ విజయం స్వంతం చేసుకున్నాడు. ఇప్పుడు బర్కాటీ కూడా అదే ఆశతో ఉన్నాడు. ఈయన బీర్వాహ్, గండెర్బాల్ స్థానాల నుంచి పోటీలో ఉన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన ఒమర్ అబ్దుల్లాకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఇక రెండో దశలో బరిలో ఉన్న కీలక నాయకుల్లో అప్నీపార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ బుఖారీ (చన్నాపోరా), మాజీ మంత్రులు మహమ్మద్ సాగర్ (ఖన్యార్), అబ్దుల్ రహీమ్ రాథర్ (చ్రార్-ఇ-షరీఫ్), చౌదరీ ఝుల్ఫీకర్ అలీ (బుధాల్), సయీద్ ముస్తాఖ్ బుఖారీ (సురన్‌కొటే)లు ఉన్నారు. చౌదరీ ఝుల్ఫీకర్ అలీ, సయీద్ బుఖారీలు ఈ సారి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు.

అక్టోబర్ 1న తుది దశ.. 8న ఫలితాలు

జమ్మూకాశ్మీర్‌లో మొత్తం మూడు దశల్లో ఈసీ ఎన్నికలను నిర్వహించనున్నది. ఇప్పటికే, ఈ నెల 18న 24 స్థానాలకు పోలింగ్ ముగిసింది. 61.38 శాతం పోలింగ్ నమోదైంది. ఇక మూడో దశలో 40 స్థానాలకు వచ్చేనెల 1న ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

జమ్మూకాశ్మీర్ ప్రజాస్వామ్య వేడుకకు 15 దేశాల దౌత్యవేత్తలు

జమ్మూకాశ్మీర్‌లో దాదాపు పదేండ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి అసెంబ్లీ ఎన్నికలను తిలకించడానికి ఏకంగా 15 దేశాల దౌత్యవేత్తలు బుధవారం జమ్మూకాశ్మీర్‌కు తరలివచ్చారు. అమెరికా, నార్వే, ఫిలిప్పీన్స్, అల్జీరియా, స్పెయిన్, సౌత్ ఆఫ్రికా దేశాలతోపాటు మరికొన్ని దేశాలకు చెందిన దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. ప్రత్యేక హెూదా కోల్పోయిన ఆ రాష్ట్ర ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఇబ్బందులు, కష్టాలు పడుతున్నారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత దాదాపు జమ్మూకాశ్మీర్ మొత్తం అనేక నిర్బంధాలను ఎదుర్కొంది. యావత్ ప్రపంచం దీనిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలను పరిశీలించేందుకు, ప్రజాస్వామ్య వేడుకలో ప్రజలు ఏ విధంగా పాల్గొంటున్నారో తెలుసుకునేందుకు దౌత్యవేత్తలు జమ్మూకాశ్మీర్‌కు తరలివచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హెూదా పునరుద్ధరణకు.. పార్లమెంటులో పోరాడుతాం : రాహుల్

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించేందుకు పార్లమెంటులో పోరాడుతామని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. దాని కోసం వీధుల్లోకి కూడా వెళ్తామని అన్నారు. బుధవారం జమ్మూలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రజల శ్రేయస్సును అంతం చేయడానికి, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), బయటి వ్యక్తుల ద్వారా ఈ ప్రాంతాన్ని నడపాలని బీజేపీ భావించిందని విమర్శించారు. అందుకే జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హెూదాను లాక్కున్నదని ఆరోపించారు. 'లెఫ్టినెంట్ గవర్నర్ ఇక్కడ ఉండే వరకు, జమ్మూకాశ్మీర్ ప్రజల కష్టాల వల్ల బయటి వ్యక్తులు ప్రయోజనాలు పొందుతూనే ఉంటారు' అని విమర్శించారు.



కాగా, జమ్మూకాశ్మీర్ ఎన్నికలు ప్రజల హక్కులకు సంబంధించినవని రాహుల్ గాంధీ తెలిపారు. 'రాష్ట్ర హెూదాను మేం పునరుద్ధరిస్తాం. స్థానిక పరిశ్రమలను మా ప్రభుత్వం కాపాడుతుంది. సామాన్యుల కోసం బ్యాంకుల తలుపులు తెరుస్తాం' అని అన్నారు. మరోవైపు దేశ చరిత్రలో 1947 నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలను రాష్ట్రాలుగా, రాష్ట్రాలను రెండుగా విభజించిన సందర్భాలు ఉన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే ఏనాడూ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించలేదన్నారు. ఇది ప్రజలకు తీవ్ర అన్యాయమని అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని విమర్శించారు. ఎన్నికల ముందు రాష్ట్ర హెూదాను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని తామంతా భావించామని, అదే సరైన మార్గమని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే వారు (బీజేపీ) మొదట ఎన్నికలకు వెళ్లారని విమర్శించారు. 'ఏదైనా కారణం చేత బీజేపీ దీనిని చేయకపోతే, ఇండియా కూటమి మొదటి పని ఇదే. ఎందుకంటే రాష్ట్ర హెూదా ఇవ్వడం మీ హక్కు' అని అన్నారు.

అడ్డగోలు పెట్రో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

అనేక రాష్ట్రాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100పైనా, డీజిల్ ధర రూ.90పైనే పలుకుతోంది. గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధర నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఇటీవల కేంద్ర చమురుశాఖ కార్యదర్శి పంకజ్ జైన్ అన్నారు. కానీ చమురు ధరలు దిగివచ్చినప్పటికీ కేంద్రం ఇప్పటికీ హెచ్చు ధరలను కొనసాగిస్తూనే ఉంది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచంలోని అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో భారత్ ఒకటిగా ఉంది. రష్యా ముడి చమురు ఇప్పటికీ తక్కువ ధరకే లభిస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి గత వారం స్వయంగా ప్రకటించారు. దాంతో రష్యన్ కంపెనీల నుంచి మరింత చమురును కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్-రష్యాల మధ్య నెలకొన్న భౌగోళిక అనిశ్చితుల వల్ల యూరప్ దేశాలు రష్యా చమురు దిగుమతిపై ఆంక్షలు విధించాయి. దాంతో రష్యా చమురు ధరను భారీగా తగ్గించడంతో పాటు రూపాయిల్లోనూ వాణిజ్యం చేసుకునేందుకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది భారత్‌కు చాలా కలిసివచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు భారత్‌కు చమురు దిగుమతిలో రష్యా వాటా 1 శాతం కంటే తక్కువే ఉండేది. క్రమంగా అది పెరుగుతూ దాదాపు 40 శాతం వాటాకు చేరింది. పైగా రష్యా నుంచి చౌకగా చమురును దిగుమతి చేసుకుంటుంది. అయినప్పటికీ ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందించక పోగా ఎక్సైస్ టాక్స్‌ను పెంచే యోచనలో ఉందని సంకేతాలు వస్తున్నాయి. దేశంలోని అధిక చమురు ధరలు ప్రజల ఆదాయాలకు గండి కొడుతున్నాయి. మరోవైపు హెచ్చు ఇంధన ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎక్సైస్ టాక్స్‌ను మరింత పెంచి తన ఖజానాను భారీగా పెంచుకునే పనిలో పడటం గమనార్హం.

దసరాకు ఇందిరమ్మ కమిటీలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధి, విధానాలను ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించు కుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని తెలిపారు. ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇండ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో డేటా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బందికి సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు వివరించారు. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతి ప్రకారం నియామకాలు చేపట్టాలని అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇండ్లు వేలం వేయాలని సూచించారు. ఏండ్ల తరబడి వథాగా ఉంచడం సరికాదనీ, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇండ్లను అప్పగించా లన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ.గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.







'శౌర్యయాత్ర'కు జన హారతి

ప్రజానాట్యమండలి కళారూపాలు - చరిత్రకు నీరాజనాలు

ఆత్మీయతతో అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న ప్రజలు

తెలంగాణను దొరలేలిన నాడు... మట్టి మనుషులు వెట్టిగోడుతో విలవిలలాడిన నాడు.. పల్లెపల్లెన ప్రజా దండు దొరలకు ఎదురు తిరిగి ఎర్రజెండైంది. సంఘమై నిలిచిన మట్టి మనుషుల త్యాగం నెత్తురై పారింది. ఊరుఊరు రణరంగమైంది... ప్రతి తోవ తిరుగుబాటు తోరణమైంది. నాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను... మరోసారి మళ్లీ కళ్లముందుంచుతూ నేడు ప్రజానాట్య మండలి చేపట్టిన శౌర్యయాత్రకు ప్రజలు హారతి పడుతున్నారు. పల్లెపల్లె వీరుల త్యాగల వలపోతలో ఓలలాడుతోంది. కళాతరంగాలై ప్రజానాట్యమండలి ఆలపిస్తున్న రాగాలకు... నాడు చిందిన వీరుల నెత్తుటి రూపాలు ఊరుఊరున ఎర్రని స్థూపాలై మెరుస్తున్నయ్..!

అనంగారి భాస్కర్

ఈ దృశ్యమంతా ఎక్కడో కాదు... తెలంగాణ వ్యాప్తంగా రణక్షేత్రాలను సందర్శిస్తూ ప్రజానాట్యమండలి చేస్తున్న "శౌర్య యాత్ర" కవాతులో కనిపించే కళా ప్రదర్శనా శిల్పాలు. అవును.. అతిశయోక్తి కాదు.. శౌర్యయాత్ర కేవలం ఓ కళాయాత్ర కాదు. ప్రపంచ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిన వీరతెలంగాణ సాయుధ పోరాట త్యాగాల్ని తలకెత్తుకుని చేస్తున్న యుద్ధ కవాతు.

నాటి సాయుధ పోరాట గాథలు, బాధలు చెప్పాలంటే... రణభూమిలో నడిచిన అనుభవం కావాలి. లేదా ఆ వారసత్వాన్ని తలకెత్తుకున్న తెగువ కావాలి. జెండాలై దౌర్జన్యపు దండుపై తిరగబడ్డ గుండెలు కావాలి. ఏదీ కానోడు, కష్టంలో ఎన్నడూ తోడులేనోడే ఎక్కువ ఎగురుతున్న కాలమిది. విద్వేషం నూరిపోయడం తప్ప... ప్రజా పోరాట లక్షణమే లేని కొందరు పిరికిపందలు.. నెత్తుటి వాసనను అద్దుకుని నీతి బోధ చేయాలనుకునే రాబందులు.. వాడు, వీడు, ఎవడెవడో... ఈ నేల చరిత్రకు మతం మరకలద్ది విమోచనంగా, వ్యక్తి విజయంగా.. వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న సమయమిది. ఇలాంటి తరుణంలో.... నాటి వీరుల శౌర్యాన్ని.. వెట్టిని, దోపిడీ దౌర్జన్యాల్ని ఎదిరించి... స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కాంక్షించి ప్రజాయుద్ధం నడిపిన సంఘం స్ఫూర్తిని, కమ్యూనిస్టు యోధుల కీర్తిని చాటుతూ శౌర్యయాత్రకు పురుడు పోసి... పల్లెపల్లెను ప్రేమగా అల్లుకుంటున్నది ప్రజానాట్యమండలి.

యాత్రకు చక్కని స్పందన

టీవీ, సినిమాల ప్రభావం తీవ్రమైన కాలంలోనూ... మా యాత్రకు చాలా చక్కని స్పందన లభిస్తోంది. ఉదయం 7 గంటలకు కళారూపాలు ప్రారంభించినా... పనులన్నీ ఆపేసి చూసేందుకు భారీగా ప్రజలు వస్తున్నరు. ఈ యాత్ర నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎంతలా అంటే... నేనే స్వయంగా వీర తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నంత చైతన్యాన్ని అందించింది.



- వేల్పుల వెంకన్న, యాత్ర సమన్వయకర్త

రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చి రంగారెడ్డి జిల్లాలో 10 రోజులు సుశిక్షితులైన 35మంది ప్రజానాట్యమండలి కళాకారుల బృందంలో అనుభవజ్ఞులు కొందరే... మిగిలినదంతా కొత్త నీరే.. అయినా నాటి వీరుల స్ఫూర్తిని ఒడిలో నింపుకుని ప్రదర్శనలో వారు చూపుతున్న కళా నైపుణ్యానికి జనం జేజేలు పలుకుతుంటే, వారి క్రమశిక్షణకు అన్ని రంగాల, సంఘాల, పార్టీల నేతలు ముచ్చట పడుతున్నారు. ఎందుకంటే.. వారు చెబుతున్నది ఓ మహత్తర సమరం గురించి. వారు చెబుతున్నది తెలంగాణ మట్టిసాళ్లలో నిత్యం సత్యమై చిగురించే త్యాగాల మొక్కల గురించి. అందుకే అనేకమంది ప్రముఖులు, పాత్రికేయులు ఇలాంటి యాత్ర ఎలాంటి లాభాపేక్ష లేని ప్రజానాట్యమండలికి మాత్రమే సాధ్యమని మద్దతు ప్రకటిస్తున్నా.. నాటి సిసలైన జన పోరాటమైనా.. నేటి అసలైన ప్రజా ఉద్యమాలైనా కమ్యూనిస్టులకే సాధ్యమని బహిరంగంగా కీర్తిస్తున్నా అమరు లకు అరుణాంజలి ఘటించారు. శౌర్య యాత్ర ఎక్కడికి వెళ్లినా వందలాదిగా తరలివస్తున్న జనం... ప్రదర్శన పూర్తయినా కూడా అక్కడి నుంచి కదలకపోవడం, పాటలకు కోరస్ ఇవ్వడం, ఆటకు అడుగులు కలపడం వంటి ఘటనలు ఈ యాత్రలో కోకొల్లలు.

రంగుల హంగులు లేవు... నగిశీల కిరీటాలు లేవు.. ఆహార్య ఆర్భాటాలు లేవు..... కొంత ఆధునికత..., మరికొంత వైవిధ్యం..., అంతకు మించిన చైతన్యం... ఇవే వారి ఆయుధాలు. అందుకే వారి శౌర్యయాత్ర.. గాలివానలు, కరెంటు కోతలు, ప్రకృతి ఆటంకాల్ని సైతం అధిగమిస్తూ నిరాటంకంగా ముందుకు సాగుతోంది. వర్షాల కారణంగా సెప్టెంబర్ 1కి బదులు 6న నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో మొదలైన ఈ యాత్ర... వరుసగా తేరటి పల్లి, సూర్యాపేట, కడవెండి, కామారెడ్డి గూడెం, జనగాం, పాలకుర్తి, ఇప్పగూడెం, జాఫర్ ఘడ్, పెరుమాడ్ల సంకీస, కరివిరాల కొత్తగూడెం, ఎలుగుపల్లి అన్నారం, రామన్నగూడెం, మర్రిగూడెం, నల్లగొండ, అప్పాజీపేట, మునిపంపుల, వరంగల్, మానుకోట, రాఘవపురం, హైదరా బాద్, డిండిచింతపల్లి, అలంపూర్, వనపర్తి, బండలేమూర్... తర్వాత జోగిపేట, సంగారెడ్డిలో ప్రదర్శనలు ముగించుకుని... ఇప్పుడు ఖమ్మం దిశగా సాగుతోంది.

ఈ ప్రయాణం అంత సులువైన దేమీ కాదు. ఉదయం 5 గంటలకు నిద్రలేస్తున్న కళాకారులు స్నానాల తర్వాత సిద్ధమై... జిల్లాల సరిహద్దులు దాటుతూ రోజూ సుమారు 120 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి తదుపరి ప్రదర్శన చోటుకి చేరుకుంటున్నారు. అక్కడ భోజనం తర్వాత కాసేపు విశ్రాంతి. మళ్లీ మధ్యాహ్నం 3 గంటలకు లేచి ఫ్రెషప్ అయిన తర్వాత.. ప్రదర్శన ప్రాంగణాన్ని పరిశీలించడం, లైట్లు, మైకులు ఏర్పాట్లు చేసుకోవడం, 5 వరకు డ్రెస్‌కోడ్‌లోకి మారి... డప్పు శబ్దాలతో, కాగడాల వెలుగులతో.. గ్రామంలో ప్రదర్శన చేపట్టి ఊరేగింపు పూర్తి చేసుకుని సా.6 వరకు కళాప్రాంగణానికి చేరుకుంటున్నారు. డప్పు, చిడుతలు, కోలాట సమ్మిళిత ప్రారంభ కళావిన్యాసాలు, సంప్రదాయ జానపద కథా రాగాలతో ప్రజలతో మమేకమై.. "శౌర్యయాత్ర" ప్రారంభ నత్యంతో యాత్ర ఉద్దేశాన్ని చాటుతున్నారు. యోధులకు ఘనంగా అంజలి ఘటి ప్రజలందరిచే ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. తర్వాత.. నేటి నాయకులకు, నాటి ప్రజానాయకులకు మధ్య అంతరాన్ని తెలిపే "బూతులపురాణం"తో ఆలోచింపజేస్తూ.. ప్రశ్నకు ఎన్నటికీ మరణంలేదని "జీ హుజూర్" ద్వారా చాటుతూ.. మనుషులంతా ఒక్కటేనని "హిందూముస్లీం" ఖవ్వాలితో తెలిపి.. "చారాన-బారాన" నాటికతో దోపిడీ తీరును ఎండగడుతున్నారు. ఇక సభానంతరం.. తెలంగాణ సాయుధ రైతాంగ సమరానికి అద్దం పట్టే "వీరతెలంగాణ" వీధినాటికతో జనాన్ని ఆవహించి తమ కళారూపాలతో ఆలోచింపజేస్తున్నారు. ఇక...ప్రజల జీవన స్థితిగతులు, వర్తమాన రాజకీయాలపై పదునైన పాటలు, నృత్యాలు సరేసరి. ఈ ప్రదర్శన పూర్తయ్యే సరికి రాత్రి 11.30 దాటితే.. సామాన్లు సర్దుకుని భోజనం చేసేసరికి రాత్రి 1 అవుతోంది. తర్వాత రెండు కునుకులు తీసేలోపే కోడికూతతో మళ్లీ కళా పయనం ప్రారంభం. సుదీర్ఘ ప్రయాణాలు, ఒల్లు నొప్పులు, అనారోగ్యాలు, ఇతర సమస్యలు.. దానికి తోడు బీజీ షెడ్యూల్. అయినా.. కళాకారుల్లో అలసట ఆవగింజంతైనా కనిపించడం లేదు. తొలిపొద్దు కిరణాల్లా వారిలో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతోంది. తమ కష్టాన్ని మరచి రోజురోజుకు ప్రదర్శనలతో రాటుదేలుతున్నారు. అవాస్తవిక నేపథ్యంలో అసత్య ప్రచారాల పరదాల్ని చీల్చుతూ.. నిప్పులాంటి నిజాల్ని పల్లెల చెంతకు, ప్రజల చెంతకు చేరుస్తున్నారు. అందుకే ...ఈ శౌర్యయాత్ర సందేశాన్ని గుండెల కద్దుకుంటూ... పల్లెపల్లె ప్రజానాట్యమండలి ప్రజా కళాకారులకు పబ్బతి పడుతోంది.



పోరాట చైతన్యం అలాగే ఉంది



ప్రజల్లో వీరతెలంగాణ పోరాట చైతన్యం అలాగే ఉంది. అందుకే వారు వక్రీకరణల్ని, అవస్తవాల్ని నమ్మడంలేదు. పల్లెపల్లెన మాకు ఈ విషయం అర్థమైంది. కొన్ని చోట్ల స్థబ్దత ఉన్న మాట వాస్తవమే అయినా... కమ్యూనిస్టులపై ప్రజలు ఇప్పటికీ విశ్వాసం కోల్పోలేదని, వారి ప్రేమ, మాటలతో ఈ యాత్ర ద్వారా మాకు మరోసారి అర్థమైంది. కళారంగం ద్వారా ప్రజల్ని కదిలించడంలో, మారుమూల పల్లెల్ని చేరుకోవడంలో సంఘాలు, పార్టీలు మరింత చొరవ చూపాలి. అది ప్రజా పోరాటాలకు మద్దతు ఇస్తుంది.

- వి. ఆనంద్-
పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు

అశేషమైన మద్దతు



ప్రజా సాంస్కృతిక రంగంలో పీఎన్ఎంది సుదీర్ఘ ప్రయాణం అయినా... గత దశాబ్ద కాలంలో మేం నిర్వహించిన కార్యక్రమాలకు భిన్నమైన అనుభవమిది. అనుమానాస్పదంగా అనేక ఆటంకాలు పరిమితుల మధ్య మొదలైన మా యాత్రకు అశేషమైన మద్దతు లభిస్తోంది. యాత్ర సందర్భం, ఎంచుకున్న పోరాట చరిత్ర, కళారూపాల్లో నిజాయితీ, నవ్యతే అందుకు కారణమనేది నా భావన. వనపర్తి-ఆలంపూర్ మార్గంలో మా బస్సు పాడై ఆగిపోతే... వెంటనే సామాన్లతో ఆర్టీసీ బస్సులో నిద్రలేకుండా హైదరాబాద్ చేరుకుని.. రంగారెడ్డి జిల్లాలో బండలేమూర్ ప్రదర్శనను సమయానికి విజయవంతం చేయగలిగాం. ఇలా.. కళాకారుల అంకితభావం కూడా ప్రధానమైనదే. ఈ యాత్ర మాకు సరికొత్త స్ఫూర్తిని ఇచ్చింది. మా అంచనాకు భిన్నంగా.. అనేక కొత్త గ్రామాలు శౌర్య యాత్ర రావాలని కోరుతున్నాయి.

- కట్ట నర్సింహ, పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి

నవచిత్రం

రా మచ్చా మచ్చా..

రామ్‌చరణ్



రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు.

క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మేకర్స్ మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈనెల 28న సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా' ప్రోమోని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. పల్లవిలోని లైన్స్ చూస్తుంటే.. తమన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మూవీ నుంచి పక్కా మాస్ బీట్ సాంగ్ ఆడియెన్స్‌ను అలరించబోతుందని అర్థమవుతుంది. ఈ పాటను గీత రచయిత అనంత్ శ్రీరామ్ రాశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన 'జరగండి జరగండి..' పాట ఎంత సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. 'వినయ విధేయ రామ' చిత్రంలో జోడీగా మెప్పించిన రామ్ చరణ్, కియారా అద్వానీ.. ఈ సినిమాతోనూ అలరించటానికి రెడీ అయ్యారు. ఇయర్ ఎండింగ్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్స్ నుంచి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అన్నీ మావే అనే కాన్ఫిడెన్స్ మేకర్స్‌లో కనిపిస్తోంది. ప్రముఖ ఆడియో కంపెనీ సారేగమ ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ఫ్యాన్సీ

వినోద భరితం..



శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తన 37వ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'సామజవరగమన'తో బ్లాక్‌బస్టర్ అందించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎ.కే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం 10 రోజుల పాటు జరిగిన కేరళ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో ఓ పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాలని చిత్రీకరించారు.

శర్వా, సాక్షి వైద్య డైనమిక్ పెర్ఫార్మెన్స్‌లతో బృందా మాస్టర్ కొరియోగ్రఫీలో సాంగ్‌ని షూట్ చేశారు. దీంతో పాటు పృథ్వీ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీలో ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. త్వరలో ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్. హిలేరియస్ రైడ్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడిగా సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: భాను బోగవరపు, నందు సవిరిగాన, సహ నిర్మాత: అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్..



రజనీకాంత్

రజనీకాంత్ టైటిల్ పాత్ర పోషించిన చిత్రం 'వేట్టయన్- ద హంటర్'. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రివ్యూ పేరుతో చిత్ర యూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని టాప్ మోస్ట్ సీనియర్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌ల ఫొటోలు చూపిస్తూ.. ఈ ఆఫీసర్స్ ఎవరో మీకు తెలుసా! అని సత్యదేవ్ (అమితాబ్ బచ్చన్) అడుగుతారు. వీళ్ల పేరు మోసిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ ఆఫీసర్స్ అని ట్రైనింగ్‌లోని ఓ ఆఫీసర్ సమాధానం చెబుతారు. వేట్టయన్ (రజనీకాంత్) తన డ్యూటీలో ఎంత పవర్‌ఫుల్‌గా వ్యవహరించారు. ఎన్‌కౌంటర్స్ ఎలా చేశారనే సన్నివేశాలను చూపిస్తూ వచ్చారు. రౌడీయిజం పేరు చెప్పి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్న వారిని వేట్టయన్ వేటాడుతుంటాడని ప్రివ్యూ సన్నివేశాల్లో చూపిస్తూ వచ్చారు. ఇక ఫహాద్ ఫాజిల్, దుసారా విజయన్, ప్రతినాయకుడిగా నటించిన రానా దగ్గుబాటి, అభిరామి, మంజు వారియర్ పాత్రలను పరిచయం చేశారు. అసలు వీళ్ల పాత్రలకు, వేట్టయన్‌కు ఉన్న సంబంధం ఏంటి? ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా ఎంతో గొప్ప పేరు సంపాదించుకున్న వేట్టయన్ జీవితంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారనే విషయాలు తెలుసుకోవాలంటే 'వేట్టయన్- ద హంటర్' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.

బ్లాక్ బస్టర్ చిత్రాలు 2.0, దర్బార్, లాల్ సలామ్ వంటి చిత్రాల తర్వాత రజనీకాంత్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో రాబోతున్న సినిమా ఇది.

దిగ్విజయంగా క.. షూటింగ్ పూర్తి



దర్శక ద్వయం సుజీత్, సందీప్‌తో హీరో కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.

దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా టీమ్‌కు తమ కృతజ్ఞతలు తెలిపారు దర్శక ద్వయం సుజీత్, సందీప్.

సుజీత్, సందీప్ స్పందిస్తూ, 'ఈ సినిమా షూటింగ్ అనుభూతిని మాటల్లో చెప్పలేకపోతున్నాం. టీమ్ అంతా ఒక ఫ్యామిలీలా మారిపోయాం. మేమంతా ఇష్టంతో పనిచేయడం వల్ల ప్రతి కష్టంలోనూ హ్యాపీగా ఫీలయ్యాం. ఈ సినిమా మాకు జీవితాంతం గుర్తుండే అనుభవాలు ఇచ్చింది. షూటింగ్ పూర్తయినందుకు బాధగా ఉన్నా, రేపు ఈ సినిమా అందించబోయే విజయాలకు హ్యాపీగా ఎదురు చూస్తున్నాం. మూవీకి వర్క్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్' అని అన్నారు. ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో విడుదల చేయనున్నారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు.

కలి రిలీజ్‌కి రెడీ



ప్రశాంత్ వర్మ ప్రిన్స్

యువ కథానాయకులు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటిస్తున్న సినిమా 'కలి'. ఈ చిత్రాన్ని కథా రచయిత కె.రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. దీనికి శివ శేషు రచన, దర్శకత్వం. లీలా గౌతమ్ వర్మ నిర్మాత. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను డైరెక్టర్ ప్రశాంత్ వర్మ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ థ్రిల్లింగ్‌గా అనిపించింది. గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. టీమ్ అంతా మంచి ఎఫర్ట్స్ పెట్టి చేశారు. వీఎఫ్ఎక్స్ హై క్వాలిటీతో ఉన్నాయి. లీడ్ యాక్టర్స్ ప్రిన్స్, నరేష్ అగస్త్య, నేహా కృష్ణన్ బాగా నటించారు. డైరెక్టర్ శివ శేషు, ప్రొడ్యూసర్ లీలా గౌతమ్ వర్మకి ఆల్ ది బెస్ట్. ఈ మూవీని చూసేందుకు నేనూ వెయిట్ చేస్తున్నా' అని తెలిపారు.

'శివరామ్ (ప్రిన్స్) మంచి వ్యక్తిత్వం ఉన్న పర్సన్. అతని మంచితనం వల్లే ఇబ్బందులు పడుతుంటాడు. 'నువ్వు మంచివాడివే కానీ.. కుటుంబాన్ని ఎలా చూసుకోవాలో నీకు తెలియదంటూ' ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య వాళ్ల పాపను తీసుకుని వెళ్లిపోతుంది. ఈ కష్టాలతో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమవుతాడు శివరామ్. ఆ రాత్రి అతని ఇంటికి ఓ అపరిచిత వ్యక్తి (నరేష్ అగస్త్య) వస్తాడు. ఈ వ్యక్తి ఎవరు, అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య ఘటనలు ఏంటి అనే అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ప్రియదర్శి వాయిస్ ఓవర్ నవ్వించింది. 'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువును వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పోడవుతాడు. ఓడినోడు మధ్యలోనే...' అనే డైలాగ్ "కలి" కథలోని సోల్ ను చెప్పింది. అద్భుతమైన వీఎఫ్ఎక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కాబోతున్నాయి అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మంచి మ్యూజికల్ ట్రీట్ ఇస్తుంది



సి. ప్రేమ్‌కుమార్

హీరో కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో రాబోతున్న చిత్రం 'సత్యం సుందరం'. '96' ఫేమ్ సి. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక నిర్మించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈనెల 28న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ సి. ప్రేమ్ కుమార్ మీడియాతో ముచ్చటించారు.

- '96' లవ్ స్టోరీ. ఇది ఫ్యామిలీ డ్రామా. కార్తీ, అరవింద్ స్వామి క్యారెక్టర్స్ మధ్య ఒక నైట్‌లో జరిగే కథ. వాళ్ళ మధ్య అనుబంధం ఏమిటి?, ఆ ఒక్క నైట్‌లో వారి మధ్య ఎలాంటి మానసిక సంఘర్షణ జరిగిందనేది అసలు సినిమా.
- కార్తీ, అరవింద్ స్వామి ఇద్దరిలో ఎవరు అంగీకరించకపోయినా ఈ సినిమా చేసేవాడిని కాదు. ఇలా ఎందుకు చెబుతున్నానో సినిమా చూసినప్పుడు మీకు అర్థమవుతుంది. వాళ్ళిద్దరే ఆ పెర్ఫార్మెన్స్ చేయగలరు. వాళ్ళ కెమిస్ట్రీ, కాంబినేషన్ ఈ సినిమాకి బిగ్గెస్ట్ స్ట్రెంత్.
- ప్రొడ్యూసర్ సూర్యకి సినిమా అంటే చాలా ప్యాషన్. మంచి సినిమాలు చేయాలనే తపనతో ఉంటారు. ఈ కథ ఆయనకి చాలా బాగా నచ్చింది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు.
- '96' సినిమాకి పని చేసిన మ్యూజిక్ డైరెక్టర్, కెమెరామ్యాన్, ఎడిటర్ ఈ సినిమాకీ పని చేశారు. '96'కి గోవింద వసంత ఎంత మంచి మ్యూజిక్ ఇచ్చారో అందరికీ తెలుసు. ఈ సినిమాకి కూడా అంతే అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. సినిమా మ్యూజికల్ ట్రీట్‌లా ఉంటుంది. టెక్నికల్‌గా సినిమా స్ట్రాంగ్‌గా ఉంటుంది. సినిమాటోగ్రఫీ, విజువల్ ఎఫెక్ట్స్ స్టోరీ చాలా అద్భుతంగా రావడానికి సపోర్ట్ చేసేలా ఉంటాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.